Published by Telangana
TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 269 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ శనివారం 25-10-2025 పేజీలు : 12 వెల : 2/-

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు

### -నిర్లక్ష్యమే కారణమని తేలితే కఠిన చర్యలు తప్పవు



అమరావతి కర్నూలు సమీపంలో జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన శుక్రవారం ఉన్నతస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం, తక్షణమే సహాయక చర్యలు ముమ్మరం చేయాలని, సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదంలో మరణించిన వారి వివరాలను వెంటనే గుర్తించి, వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని వైద్యారోగ్య శాఖకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ ప్రమాదం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లోనూ బస్సుల సాంకేతిక పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ట్రావెల్స్ యాజమాన్యాలకు స్ట్రాంగ్

## జూబ్లిహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు




### -నాలుగు లక్షల మంది ఓటర్లు

హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల ప్రక్రియలు పూర్తయిన తర్వాత, చివరికి 58 మంది అభ్యర్థులు పోటీకి మిగిలారు. దాఖలైన నామినేషన్లతో పోలిస్తే ఈ సంఖ్య తక్కువే అయినా ఈ నియోజకవర్గంలో ఇంత భారీగా పోటీలో ఉండటం ఇదే మొదటి సారి. అక్టోబర్ 14 నుంచి 16 వరకు జరిగిన నామినేషన్ల సమయంలో పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలుచేసారు. పరిశీలనలో చాలా నామినేషన్లు చెల్లకుండా పోయాయి. చెల్లిన వారిలో 23మంది ఉపసంహరించుకున్నారు. ఫలితంగా 58 మంది మాత్రమే పోటీలో ఉన్నారు. ఈ సంఖ్య గత ఎన్నికలతో పోలిస్తే గణనీయంగా ఎక్కువ.

మిగతా 2లో

# సీఎంను పట్టించుకోని మంత్రులు

## కేబినెట్‌పై రేవంత్ పట్టు కోల్పోయారా.?



హైదరాబాద్ మంత్రివర్గంలో ముఖ్యమంత్రే కీలకం. ఆయన నియమించిన వారు మాత్రమే మంత్రులు. ఆయన విశ్వాసం కోల్పోతే మంత్రి పదువులు ఉండవు. అలాగే ముఖ్యమంత్రిపై విశ్వాసం కోల్పోయిన మంత్రులూ కేబినెట్‌లో ఉండలేరు. కానీ తెలంగాణ కేబినెట్ లో జరుగుతున్న పరిణామాలు చూస్తే అటు ముఖ్యమంత్రిపై నమ్మకం కోల్పోయిన మంత్రులు ఇటు ముఖ్యమంత్రి కూడా నమ్మక కోల్పోయిన మంత్రులు కనిపిస్తున్నారు. కానీ ఎవర్నీ ఎవరూ కదిలించలేకపోతున్నారు. దీంతో కేబినెట్ లో విబేధాలపై మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది.

**కేబినెట్ సమావేశాల్లో వాగ్వాదాలు జరుగుతున్నాయన్న ప్రచారం**

మంత్రి వర్గ సమావేశాల్లో సాధారణంగా ఏం జరుగుతుందనేది బయటకు రాదు. కానీ లీకుల ద్వారా ఇలా జరిగిందన్న విషయం మాత్రం చాలా మందికి తెలుస్తుంది. ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో తెలంగాణ కేబినెట్ సమావేశం జరుగుతున్న సమయంలో కొన్ని కొన్ని అంశాల్లో మంత్రుల మధ్య వాగ్వాదం జరుగుతోందన్న ప్రచారం ప్రారంభమయింది. ఏ ఏ అంశాలపై అన్నదానిపై స్పష్టత లేదు కానీ మంత్రులు, ముఖ్యమంత్రి మధ్య కొన్ని విషయాల్లో అభిప్రాయబేధాలున్నాయని, ఈ కారణంగా దూరం పెరిగిందని చెబుతున్నారు. ఇటీవల జూపల్లి కృష్ణారావు నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ లో ఓ టెండర్ విషయంలో పెద్ద వివాదం రేగింది. దానికి సంబంధించిన ఫైల్ సీఎం వద్దనే ఉందని చెబుతున్నారు. ఈ వివాదంలో ఓ ఐఏఎస్ వీఆర్ఎస్ తీసుకుంటున్నారు.

**వరుస వివాదాల్లో మంత్రులు**

మంత్రులు వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. సహచర మంత్రిని సీనియర్ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో కించ పర్చిన అంశం పెద్ద ఇష్యూ అయింది. ఆ మంత్రి హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారు. చివరికి పొన్నంతో క్షమాపణ చెప్పించారు. తర్వాత



## బీహార్‌లో ఎన్డీఏ గెలిస్తే

## మళ్లీ నితీషే సీఎం

### -ఎన్నికల ప్రచారంలో మోదీ హింటిచ్చేశారా.?

పాట్నా బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. సమస్తీపూర్‌లో జరిగిన ఎన్‌డీఏ ఎన్నికల మీటింగ్‌లో ముఖ్యమంత్రి నీతిష్ కుమార్‌ను సీఎం అభ్యర్థిగా పరోక్షంగా మోదీ ప్రకటించారు. నీతిష్ కుమార్ నాయకత్వంలో ఎన్‌డీఏ అన్ని ఎన్నికల రికార్డులను అధిగమించే విజయం సాధిస్తుందని ఆయన ప్రకటించారు. ఈ ప్రకటన ఆర్‌జేడీ-కాంగ్రెస్ సీఎం అభ్యర్థి గా తేజస్వి యాదవ్ ప్రకటించడానికి కౌంటర్ గా భావిస్తున్నారు. సమస్తీపూర్ భారతరత్న మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ స్వస్థలం. మొదట కర్పూరి ఠాకూర్ కుఆయన అయన అడుగుజాడల్లో పేదలు, వెనుకబడిన వర్గాలకు సేవ చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఈబీసీలను ఆకట్టుకోవడం ద్వారా బిహార్ ఓటర్లను ఆకర్షించాలని ప్రయత్నిస్తున్నారు. నితీష్ కుమార్ ఆరోగ్యంపై పుకార్లు వస్తున్న సమయంలో తేజస్వీ యాదవ్ బీజేపీ కూటమిపై సెటైర్లు వేస్తున్నారు. నితీష్ ను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని గెలిస్తే ఆయనే సీఎం అవుతారని ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ నితీష్ నేతృత్వంలోనే విజయం సాధిస్తామని ప్రకటించడం సంచలనంగా మారింది.బీహార్‌లో రెండు కూటముల మధ్య పోరు సాగుతోంది. మూడో పార్టీగా ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ ఒంటరిగా పోటీ చేస్తోంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో పూర్తి స్థాయిలో ప్రచార బరిలోకి దిగారు. ముఖ్యమంత్రి అభ్యర్థిత్వం కూడా కీలకంగా మారింది. 2020 ఎన్నికల్లో ఎన్‌డీఏ 125 సీట్లు గెలుచుకుంది, మహాగఠ్‌బంధన్ 110 సీట్లు సాధించింది. ఈసారి ఈబీసీలు

మిగతా 2లో



## కర్నూల్ బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

హైదరాబాద్ కర్నూలు బస్సు ప్రమాద ఘటన పైన తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. హైదరాబాద్ నుండి బెంగళూరుకు వెళుతున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనలో మరణించిన తెలంగాణ పౌరుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం తరఫున 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ను ప్రకటించింది. గాయపడిన వారికి రెండు లక్షల రూపాయలు సహాయం అందజేస్తామని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది.ఇక కర్నూలు బస్సు ప్రమాద ఘటన పైన స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బాధిత కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయించేలాగా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కర్నూలు సమీపంలో జరిగిన భయానక రోడ్డు ప్రమాద ఘటనలో బైక్ పై వెళ్తున్న వ్యక్తితో

మిగతా 2లో

## కర్నూల్ బస్సు ప్రమాదం కన్నీటిగాథలు




-కర్నూలు వద్ద కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధం

-ప్రమాదంలో 20 మందికి పైగా ప్రయాణికులు సజీవ దహనం

-బైక్ ఢీకొట్టడంతో చెలరేగిన భారీ మంటలు




### స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన

### తీవ్రంగా స్పందించిన జైశంకర్

## హైదరాబాద్ కు మహర్దశ

### -6 స్కైవాక్స్ కు రంగం సిద్ధం




## ఏపీలోనూ హైడ్రా తరహా కార్యాచరణ.?

### -పవన్‌తో రంగనాథ్ భేటీ




## ప్రభుత్వానికి కాసుల వర్షం

### -మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా భారీగా ఆదాయం



# సీఎంను పట్టించుకోని మంత్రులు

వివేక్ తోనూ మరో మంత్రి లక్ష్మణ్ కుమార్ కు సరిపడలేదు. ఇక కొండా సురేఖ గురించి చెప్పాల్సిన పని లేదు. పదవి చేపట్టినప్పటి నుండి ఆమె వివాదాల్లోనే ఉన్నారు. ఇటీవల ఆమె కుమార్తె స్వయంగా ముఖ్యమంత్రి, ఆయన కుటుంబసభ్యులపై ఆరోపణలు చేశారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో సీఎంతో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ఇటీవల అలాంటి వారు కూడా సీఎం చుట్టూ కనిపించడం లేదు.

**మంత్రుల పనితీరునూ పట్టించుకోని ముఖ్యమంత్రి**

మంత్రులు ఇలా గాడి తప్పుతున్నా సీఎం రేవంత్ రెడ్డి పెద్దగా పట్టించుకోవడం లేదు. వారి పనితీరుపై లేధా వారు నిర్వహిస్తున్న శాఖల్లో పురోగతిపై ఇప్పటి వరకూ ఎలాంటి సమీక్షలు చేయలేదు. ఆయా శాఖల పనితీరునూ కనీసం పట్టించుకోవడం లేదు. అదే సమయంలో ప్రభుత్వంపై విపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నా మంత్రులు ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. చాలా పరిమిత మంది మాత్రమే విపక్షాలకు కౌంటర్లు ఇస్తూ వస్తున్నారు. మిగతా అందరూ ఎందుకు మాట్లాడటం లేదంటే మాకు ఎందుకు అన్న పద్ధతిలో ఉంటున్నారు. ఫలానా అంశంపై స్పందించాలని విపక్ష పార్టీలకు కౌంటర్లు ఇవ్వాలని గట్టిగా చెప్పలేకపోతున్నారు సీఎం రేవంత్.

**మంత్రులకూ హైకమాండ్ వద్ద పలుకుబడి**

తెలంగాణ కేబినెట్ లో ఈ పరిస్థితి రావడానికి హైకమాండ్ కుడా ఓ కారణం అన్న అభిప్రాయం వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి హైకమాండ్ పూర్తి అధికారం ఇవ్వలేదు. తనపై పూర్తి స్థాయిలో తిరుగుబాటు చేసిన మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించాలని ఆయన చేసిన విజ్ఞప్తిని హైకమాండ్ పట్టించుకోలేదని పైగా రాజీ చేసిందని అంటున్నారు. ఎవరూ తన మాట వినకపోతూండటంతో సీఎం కూడా తన పని తాను చేసుకుని పోతున్నారని చెబుతున్నారు. కీలక అధికారుల బదిలీల విషయంలోనూ హైకమాండ్ నుంచే ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇటీవల జరిగిన పోలీసు అధికారుల బదిలీల్లోనూ ఇదే జరిగిందని అంటున్నారు. సీఎం రేవంత్ మంత్రి వర్గంపై సీఎం పట్టు సాధించలేకపోవడానికి హైకమాండ్ అధిక జోక్యమే కారణమని గుసుగుసలు వినిపిస్తున్నాయి. కారణం ఏదైనా, తెలంగాణ మంత్రివర్గం మాత్రం సీఎం గ్రిప్ లో లేదని అర్థమైపోతుంది.

# కర్నూల్ బస్సు ప్రమాదం కన్నీటిగాథలు

కర్నూల్ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు ఏ క్షణం ఎలా ఉంటుందో చెప్పలేము అన్న పాత మాట ఎంత నిజమో అని నిరూపిస్తూ విధి ఆడిన వింత నాటకానికి నిదర్శనంగా నిలిచింది కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం. దీపావళి పండుగ సందడి ముగిసిన మరికొన్ని గంటల్లోనే తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనుకున్న పందొమ్మిది మందికి పైగా ప్రయాణికుల జీవితాలు అగ్ని ప్రమాదానికి బలైపోయాయి.

**గమనాలు వేరైనా.. గమ్యస్థానం ఒక్కటే..**

దురదృష్టకర రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన ఆ బస్సులో ఉన్న ప్రతి ఒక్కరిదీ ఒక కథ. కొందరు పండుగ సెలవులు ముగించుకుని ఉద్యోగాలకు తిరిగి వెళ్తున్నవారు మరికొందరు తమ భవిష్యత్తు కోసం ఇంటర్వ్యూలకు వెళ్తున్న యువత వీరందరి ప్రయాణ లక్ష్యాలు వేరు కావొచ్చు, కానీ వారి తుది గమ్యం మాత్రం ఆ మృత్యువు ఒడిలోనే దాగి ఉందని ఎవ్వరూ ఊహించలేదు.

**కన్నీరు పెట్టిస్తున్న తల్లీకూతుళ్ల కథ..**

మెదక్ జిల్లా శివ్వాయిపల్లికి చెందిన మంగ సంధ్యారాణి (43), ఆమె కుమార్తె మంగ చందన (23)ల కథ కన్నీళ్లు తెప్పిస్తోంది. సంధ్యారాణి భర్త మంగ ఆనందకుమార్ గౌడ్ మస్కట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవారు. కుమార్తె చందన బెంగళూరులో కుమారుడు వల్లభ అలహాబాద్‌లోని ఐఐటీలో చదువుతున్నారు. బంధువుల పెళ్లి, దీపావళి వేడుకల కోసం ఈ కుటుంబమంతా ఒక్కటయ్యారు. పండుగ ముగిశాక ఆనంద్‌కుమార్ మస్కట్‌కు వెళ్లిపోయారు. జ్వరం కారణంగా సంధ్యారాణి ప్రయాణం వాయిదా పడింది. తల్లిని చూసుకోవడానికి చందన కూడా హైదరాబాద్‌లోనే ఉండిపోయింది. సంధ్యారాణికి జ్వరం తగ్గగానే కుమార్తెను బెంగళూరులో దించి, అక్కడి నుంచి తను మస్కట్‌కు వెళ్లాలని ప్రణాళిక వేసుకున్నారు.

కానీ ఆ వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వారి ప్రయాణాన్ని శాశ్వతంగా నిలిపివేసింది. నిండు జీవితాలు, నిద్రలోనే సజీవ దహనం అయ్యాయి. ఒకే కుటుంబంలో, ఒకే ఘటనలో తల్లీకూతుళ్లు కనుమరుగవడం ఆ కుటుంబాన్ని తీరని విషాదంలోకి నెట్టింది.

**మురిసిపోయిన సాఫ్ట్‌వేర్ అమ్మాయిలు..**

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన అనూష రెడ్డి, బాపట్ల జిల్లాకు చెందిన ధాత్రి అనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీపావళికి ఇంటికి వచ్చి, సంతోషంగా గడిపి, తిరిగి పని ప్రదేశాలకు వెళ్తూ ఇలా కలకాలం సెలవు తీసుకుంటారని వారి తల్లిదండ్రులు కలలో కూడా ఊహించలేదు.

**ఉజ్వల భవిత కోసం పరుగు..**

బీటెక్ విద్యార్థి జయసూర్య (23) కథ మరో కోణాన్ని చూపింది. ఉద్యోగం కోసం గంపెడాశలతో బెంగళూరులో ఇంటర్వ్యూకు వెళ్తున్న జయసూర్య తాను బుక్ చేసుకున్న బస్సు మిస్సవ్వడంతో ఛేజింగ్ చేసి మరీ మూసాపేట్‌లో బస్సు ఎక్కాడు.

ఎట్టకేలకు బస్సు అయితే ఎక్కాడు కానీ ప్రమాదం అతని వెంటనే ఉందని గమనించలేకపోయాడు. అయితే ఆ ప్రమాదం నుంచి అతడు ఎమెర్జెన్సీ ఎగ్జిట్ నుంచి బయటపడి తన ప్రాణం పోకుండా కాపాడుకున్నాడు.

**నిబంధనల ఉల్లంఘనపై విమర్శలు..**

ఈ తీవ్ర విషాదం వెనుక, ట్రావెల్ బస్సుల నిర్వహణలో ఉన్న లోపాలు చర్చకు వచ్చాయి. ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో రూ. 23 వేల వరకు ఓవర్‌స్పీడ్ చలాన్లు ఉన్నట్లు వెల్లడైంది

. నిబంధనలు పాటించకుండా మితిమీరిన వేగంతో ప్రయాణించడం, ఒడిశా పర్మిట్‌తో మూడు రాష్ట్రాల్లో బస్సును నడపడం వంటి షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం కారణంగానే ఈ నిండు జీవితాలు బలయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటనలో తప్పు ఎవరిదైనా కావచ్చు, కానీ తిరిగి రానివి ఆ అమాయక ప్రాణాలు. విధి రాసిన రాతను ఎవరూ మార్చలేము. నిండు జీవితాలు ఆ మృత్యు జ్వాలల్లో కలిసిపోవడం ప్రతి మనిషి గుండెను కదిలించే కన్నీటి గాథ.

# జూబ్లిహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు

**211 నామినేషన్లలో చివరికి బరిలో నిలిచింది 58 మమంది మాత్రమే**

మొత్తం 211 మంది అభ్యర్థులు మొత్తంగా 321 నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన గురువారం తెల్లవారుజామున 3 గంటల దాకా కొనసాగింది. మొత్తం 321 నామినేషన్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి 186 నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 135 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు తేల్చారు. నామినేషన్ల పరిశీలన అనంతరం 130 మందికి చెందిన నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించగా, 81 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం తెలిపారు. వారిలో 23 మంది ఉపసంహరించుకున్నారు.

**కాంగ్రెస్ ఓడించేందుకు అంటూ నిరుద్యోగులు, ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు పోటీ**

2009 ఎన్నికల్లో 13 మంది, 2014లో 21 మంది, 2018లో 18 మంది పోటీ పడ్డారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 19 మంది పోటీ పడ్డారు. ఈ 19 మందిలో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన మాగంటి గోపీనాథ్ గెలుపొంది వరుసగా మూడోసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు.

ఆయన మరణించడంతో ఉపఎన్నిక అనివార్యమయింది. ఫార్మాసిటీ, ట్రిపుల్ఆర్ బాధితులు, నిరుద్యోగులతోపాటు వివిధ వర్గాలకు చెందిన వారు నిరసన రూపంలో నామినేషన్లు దాఖలు చేసి పోటీలో ఉన్నారు. వారు తాము కాంగ్రెస్ ను ఓడించడమే లక్ష్యంగా పోటీ చేస్తున్నామని ప్రకటించారు

**మూడు ప్రధాన పార్టీల రసరత్తువ పోరు – జోరు ప్రచారం**

బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార బాధ్యతలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పలువురు కీలక నేతలకు అప్పగించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనుంది టీబీజేపీ. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్ కుమార్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారం చేయనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీజేపీ ప్రచారానికి ఉత్తరప్రదేశ్ , గోవా రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ తరపున సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షోలను నిర్వహించే అవకాశం ఉంది.

# ప్రభుత్వానికి కాసుల వర్షం

**-మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా భారీగా ఆదాయం**

**-2,620 దుకాణాల కోసం.. రూ.2,863 కోట్లు**

**-గతేడాదితో పోలిస్తే ఈసారి 218 కోట్లు అదనం**

హైదరాబాద్ రాష్ట్రంలో మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ నిన్నటితో ముగిసింది. అయితే గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి మద్యం దుకాణాలకు దరఖాస్తులు తక్కువగానే వచ్చాయి. అయినా సరే ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని దాదాపు చేరుకుంది. ఆదాయపరంగా చూసుకుంటే గత సంవత్సరం కన్నా ఈ సారి మద్యం దుకాణాల దరఖాస్తుల మీద ప్రభుత్వానికి రూ.218 కోట్లు అదనంగా వచ్చాయి. మద్యం దుకాణాల దరఖాస్తు గడువు గురువారం అనగా అక్టోబర్ 23నాటికి ముగిసింది. ఈ సంవత్సరం మద్యం దుకాణాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 95,436 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.2,863 కోట్ల ఆదాయం వచ్చింది. గతంతో పోల్చితే ఇది రూ.218 కోట్లు అధికం. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ గత నెల అనగా సెప్టెంబరు 25న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ మరసటి రోజు నుంచి అనగా సెప్టెంబర్ 26 నుంచి మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలు పెట్టింది. పోయిన మద్యం షాపుల దరఖాస్తులకు సంబంధించి.. దాదాపు 1.32 లక్షల అప్లికేషన్ల విక్రయం ద్వారా ఎక్సైజ్ శాఖకు దాదాపు రూ.2,645 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే ఈసారి మాత్రం దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం షాపులకు ఈసారి కేవలం 95,436 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అయితే ఈసారి అప్లికేషన్ల సంఖ్య తగ్గినా దరఖాస్తు రుసుమును పెంచడంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం చేరింది. గతంలో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండగా ఈసారి ఆ మొత్తాన్ని రూ.3 లక్షలకు పెంచారు. అలానే మద్యం దుకాణాల అప్లికేషన్ల విక్రమం ద్వారా రూ.3 వేల కోట్ల ఆదాయం ఆర్జించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దాదాపు చేరుకుంది. ఈసారి ఎక్సైజ్ శాఖ అధికారులు ఎక్కువ సంఖ్యలో జనాలు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం కూడా చేశారు. ఈ నెల 18 అర్ధరాత్రి వరకు 89,344 మంది దరఖాస్తు చేశారు. అయితే అదే రోజు తెలంగాణ వ్యాప్తంగా బీసీ బంద్‌కు పిలుపునివ్వడంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు.

దీంతో పలువురు వ్యాపారుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం నెల 23 వరకు గడువు పొడిగించింది. దీంతో 95 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. ఇక ఈనెల అనగా అక్టోబర్ 27న డ్రా తీసి వ్యాపారులను ఎంపిక చేయనున్నారు. డిసెంబర్ ఒకటి నుంచి కొత్త దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈసారి ఒక్కో అప్లికేషన్‌కు రూ.3 లక్షల ఫీజు తీసుకున్నారు. ఇది నాన్ రిఫండబుల్. అలానే ర2023లో వచ్చిన అప్లికేషన్ల సంఖ్య 1.31 లక్షలు కాగా ఈ సారి దాదాపు 36 వేల అప్లికేషన్లు తగ్గాయి. ఫీజు రూ.3 లక్షలు చేయడంతో ఈ సారి అప్లికేషన్లు తగ్గినా ఆదాయం క్రితం సారి వచ్చినందే వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో మద్యం దుకాణానికి సగటున 36 దరఖాస్తులు వచ్చాయి. మద్యం దుకాణాల దరఖాస్తుల్లో శంషాబాద్ ఎక్సైజ్ డివిజన్ నుంచి అత్యధికంగా అప్లికేషన్లు వచ్చాయి. 8,502 అప్లికేషన్లతో శంషాబాద్ డివిజన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక కుమ్రం భీం నుంచి అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ నుంచి కేవలం కేవలం 667 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## బీహార్‌లో ఎన్డీఏ గెలిస్తే మళ్లీ నితీషే సీఎం

(17% ఓటు బ్యాంక్), యాదవులు, ముస్లింలు మీద పోటీ ఉద్ధృతమవుతోంది. మోదీ ప్రకటన ఎన్‌డీఏలో నీతిష్ కుమార్‌కు బలం చేకూర్చడంతో పాటు, బీజేపీ అంతర్గత విభేదాలను అణచివేయడానికి ఉద్దేశించినదిగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు

వార్నింగ్ ఇచ్చారు. ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని విచారణలో తేలితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని పునరుద్ఘాటించారు. ప్రమాదానికి గురైన బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వంటి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులను కోరారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని వీలైనంత త్వరగా అందిస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. అధికారులు ఇప్పటికే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## హైదరాబాద్ కు మహార్దశ

హైదరాబాద్ తెలంగాణ రాజధాని హైదరాబాద్ లో పట్టణ జనాభా రోజురోజుకూ పెరిగిపోతుంది. భాగ్యనగరంలో వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. ట్రాఫిక్ లోనే గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. రోడ్లన్నీ రద్దీగా మారిపోతున్నాయి. దీంతో రోడ్డు పక్కన నడిచే పాద చారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక రద్దీ ప్రాంతాల్లో అయితే అడుగు తీసి అడుగు వేయడం నరకంగా మారుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్ లోని రద్దీ ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పాద చారులు, మహిళలు, చిన్నారులు సులువుగా నడుచుకుంటూ వెళ్లేందుకు స్కై వాక్స్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.గ్రేటర్ హైదరాబాద్ లోని 6 రద్దీ ప్రాంతాల్లో 6 స్కై వాక్స్ ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విధానం ద్వారా ట్రాఫిక్ ను తగ్గించడంతో పాటు రద్దీ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను కూడా నివారించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో నగరంలోని అఫ్జల్ గంజ్, మదీనా, లక్డీ–కా–పూల్, బీహెచ్ఈఎల్, జేఎన్టీయూ, మియాపూర్ టీ– జంక్షన్ లో స్కై వాక్స్ ను నిర్మించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించాలని హైదరాబాద్ మెట్రో డెవలప్ మెంట్ ఆథారిటీ(హెచ్ఎండీఏ) కు ఆదేశాలు జారీ చేసింది.హైదరాబాద్ లోని ఈ ఆరు ప్రాంతాలు నిత్యం రద్దీగా ఉంటున్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో పాద చారులు రద్దీ రోడ్లపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తేల్చారు. ఇదే ప్రాంతాల్లో ట్రాఫిక్, రద్దీ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. అందువల్ల ఈ ప్రాంతాల్లో స్కై వాక్స్ నిర్మిస్తే పాద చారులు సులభంగా రోడ్డు దాటడం ఉంటుందని రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఉప్పల్ స్కై వాక్ కు విశేష స్పందన వచ్చింది. ఈ స్కై వాక్ ను నగర ప్రజలు అద్భుతంగా వినియోగించుకుంటున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఇక మెహదీపట్నం వద్ద కూడా ఓ స్కై వాక్ ను నిర్మిస్తున్నారు. అలాగే సికింద్రాబాద్ లోని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, మెట్రో స్టేషన్ కు కలుపుతూ మరొక స్కై వాక్ నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. మరోవైపు లీ అసోసియేట్స్ ఇటీవల నిర్వహించిన సర్వేలో హైదరాబాద్ లోని 23 రద్దీ ప్రాంతాల్లో స్కై వాక్స్ అవసరం అని నివేదించింది. ఈ క్రమంలో తొలుత ఈ ఆరు ప్రాంతాల్లో స్కై వాక్స్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## ఏపీలోనూ హైడ్రా తరహా కార్యాచరణ.?

అమరావతి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ సమావేశమయ్యారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్‌లో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల రక్షణకు హైడ్రా కృషి చేస్తోన్న విషయం తెలిసిందే. హైడ్రా హైదరాబాద్ నగరంలో కోట్లాది రూపాయల విలువ చేసే భూములను పరిరక్షించింది. ఈ నేపథ్యంలో వీరి మధ్య రెండు గంటల పాటు సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. హైదరాబాద్ నగరంలో హైడ్రా పనితీరు తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే, ఈ భేటీ మర్యాదపూర్వకంగా జరిగిందని పవన్ కల్యాణ్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టినప్పుడు ఏపీలోనూ అలాంటి వ్యవస్థ ఉండాలని పవన్ ఆకాంక్షించారు. ఈ క్రమంలో వీరి మీటింగ్ జరగడం ఆసక్తికరంగా మారింది.

## స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన

## తీవ్రంగా స్పందించిన జైశంకర్

న్యూఢిల్లీ మైనారిటీల రక్షణ, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులను కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ గట్టిగా స్పందించారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవని స్పష్టం చేశారు. ఐరాస 80వ వార్షికోత్సవం సందర్భంగా పోస్టల్ స్టాంపు విడుదల చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వివాదాల యుగంలో శాంతి అవశ్యమని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ఐక్యరాజ్య సమితిలో అంతా సరిగా లేదని అన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితిలో మార్పులు జరిగేలా సంస్కరణలు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితికి భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని, అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ ఐక్యరాజ్య సమితి నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. జాత్యాహంకారం, వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను స్విట్జర్లాండ్ ఎదుర్కొంటున్న సంగతిని ఆయన ప్రస్తావించారు.

## కర్నూల్ బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

సహా మొత్తం 20 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది.

**మృతులను గుర్తిస్తున్న అధికారులు**

మంటల్లో కాలిపోయిన బస్సు నుంచి ఇప్పటివరకు 19 మృతదేహాలను వెలికితీయగా ఫోరెన్సిక్ బృందాలు శవ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ బస్సు ప్రమాద ఘటనలో తెలంగాణకు చెందిన వారు ఇంకా ఎంతమంది ఉన్నారు అనే వివరాలు నిర్ధారించవలసి ఉంది. కర్నూలు బస్సు ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన తల్లి కుమార్తె మృతి చెందినట్లు చెబుతున్నారు. మృతులను మెదక్ జిల్లా శివ్వాయి పల్లికి చెందిన తల్లి కూతుర్లు సంధ్యారాణి, చందన గా గుర్తించారు.

తెలంగాణా నుండి మృతుల వివరాల కోసం ఆరా

తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కొండూరు కు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పని చేస్తున్న అనూష రెడ్డి కూడా మృతి చెందినట్టు నిర్ధారించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన బస్సులో సూరారం, జేఎన్టీయూ, పటాన్ చెరువు ప్రాంతాల నుంచి పలువురు ఉన్నారు. జెఎన్టియు వద్ద ఎక్కిన ముగ్గురిలో ఒకరు సురక్షితంగా బయటపడగా మరో ఇద్దరి ఆచూకీ తెలియడం లేదు.

తెలంగాణా నుండి ఎందరు

**మృతి చెందారో ఇంకా తేలని లెక్క**

సూరారం వద్ద ఎక్కిన గుణ సాయి అనే వ్యక్తి కిటికీ ద్వారా దూకి ప్రాణాలతో బయటపడ్డాడు. ఇక మరో ప్రయాణికుడు ఫోన్స్ స్విచ్ ఆఫ్ లో ఉండడంతో అతను కూడా మరణించి ఉంటాడని భావిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువుకు చెందిన పిలోమీ నాన్ బేబీ, కుమారుడు కిషోర్ కుమార్ ఆచూకీ కూడా తెలియడం లేదు. దీంతో వీరు కూడా మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. అయితే మొత్తం ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంత మంది మృతి చెందారు అనేది పూర్తి వివరాలు తెలియలేదు. ప్రస్తుతం సంఘటన స్థలంలోనే డిఎన్ఎ పరీక్షలు, పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.

సత్యమేవ జయతే

శనివారం 25 అక్టోబర్ 2025

## లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన పరిగి ఎమ్మెల్యే. టీ రామ్మోహన్ రెడ్డి...



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.గండీడ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పరిగి ఎమ్మెల్యే %డ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గండీడ్ మండలంలోని పలు గ్రామాలకి చెందిన 24 మంది లబ్ధిదారులకు రూ.24,02,784 విలువగల 'కళ్యాణ లక్ష్మి' మరియు 'షాదీ ముబారక్' చెక్కులను స్థానిక నాయకులు, అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలపై పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు

### అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి

### జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి





సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా :వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన అమర వీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేశారు. విధి నిర్వహణలో దేశం కోసం, రాష్ట్రం కోసం అమరులైన పోలీసుల స్ఫూర్తిని, వారి ధైర్య సాహసాలను ఎప్పటికీ మర్చిపోకూడదని ఆయన తెలిపారు. ఈ వ్యాసరచన పోటీల నిర్వహణ ముఖ్య ఉద్దేశం, ప్రస్తుత పోలీస్ సిబ్బందిలో అమరవీరుల త్యాగనిరతి, దేశభక్తిని మరింతగా పెంపొందించడమే అని పేర్కొన్నారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. వారి సేవలకు గుర్తింపుగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రతి పోలీస్ సిబ్బంది నిబద్ధతతో, అంకితభావంతో పనిచేయాలని, అమర వీరులు చూపిన బాటలో నడవాలని ఆయన సూచించారు.ఇట్టి కార్యక్రమం లో డి సి ఆర్ బి డీస్పీ జానయ్య , పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది..

## పత్తి రైతుల గిట్టుబాటు ధర క్వింటాల్ 15000 ఇవ్వాలి.5000 బోనస్ ఇవ్వాలి కొనుగోలు కేంద్రాలు ఓపెన్ చెయ్యాలి. సిపిఎం జిల్లా . కార్యదర్శి.... ఆర్ మహిపాల్...



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా : వికారాబాద్ జిల్లాలో వేలాది ఎకరాల పత్తి పంట నీట మునిగి రైతులు నష్టపోయారు. వెంటనే ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో గ్రామాల్లో పంటలు వర్వే చూపించాలి.నష్టపోయిన రైతులు ఎకరాకు 50నుండి 60వేల వరకు నష్టపోయారు. ఇందిరమ్మ ప్రభుత్వం రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలి. పత్తి కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేసి ఓపెన్ చేయాలి. క్వింటాలుకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్కు 8వెళ్ల నుండి 15000 పెంచి ఇవ్వాలి. బోనస్ 5000వేలు ఇవ్వాలనీ రైతుల పక్షాన భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పార్టీ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాము అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ జిల్లా కమిటీ సభ్యులు సతీష్ నాయకులు అగ్బూర్ ప్రశాంత్ నవీన్ కుమార్ రాజేందర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు..

# పరిగి లో ప్రొహిబిషన్ %డ% ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి..





.సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా..పరిగి మున్సిపాలిటీ పరిధిలోని తుంకుల్ గడ్డ లో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే %డ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రధాన లక్ష్యం ప్రజల భద్రత,చట్ట పరిరక్షణ అని తెలిపారు. నూతన ఎక్సైజ్ స్టేషన్ ప్రారంభంతో ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.

కల్తీ మద్యం విక్రయం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని,ఇటువంటి అక్రమాలను అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజల్లో కల్తీ మద్యం ప్రమాదాలపై అవగాహన కల్పించి దాని నియంత్రణకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే డ్రగ్స్ బారిన పడి యువత చెడిపోతున్నారని, దానివల్ల వారి జీవితాలు నాశనం అవుతున్నాయని, ఈ సమస్యను తీవ్రంగా పరిగణించి,



డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టడంలో కేవలం పోలీసు అధికారులే కాదు, ప్రతి పౌరుడి బాధ్యతగా భావించి ఎక్కడైనా డ్రగ్స్కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. మన సమాజాన్ని మనమే బాగు చేసుకోవాలి. డ్రగ్స్ లాంటి చెడు కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని ఉక్కు పాదం మోపి అణచివేయాలి. సమాజం శుభ్రంగా ఉండడం మనందరి బాధ్యత," అని పిలుపునిచ్చారు..

## మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరి-చేందుకు ప్రభుత్వం పెను మార్పులు తీసుకువస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య , క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి...



.. సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా...వికారాబాద్ జిల్లా కోట్ పల్లి ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని చెరువులో మూడు రకాలతో కూడిన 10 లక్షల పై చీలుకు చేప పిల్లలను వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులతో కలిసి వదిలారు. జిల్లాలో ఒక కోటి 29 లక్షల చేప పిల్లలను వదిలేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం జరిగిందని దీనికి కోటి 7 లక్షల రూపాయలను వెచ్చించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 5 లక్షల మత్స్య కారుల కుటుంబాలకు జీవనోపాధి కలిగే విధంగా 123 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం లో తాండూర్ ఎమ్మెల్యే బి మనోహర్ రెడ్డి. వికారాబాద్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రోటిబండ తండా, పులిచెర్ల కుంట తండా రైతుల భూములు ఇవ్వాలని ఇబ్బందులు పెడుతున్న జిల్లా అధికారులు,బలవంతం భూ సేకరణ ఆపాలని కలెక్టర్ కార్యాలయం ముందు ఛాంబర్ వద్ద నిరసన. సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్....



సత్య మేవ జయతే. వికారాబాద్ జిల్లా.. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో దుద్యాల మండల పరిధిలోని లగాచర్ల పరిధిలోని రోటిబండ తండా, పులిచెర్ల కుంట తండా కు చెందిన 30మంది రైతులను, శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అధికారులు పిలిపించి జిల్లా అధికారులు బలవంతంగా భూషకరణ చేస్తాఉన్నారు. ప్రభుత్వం మీ భూములు కంపెనీలకు కచ్చితంగా ఇవ్వాలని, పరిహారం ఎకరాకు 20 నుండి 23లక్షలు చొప్పున పర్యారం ఇస్తాము. అందరు భూమిని ఇవ్వాలి లేనిచో మీ అందరిపైన కోర్టులో కేసులు వేసి బలవంతానికి మీ అకౌంట్లో 6లక్షలు వేస్తాము. మీ దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ అధికారులు భూ బాదితులను జిల్లా కలెక్టర్ అధికారులు ప్రభుత్వం ఇబ్బందులకుగురిచేస్తా ఉన్నారు. ఈ ప్రభుత్వం తీరు మార్చుకోవాలని సిపిఎం పార్టీగా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో కొండలు గుట్టలు వ్యవసాయానికి యోగ్యం కానీ భూములను తీసుకోవాలి. కొడంగల్ పట్టణంలో 2000లకు పైగా ప్రభుత్వ భూములు మాజీ ఎమ్మెల్యే భూములు ఉన్నవి అవి తీసుకొని పరిశ్రమలు పెట్టాలి. కానీ వ్యవసాయం చేసుకుంటూ బోర్లు బావులు ఉండి ఆరుగాలం పండించే పంట భూములను ప్రభుత్వం కంపెనీల పేరుతో తీసుకోవడం కరెక్ట్ కాదు. రైతులు అనుమతి ఉంటేనే భూములు తీసుకోవాలి అనుమతి లేనిచో భూములు తీసుకోవద్దు. 2013 యాక్ట్ చెప్తుంది. 2013 చట్టం ప్రకారం ఈరోజు బయట ప్రైవేటు మార్కెట్ ధర రెండు కోట్ల పలుకుతా ఉంది. ఆ ప్రకారం ఎకరాకు 6 కోట్ల చొప్పున ఇవ్వాలి ఒకరికి ఉద్యోగం ఇందిరమ్మ ఇల్లు 600 ఇంటి స్థలం ఇవ్వాలి. కానీ ఇదంతా ఇవ్వకుండా రైతులను 60 కిలోమీటర్ల నుండి పిలిపించుకొని జిల్లా అధికారులు ప్రభుత్వం చెప్పినట్లుగా భయభ్రాంతులకు గురిచేస్తూన్నారు. ఈ బలవంత భూసేకరణ వెంటనే ఆపాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం మీలానే మొండిగా వ్యవహరిస్తే లగచర్ల రోడ్డుబండ పులిచెర్లకుంట తండాలో రైతులకు మద్దతుగా సిపిఎం పార్టీ రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. అవసరమైతే సీఎం ఇంటి వద్ద కొడంగల్ లోనే నిరాహార దీక్ష లు చేస్తామని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ముందు ఆవరణలో సిపిఎం పార్టీ భూ బాధితులు నిరసన తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో లగచర్ల రోటిబండ తండా కులచెర్లకుంట తండా రైతులు గిరిజనులు భూ నిర్వాసితులు సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, నాయకులు అక్బర్ ప్రశాంత్, నవీన్ రాము నాయక్ చందర్ లక్ష్మణ్ శంకర్ మాణిక్ నాయక్ శ్రీనివాస్ హనుమంతు గోపాల్ సక్రి బాయ్ లక్ష్మీబాయి సోనీ బాయ్ చంద్రి భాయ్ రాఘవేందర్ రూముల నాయక్ పాండే నాయక్ తూకారాం రూపుల పాల్గొన్నారు...

సత్యమేవ జయతే



## జిల్లా లో లైసెన్స్ సర్వేలపరీక్షల నిర్వహణకు పకడ్బందిగా ఏర్పాట్లు చేయాలనీ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్......





సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..శుక్రవారం తన చాంబర్ లో సంబంధిత అధికారులతో లైసెన్స్ సర్వేల పరీక్షల నిర్వహణ పై సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని , జిల్లా లో తేదీ 26-10-2025నాడు ఆదివారము జిల్లా పరిషత్ ఉన్నత పాటశాల (బాలుర ) వికారాబాద్ నందు లైసెన్సుడు సర్వేయర్ల అభ్యర్థులు 106 . మరియు ఇదివరకు పరీక్ష రాసి ఫెయిల్ అయిన వారు 35 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించబడుతుంద నీ, పరీక్షా సమయంఉదయం 10. .00గంటల నుండి మద్యాహ్నం 1.00 గంటల వరకు . మరియు మధ్యాహ్నం 2. 00 గంటల నుండి 5.00 వరకు రెండవ పరీక్ష ఉంటుందని. పరీక్షకు గంట ముందే రావాలని, ఎలాంటి పొరపాట్లు జరుగ కుండ పరీక్ష నిర్వహణ సజావుగా జరిగేలా చూడాలని , అధికారులను ఆదేశించారు

ఈ సమావేశము లో , జెడ్ పి హెచ్ ఎస్ ఎచ్ ఎం రాజు ,ఎస్పై గిరి,ఏడి సర్వే ల్యాండ్ రామ్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు...

## అనంతగిరి గుట్ట మీద జరిగే ట్రైల్స్ రన్ కు టీ. షర్ట్ మోడల్ ఆవిష్కరణ చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్..





సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా... తెలంగాణ రన్నర్స్ ఆద్వర్యంలో ఈనెల 26 న అనంతగిరి గుట్ట మీద జరిగే అనంతగిరి ట్రైల్స్ రన్" కు సంబంధించిన టీ షర్ట్ మరియు మెడల్ ను శుక్రవారం తన అధికార నివాసంలో ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరణ చేశారు..

## బలూచిస్థాన్‌పై పాకిస్థాన్ తీరు.. తీవ్రంగా మండిపడిన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్

బలూచిస్థాన్ ప్రజలు ప్రత్యేక దేశం కోసం శాంతియుతంగా పోరాడుతుంటే, పాకిస్థాన్ వారిని ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తోందని మానవ హక్కుల సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాద నిరోధక చట్టాలను పాక్ దుర్వినియోగం చేస్తూ, బలూచ్ ఉద్యమకారుల అణిచివేతకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. 1997 ఉగ్రవాద నిరోధక చట్టం కింద బలూచ్‌కు చెందిన 32 మందిని పాక్ తన వాచ్ లిస్ట్‌లో చేర్చడాన్ని ఆమ్నెస్టీ తప్పుబట్టింది.

ప్రత్యేక దేశం కోసం పోరాడే వారిని వాచ్ లిస్ట్‌లో చేర్చడం సరికాదని, ఇది వారి హక్కులను పూర్తిగా కాలరాయడమేనని ఆమ్నెస్టీ దక్షిణాసియా రీజినల్ డైరెక్టర్ బాబూ రామ్ అన్నారు. పాక్ చర్యల వల్ల స్వేచ్ఛ, గోప్యత, ఉద్యమానికి సంబంధించిన ప్రాథమిక హక్కులు దెబ్బతింటున్నాయని ఆయన ఆరోపించారు. పాక్ తన వాచ్ లిస్ట్‌లో మహిళలను కూడా చేర్చి హద్దులు దాటిందని విమర్శించారు. దీనివల్ల వాచ్ లిస్ట్‌లో ఉన్నవారు కఠిన పర్యవేక్షణ, ప్రయాణ ఆంక్షలను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.బలూచ్ ఉద్యమకారులకు వ్యతిరేకంగా పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం కూడా వారికి లేకుండా పోయిందని ఆయన అన్నారు. పాక్ చర్యలను అడ్డుకోవాలంటే అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలకు అనుగుణంగా ఆ దేశం ఉగ్రవాద నిరోధక చట్టాలను సవరించాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది.

# జల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం . పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి.

- ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చేందుకు కృషి
- రానున్న రోజుల్లో తాండూరు తలరాత మారబోతోంది
- వాగ్దానం చేసిన పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

తాండూరులో ముదిరాజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

అట్టహాసంగా క్రీడాకారులకు కిట్ల పంపిణీ..



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా :
తాండూరు, : రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోన్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతోందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, క్రీడల యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ముదిరాజ్ భవన నిర్మాణ శంకస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. మంత్రి వాకిటి శ్రీహరి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై భవన నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రసంగించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో బీసీలు, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు.

రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్రతో అన్ని వర్గాలకు " హక్కులు దక్కాలని సంకల్పాన్ని సీఎం రేవంత్ రెడ్డి అందిపుచ్చుకుని రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల కోసం కులగణన చేయించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ ల వల్ల ఇతర కులాలకు ఇబ్బందులు కలుగుతాయని గత ప్రభుత్వాలు లెక్కలను బహిర్గతం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముదిరాజ్ లను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చేందుకు భుజస్కంధాలపై వేసుకుని కృషి చేస్తానని స్పష్టం చేశారు. అదేవిధంగా తనకు మంత్రివర్గంలో స్థానం కల్పించడమే కాకుండా ఐదు శాఖలను అప్పగించారని అన్నారు. రాష్ట్రంలో ని 26వేల చెరువుల్లో చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్య సంపదను పెంచేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. దీంతో పాటు పశు , పాడి సంస్థను వృద్ధిలోకి తెచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ముదిరాజ్ లతో పాటు బీసీ, వెనుకబడిన వర్గాల వారందరు చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా రానున్న రోజుల్లో తాండూరు తలరాత మారబోతోందని అన్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని అన్నారు.

తాండూరులో రూ. 5 కోట్లతో క్రీడా మైదానాన్ని మంజూరు చేయిస్తామని హామి ఇచ్చారు. అంతేకాకుండా రూ.2కోట్లతో 2 ఎకరాలలో సెట్ విన్ సంస్థను ఏర్పాటు చేసి యువతకు, మహిళలకు వృత్తి నైపుణ్యాలు మెరుగు పరిచేవిధంగా తోడ్పాటు అందిస్తానని అన్నారు. సెట్ విన్ సంస్థ సర్టిఫికెట్లు పొందిన వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. యువత మత్తు. గంజాయిని వీడి క్రీడా మైదానాల్లోకి రావాలని, అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మరోవైపు తాండూరులో నిర్మిస్తున్న ముదిరాజ్ ల భవనం నిర్మాణం పూర్తికి తమవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని హామి ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు అభివృద్ధికి తనవంతు తోడ్పాటు అందిస్తానని అన్నారు.

తాండూరు రూపురేఖలు మారుస్తా

అదేవిధంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరిల సహకారంతో తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ముదిరాజ్ లు, మత్స్యకారుల అభివృద్ధికి అండగా ఉంటామని అన్నారు. ఎన్నికల్లో హామి ఇచ్చిన విధంగా మార్పు తీసుకవస్తామన్నారు. రోడ్లు, ఇతర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గతంలో ఎన్నడు జరిగని అభివృద్ధిని చేసి చూపిస్తామన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి రోడ్లకు, ఇరిగేషన్ శాఖలకు రూ.1000 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. బైపాస్ రోడ్ల పూర్తికి రూ.30కోట్ల పరిహారం వచ్చే విధంగా కృషి చేయడం జరిగిందన్నారు. గత పాలకుల వల్ల తాండూరు అభివృద్ధిలో వెనుకబాటుకు గురైందని విమర్శించారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణి

మరోవైపు మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిల తాండూరు నియోజకవర్గంలోని క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 40 జట్లకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, స్పోర్ట్ ఆథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి. మత్స్య కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, స్టేట్ ఫైనాన్స్ కమీషన్ మెంబర్ ఎం. రమేష్ మహరాజ్, ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, డీసీసీబీ జిల్లా వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఉత్తమ్ చంద్, నాయకులు డా. సంపత్ కుమార్, వడ్డె శ్రీనివాస్, పెద్దేముల్ మాజీ వైస్ చైర్మన్ మధులత శ్రీనివాస్ చారి, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నీరజాబాల్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు గాజుల మాధవి కమలాకర్, వివిధ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## మహబూబ్‌నగర్‌లో టపాసుల ప్రమాదంలో గాయపడిన చిన్నారులను పరామర్శించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



సత్యమేవ జయతే – మహబూబ్‌నగర్
మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు సందర్శించారు. రేగడిగడ్డ తాండాకు చెందిన వసంత్ కుమార్ (6), రుషిక (7), మానస (8), మనోజ్ (6) అనే చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో ప్రమాదవశాత్తూ గాయపడిన నేపథ్యంలో ఎమ్మెల్యే గారు ఆసుపత్రికి వెళ్లి పిల్లలను పరామర్శించారు.

ఎమ్మెల్యే గారు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని వైద్యులకు సూచనలు ఇచ్చారు.

తల్లిదండ్రులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును విచారించారు. పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, భయపడాల్సిన అవసరం లేదని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంద్ర, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు శ్రీనివాస్ యాదవ్, రమేష్ నాయక్, లక్ష్మణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నవాబ్ పేట పీహెచ్‌సీలో క్యాన్సర్ స్క్రీనింగ్ విజయవంతం




### 110 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

### మ్యాగ్న క్యాప్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరం

సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబ్ పేట్, అక్టోబర్ 24 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా, నవాబ్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో శు క్రవారం నాడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. పవిత్ర గారు అధ్యక్షతన, మ్యాగ్న క్యాప్టా ఫౌండేషన్ (హైదరాబాద్) సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

**110 మందికి సేవలు:**

మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 110 మంది ప్రజలకు ఈ శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు ఇతర వైద్య సేవలు అందించారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి, సరైన చికిత్స అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.




**అధికారుల పర్యవేక్షణ:**

ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని జిల్లా (ఎన్.సి.డి)విభాగం అధికారిణి డా. నిరోష దగ్గరుండి పర్యవేక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ఎం. రోహిత్ గారు శిబిరం ఏర్పాట్లు, నిర్వహణను పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా ఉప వైద్య అధికారి డా. ప్రవీణ్ కుమార్, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ జయరాం, పీహెచ్ఎన్ బ్యూలా ముఖ్యంగా హాజరయ్యారు. వీరితో పాటు పీహెచ్‌సీ సిబ్బంది, సబ్ సెంటర్ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు చురుకుగా పాల్గొని, ప్రజలకు వైద్య సేవలు అందించడంలో సహకరించారు.

క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి, సకాలంలో రోగ నిర్ధారణ చేయడంలో ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడిందని వైద్యులు తెలిపారు.

## తెలంగాణలో జాయింట్ కలెక్టర్ పదవి రద్దు

## %-% అదనపు కలెక్టర్లు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా నియామకం




సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము కీలక పరిపాలనా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని జాయింట్ కలెక్టర్ పదవిని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయబడినవి. ఈ క్రమంలో అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లను ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, అడమి భూ సర్వే, హక్కుల నిర్ధారణ, సెటిల్‌మెంట్ పనులు అదనపు కలెక్టర్ల పరిధిలోకి వస్తాయి. 1967 ఫారెస్ట్ యాక్ట్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకోబడింది. ఈ కార్యక్రమం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పర్యవేక్షణలో అమలులోకి రానుంది.

అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లు అటవీ భూముల హక్కులు, అటవీ ప్రాంతాల నిర్ధారణ, భూసంబంధిత రికార్డుల పరిశీలన, అవకతవకలపై విచారణ, అటవీ భూములకు సంబంధించిన ప్రకటనలు జారీ చేయడం వంటి పనులు నిర్వహించాల్సి ఉంటుంది. అదనపు కలెక్టర్ పదవిలో ఉన్న అధికారులు ఇప్పటివరకు కలెక్టర్‌కు సహాయంగా రెవెన్యూ కార్యకలాపాలు, భూముల కేటాయింపులు, పౌరసరఫరాలు, స్థానిక సంస్థల అభివృద్ధి కార్యక్రమాలు, పరిశుభ్రత మరియు పచ్చదనం వంటి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ వంటి బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నారు.

ప్రస్తుత ఉత్తర్వులతో, ఈ అధికారుల విధుల్లో మార్పు చోటుచేసుకుని, కొత్త బాధ్యతలు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా అప్పగించబడ్డాయి.

## వీర జవాన్ వెంకట్ రామ్ రెడ్డి కన్నుమూత: వట్టిమీనపల్లిలో విషాద ఛాయలు

### ఢిల్లీలో విధుల్లో ఉండగానే అనారోగ్యంతో మృతి - నేడు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబ్‌పేట్, అక్టోబర్ 24: దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న భారత సైన్యానికి చెందిన ఓ వీర జవాన్ అకాల మరణం చెందాడు. వికారాబాద్ జిల్లా, నవాబ్‌పేట్ మండలం, వట్టిమీనపల్లి గ్రామానికి చెందిన మోముల వెంకట్ రామ్ రెడ్డి అనారోగ్యంతో ఢిల్లీలో శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ దుర్వార్తతో స్వగ్రామం వట్టిమీనపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ఢిల్లీలో విధుల్లో ఉండగానే మృతి**

కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం, వెంకట్ రామ్ రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అయితే విధులు నిర్వర్తిస్తూనే ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో ఢిల్లీలో ఆయన కన్నుమూశారు. ఈ వార్త తెలిసిన వెంటనే ఆయన సహచర సైనికులు, ఆర్మీ అధికారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఆర్మీ అధికారుల బృందం వెంకట్ రామ్ రెడ్డి భౌతిక కాయానికి ఘన నివాళులు అర్పించింది.

**వట్టిమీనపల్లిలో కన్నీటి వాతావరణం**

వీర జవాన్ మృతి వార్త గ్రామానికి చేరగానే వట్టిమీనపల్లి గ్రామం నిండా దుఃఖఛాయలు వ్యాపించాయి. తమ బిడ్డ దేశ సేవలో ఉండగానే ప్రాణాలు కోల్పోయాడన్న వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు పెద్ద ఎత్తున ఆయన ఇంటికి చేరుకుని కుటుంబాన్ని ఓదార్చారు. నవాబ్‌పేట్ మండల ప్రజలు జవాన్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

**సైనిక లాంఛనాలతో అంతిమ యాత్ర**

వీర జవాన్ వెంకట్ రామ్ రెడ్డి భౌతిక కాయాన్ని సైనిక లాంఛనాలతో స్వగ్రామంలో శనివారం నాడు వట్టిమీనపల్లిలో సైనిక గౌరవాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. సైనిక విభాగం అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు చివరి వీడ్కోలు ఇవ్వనున్నారు.

## తిరుమలగిరి ట్రాఫిక్ స్టేషన్‌లో ప్రత్యేక డ్రైవ్: 149 సెల్ ఫోన్ డ్రైవింగ్ కేసులు బుక్, కౌన్సిలింగ్ తో జరిమానాలు విధించటం




సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిమితుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడింది. ఈ డ్రైవ్ రాంగ్ రూట్, సెల్ ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవడానికి నిర్వహించబడింది. ఈ సందర్భంగా 149 సెల్ ఫోన్ డ్రైవింగ్ కేసులు బుక్ చేయబడ్డాయి. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను వి. సర్దార్ నాయక్, ఇన్స్పెక్టర్ ట్రాఫిక్, తిరుమలగిరి మరియు పి. జాన్, అదిషనల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తిరుమలగిరి, ఎస్ఐలు మారుతి, యుగంధర్, ఎస్సైలు రెడ్డి నాయక్ ఆధ్వర్యంలో నిర్వాహించబడింది. రాంగ్ సైడ్‌లో పట్టుబడిన వాహనదారులకు కౌన్సిలింగ్ అందిస్తూ కోర్టులో హాజరుపరిచి జరిమానా విధించడం జరిగింది. అత్యున్నత అధికారుల సూచనల ప్రకారం, ఈ డ్రైవ్ ద్వారా వాహనదారులకు భవిష్యత్తులో జరిగే ప్రమాదాలు, సెల్ ఫోన్ డ్రైవింగ్ ద్వారా కలిగే ప్రమాదాల గురించి వివరంగా అవగాహన కల్పించడం జరిగింది. డ్రైవ్ కొనసాగించబడతూనే ఉంటుంది, ఒకసారి మాత్రమే పట్టుబడి మళ్లీ విధేయత చూపకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని ట్రాఫిక్ ఏసిపి శ్రీ జి. శంకర్ రాజు తెలియజేశారు.

# ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలి....

**ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలి....**

**- మెదక్ ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలి**

**- పెండింగ్ పనులు పూర్తి చేయాలి**

**- ధాన్యం కొనుగోలు ను వేగవంతం చేసి, రైతులకు ఇబ్బంది లేకుండా చూడలి**

**- అధికారుల సమీక్షలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనపల్లి రోహిత్ రావు**

**- అధికారులు ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరించాలి**

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**




సత్యమేవ జయతే – మెదక్ మెదక్ : శుక్రవారం కలెక్టర్ సమీకృత కార్యాలయం లోని సమావేశ మందిరంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, వైద్య ఆరోగ్య, విద్య, పంచాయతీ, పంచాయతీరాజ్, నీటిపారుదల, వ్యవసాయ, పౌరసరపర, శ్రీ సంక్షేమ, పారిశ్రామిక, ఎస్సీ ఎస్టీ బీసీ అభివృద్ధి శాఖల, గృహ నిర్మాణ, విద్యుత్, మున్సిపాలిటీ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ రావ్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి తన వంతు ప్రయత్నం చేస్తున్నాను అన్నారు.

నూతన పిహెచ్సి, సబ్ సెంటర్ల నిర్మాణం జరగాలన్నారు. రామాయంపేట హాస్పిటల్ కు నూతన డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు .

కొత్తపల్లి బ్రిడ్జి, శంకరంపేట.. మెదక్ రోడ్ పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. దూప్ సింగ్ తండా ఏడుపాయల రోడ్డు, ఏడుపాయల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పాపన్నపేట్ ,కొత్తపల్లి కాలువల మరమ్మతులు చేయాలని రాయినపల్లి, కొంటూరులలో నిర్మాణాలు చేపట్టాలన్నారు.

ధాన్యం కొనుగోలు ను మరింత వేగవంతం చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు ధాన్యం కొనుగోలుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. లోడింగ్ అన్లోడింగ్ కు వాహనాలు సిద్ధం చేశామని, హమాలి కూడా పూర్తి అందుబాటులో ఉందన్నారు. అధికారుల సమన్వయంతో ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో అపరిశుభ్రం, వీధి దీపాలు వెలగడం లేదని సమస్య ఉందని ఫిర్యాదులు వచ్చాయని, పంచాయతీ అధికారిని త్వరితగతిన ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ ,పట్టణ ప్రాంతాల్లో నిరంతరం పాగింగ్ జరగాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో కాలుష్య నివారణ చేయాలన్నారు. ప్రజలకు కాలుష్యం ఇబ్బంది ఉంటే ఎంత పెద్ద వారినైనా వదలకుండా ప్రజల గురించి నేను పోరాడుతానని ఉద్ఘాటించారు. అసలైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు అందించాలన్నారు. కొన్ని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై కరెంటు తీగలు వేలాడుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయని దాని విద్యుత్ అధికారులు సరి చేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అధికారులు ప్రజలతో బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. పాత పనులు త్వరగా పూర్తి చేసి,నూతన పనులు ఏమైన ఉంటే ప్రణాళికలు చేసి పంపాలన్నారు. అధికారులు పంపిన ప్రణాళికలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

నిజమైన లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. జిల్లాలో ఉన్న పెండింగ్ పనులన్నీ పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరఫరా నిర్ధారించాలి %-% నిర్లక్ష్యంపై కఠిన చర్యలు




సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాల పురోగతిపై సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా శాఖ మంత్రివర్యులు అధికారులతో విస్తృతంగా చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనె, బాలామృతం, మురుకులు, బియ్యం వంటి అవసరమైన సరుకుల సరఫరాలో ఎటువంటి లోపాలు చోటు చేసుకోకూడదని మంత్రివర్యులు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వ కాలంలో జరిగినట్లుగా సరఫరాదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఆలస్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై వెంటనే నోటీసులు జారీ చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని ఆదేశించారు.

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండకూడదని మంత్రివర్యులు స్పష్టం చేశారు.

అదే విధంగా బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి జిల్లాలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని, ఒక్క బాల్యవివాహం కూడా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శక్తి సదనాలు, స్టేట్ హోమ్స్, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి పర్యవేక్షించాలన్నారు. ఈ సదుపాయాలలో ఉన్న మహిళలకు అవసరమైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# గాచిబౌలి ప్రాంతంలో అనధికారిక నిర్మాణాలపై స్థానికుల ఆందోళన, జీహెచ్‌ఎంసీ దక్షిణ చర్యలు కోరుతున్నారు






సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : హైదరాబాద్, గాచిబౌలి ప్రాంతంలోని హోటల్ గ్రాండ్, హౌస్ నం. 264/6/1/ఇ, సెంట్రల్ మాల్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో అనుమతి లేని నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు గంభీరం గా ఫిర్యాదు చేస్తున్నారు. స్థానికుల ప్రకారం, కొన్ని నిర్మాణాలు జీహెచ్‌ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్ మ్యూనిసిపల్ కార్పొరేషన్) నియమాలు, పట్టణ రూపకల్పన చట్టాలను ఉల్లంఘిస్తూ నిర్మిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతం సిరిలింగంపల్లి జోన్‌లో పడుతుంది, ఇక్కడి సంబంధిత ఆఫీసర్ మరియు టౌన్ ప్లానింగ్ ఏసీపీ వారి నిర్లక్ష్యం కారణంగా సమస్య పరిష్కరించబడడంలేదని స్థానికులు, సామాజిక కార్యకర్తలు అంటున్నారు. అనేక ఫిర్యాదులున్నప్పటికీ, భౌతిక చర్యలు ఎక్కడా తీసుకోబడలేదని వారు పేర్కొన్నారు. సమస్యను మించినవిధంగా ఎగువ అధికారులు నిర్లక్ష్యం చూపితే, వారు విజిలెన్స్ డిపార్ట్మెంట్ మరియు జీహెచ్‌ఎంసీ కమిషనర్ వద్దకు ఈ విషయాన్ని తీవ్రతరం చేయనున్నారు. స్థానిక కార్యకర్తలు మాట్లాడుతూ, ఈ అనియంత్రిత నిర్మాణాలు పట్టణ ఆకృతికి మాత్రమే హానికరంగా కాకుండా, భద్రతా మరియు పర్యావరణ హానిని కూడా కలిగిస్తాయని తెలిపారు. లింగంపల్లి ప్రాంతంలో అనేక అనధికారిక ప్రాజెక్టులు కొనసాగుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి, ఇది పరిపాలనా బాధ్యత మరియు స్థానిక అధికారులు, బిల్డర్ల మధ్య సంబంధాలపై ప్రశ్నలు కలిగిస్తోంది. నాగరికులు తక్షణ పరిశీలన మరియు అనధికారిక నిర్మాణాల భవనాలు రద్దు చేయాలని, జీహెచ్‌ఎంసీ మునిసిపల్ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే, జీహెచ్‌ఎంసీ మరియు విజిలెన్స్ ఫ్రేమ్‌వర్క్ కింద నిర్లక్ష్యపూరిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని వారు హెచ్చరించారు.

## దీపావళి, ఛఠ్‌పూజకు వచ్చిన వలస కార్మికులను పోలింగ్ దాకా ఆపేదెలా? బిహార్‌లో పార్టీల మల్లగుల్లాలు!



దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ లక్షలాది మంది బిహారీ వలస కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది దీపావళి, ఛఠ్ పండుగల కోసం బిహార్‌కు వచ్చేశారు. అక్టోబరు 25 నుంచి 28 వరకు ఛఠ్ పూజలు జరుగుతాయి. ఈ పండుగ ముగిసిన 9 రోజుల తర్వాత (నవంబరు 6న) అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్, 14రోజుల తర్వాత (నవంబరు 11న) రెండో విడత పోలింగ్ జరగనున్నాయి. విదేశాల నుంచి వచ్చే బిహారీ వలస కార్మికులైతే ఎక్కువగా నెల రోజుల పాటు ఇళ్లలో ఉంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారు మాత్రం ఛఠ్ పండుగ ముగిసిన వెంటనే వారి ఉద్యోగాలు, పనులను వెళ్లిపోయేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ తేదీల వరకు బిహారీ వలస కార్మికులను రాష్ట్రంలోనే ఆపడం సవాల్‌గా మారింది. దీంతో వారిని పోలింగ్ వరకు ఆపేది ఎలా? అనే దానిపై రాజకీయ పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి.

ఛఠ్ పండుగను బిహారీలు ఘనంగా జరుపుకొంటారు. బిహారీ వలస కార్మికులు దేశంలో, ప్రపంచంలో ఎక్కడున్నా ఈ పండుగ వేళ ఇళ్లలో వాలిపోతారు. నాలుగు రోజుల ఛఠ్ పూజల్లో భక్తిభావంతో పాల్గొంటారు. ఈసారి ఛఠ్ పండుగ ఎన్నికల సమయంలో వచ్చింది. ఈ ఫెస్టివల్ ముగిసిన 9 రోజుల్లోనే తొలి విడత పోలింగ్ జరుగుతుంది. ఈ క్రమంలో పండగకు పోలింగ్‌కు చాలా రోజుల గ్యాప్ ఉంటుంది. బిహారీ వలస కార్మికుల్లో చాలామంది ప్రైవేటు రంగంలోనే పనిచేస్తున్నారు. అతికొద్ది మంది మాత్రమే ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. అక్టోబరు 20న దీపావళి పండుగ జరిగింది. అక్టోబరు 28న ఛఠ్ పండుగ పూజలు ముగుస్తాయి. దీపావళి నుంచి ఛఠ్ పండుగ వరకు సగటున 10 రోజుల సెలవులు తీసుకొని బిహారీ వలస కార్మికులు స్వరాష్ట్రానికి వచ్చారు. అలాంటప్పుడు అక్టోబరు 28 తర్వాత కూడా వారంతా బిహార్‌లోనే ఉండే అవకాశాలు తక్కువనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తొలి విడత పోలింగ్ తేదీ (నవంబరు 6) వరకు బిహారీ వలస కార్మికులకు సెలవులను కంపెనీలు పొడిగించే అవకాశాలు దాదాపుగా లేవు. ఇక రెండో విడత పోలింగ్ జరిగే సమయానికి (నవంబరు 11) వారు రాష్ట్రం నుంచి పూర్తిగా వెళ్లిపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ అంశాలే ఇప్పుడు అధికార, విపక్ష కూటముల్లోని రాజకీయ పార్టీలను కలవరానికి గురి చేస్తున్నాయి. వలస కార్మికుల పోలింగ్ శాతంలో ఏ మాత్రం తేడా వచ్చినా, ఎన్నికల ఫలితం మారిపోతుందనే ఆందోళన అభ్యర్థులను వెంటాడుతోంది. దీంతో పోలింగ్ తేదీల వరకు ఎలాగైనా ఓటర్లను రాష్ట్రంలోనే నిలిపి ఉంచేందుకు వారు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి మరీ బిహారీ వలస కార్మికులను కలుస్తున్నారు.

దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లో దాదాపు 48 లక్షల మంది బిహారీ వలస కార్మికులు ఉన్నారనేది కేంద్ర ప్రభుత్వ అంచనా. వీరిలో దాదాపు 45 లక్షల మంది వివిధ రాష్ట్రాల్లో ఉండగా, మిగతా 2.50 లక్షల మంది విదేశాల్లో ఉన్నారు. కానీ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఓట్లు కలిగిన బిహారీ వలస కార్మికుల సంఖ్య 21.30 లక్షలేనని ఈసీ చెబుతోంది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను ఈసీ నిర్వహించిన సమయంలో వలస కార్మికుల వివరాలను చాలా కుటుంబాలు కచ్చితంగా అందించలేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఓటుహక్కును నిలుపుకోవడానికి తమ వాళ్లు రాష్ట్రంలోనే పని చేస్తున్నారని ఎక్కువ కుటుంబాలు చెప్పాయన్నారు. చాలా ఫ్యామిలీలు ఉద్దేశపూర్వకంగానే తమ ఇంట్లోని వలస కార్మికుల వివరాలను ఇవ్వలేదని పేర్కొన్నారు. దీనివల్లే ఎన్నికల సంఘం, కేంద్ర సర్కారు గణాంకాల్లో భారీ వ్యత్యాసం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లోనే కొంత వాస్తవికత కనిపిస్తోందన్నారు.

"బిహారీ వలస కార్మికులు రాజకీయ పార్టీలకు చాలా ముఖ్యం. అందుకే వారిని పోలింగ్ తేదీల వరకు రాష్ట్రంలో నిలిపే ప్రయత్నాలను రాజకీయ పార్టీలు చేస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేక ప్రచారాలు నిర్వహిస్తున్నాయి. ఇంటింటికి వెళ్లి మరీ కార్మికులను అభ్యర్థులు కలుస్తున్నారు. ఎన్నికల సంఘం చెబుతున్న దాని కంటే పెద్దసంఖ్యలో రాష్ట్రంలో వలస కార్మిక ఓటర్లు ఉన్నారు. వీరిలో చాలామంది ఛఠ్ పండుగ సెలవులు ముగియగానే ఉద్యోగాలకు వెళ్లిపోతారు. వారిని ఎంతమేరకు రాజకీయ పార్టీలు ఆపగలుగుతాయో వేచిచూడాలి"

వంటి సరిహద్దు జిల్లాల నుంచే ఎక్కువ మంది ఓటర్లు వలస కార్మికులుగా పనిచేస్తున్నారు. సాక్షాత్తూ ఎన్నికల సంఘమే ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ జిల్లాల్లోని ఒక్కో అసెంబ్లీ స్థానంలో దాదాపు 10వేల నుంచి 17వేల మంది ఓటర్లు ఉపాధి కోసం వలస వెళ్లారు. ఈ కీలకమైన జిల్లాల్లో తొలి విడతలోనే పోలింగ్ జరగనుంది. పోలింగ్ జరగనున్న నవంబరు 6వ తేదీ వరకు బిహారీ వలస కార్మికుల్లో చాలామంది ఉద్యోగాలకు వెళ్లిపోతే, ఈ అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికల ఫలితాలు మారిపోతాయి. అభ్యర్థుల బలాబలాల్లోనూ గణనీయమైన మార్పు వస్తుంది. పోలింగ్ శాతం సైతం తగ్గిపోతుంది.

2020లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సగటున 57 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి తొలివిడత పోలింగ్ రోజున బిహారీ వలస కార్మికులు అందుబాటులో లేకుంటే, పోలింగ్ శాతం 5 నుంచి 7 శాతం తగ్గుతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. దీపావళి, ఛఠ్ పండుగల కోసం సెలవుపై స్వరాష్ట్రానికి వచ్చిన వలస కార్మికుల్లో 60 శాతం మంది తొలి విడత పోలింగ్ (నవంబరు 6) సమయానికే వెళ్లిపోవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రెండో విడత పోలింగ్ (నవంబరు 11) సమయానికి వలస కార్మికుల్లో 80 శాతం మంది ఉద్యోగాల కోసం వెళ్లిపోయే అవకాశం ఉందని అంటున్నారు.

"నేను వలస కార్మికులను కలుస్తున్నాను. పోలింగ్ తేదీ వరకు రాష్ట్రంలోనే ఉండమని వాళ్లకు రిక్వెస్ట్ చేస్తున్నాను. వారు తప్పకుండా నా మాట వింటారని భావిస్తున్నాను. వలస కార్మికులు సహకరిస్తే మేం రాష్ట్రం భవిష్యత్తును మారుస్తాం. స్థానికంగానే ఉపాధి అవకాశాలను క్రియేట్ చేస్తాం" అని పట్నాలోని బంకిపూర్ అభ్యర్థి, బీజేపీ ఎమ్మెల్యే నితిన్ నవీన్ తెలిపారు.

"ఛఠ్ పండుగ కోసం వచ్చిన వలస కార్మికులను మేం కలుస్తున్నాం. పోలింగ్ వరకు రాష్ట్రంలోనే ఉండమని కోరుతున్నాం. ఇంటింటికి వెళ్లి మరీ ఈ అంశంపై ప్రచారం చేస్తున్నాం. వలస కార్మికులు మమ్మల్ని అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం" అని బిహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందిన జేడీయూ నాయకుడు ఇర్షాద్ హుస్సేన్ గుడ్డు తెలిపారు. బిహార్‌లోని ముజఫర్‌పూర్ చెందిన సంతోష్ కుమార్ దిల్లీలో పనిచేస్తున్నారు. ఆయన ఛఠ్ పండుగ కోసం రాష్ట్రానికి వచ్చారు. ఓటు వేసి పనికి వెళ్తానని సంతోష్ అంటున్నారు.

బిహార్‌కు చెందిన శాంతన్ మాంఝీ ముంబయిలోని ఓ స్టీల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఓటు వేశాకే పనికి వెళ్తానని ఆయన తెలిపారు.

బిహార్‌లోని అర్రా అసెంబ్లీ స్థానానికి చెందిన సైనికుడు విక్రాంత్ గుప్తా ఓటు వేయడానికి తన సెలవును పోలింగ్ తేదీ వరకు పొడిగించుకున్నారు.

బిహార్‌లోని అర్రా అసెంబ్లీ స్థానానికి చెందిన రీతు కుమారి బెంగళూరులో ఉంటారు.

## కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నేతల బిఆర్ఎస్ పార్టీలో చేరిక



సత్యమేవ జయతే - కొల్లాపూర్

కొల్లాపూర్ : పానుగల్ మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన గేరి లక్మయ్య, నాగేంద్రం, రేపల్లి చంద్రు, బద్దుల నరసింహ, తెలుగు నరసింహ తదితర నాయకులు మరియు కార్యకర్తలు సహా మొత్తం 30 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు.

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి గారి సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. పార్టీకి చేరిన నాయకులు మరియు కార్యకర్తలకు బీరం హర్షవర్ధన్ రెడ్డి గారు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన బీరం హర్షవర్ధన్ రెడ్డి గారు, పార్టీ బలోపేతం కోసం అందరూ అహర్నిశలు కృషి చేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయాన్ని సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, జిల్లా నాయకులు జ్యోతి నందన్ రెడ్డి, వెంకటయ్య నాయుడు, అడ్వకేట్ రవి, మండల ప్రధాన కార్యదర్శి గొంది భాస్కర్ రెడ్డి, నాయకులు సుధాకర్ యాదవ్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు అలీమ్, గ్రామ మాజీ సర్పంచ్ మౌనిక తిరుపతి యాదవ్, మాజీ ఉపసర్పంచ్ చంద్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎలగోడ్డు తిరుపతయ్య, గ్రామ ఉపాధ్యక్షుడు చిన్న రవి, మల్లేష్ యాదవ్, అలాగే వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణలో 4200 ఎస్సీ/ఎస్టీ అత్యాచార బాధితులకు రిలీఫ్ ఫండ్ అందకపోవడంతో జాతీయ ఎస్సీ కమిషన్ నోటీసులు జారీ



సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని మాల వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా జాతీయ ఎస్సీ కమిషన్‌కి ఫిర్యాదు సమర్పించబడింది. రాష్ట్రంలో 4200 మంది ఎస్సీ/ఎస్టీ అత్యాచార బాధితులకు రిలీఫ్ ఫండ్ అందించబడకపోవడం, ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం వంటి విషయాలను కమిషన్‌కు తెలియజేశారు.

జాతీయ ఎస్సీ కమిషన్ వైపు నుండి వెంటనే స్పందనగా, తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మరియు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు నోటీసులు జారీ చేయడం జరిగింది. 15 రోజుల్లో పై అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు కమిషన్‌కి అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

మాల వెల్ఫేర్ అసోసియేషన్ నివేదనలో, గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో మానిటర్ రిలీఫ్ ఫండ్ కేటాయింపులో ప్రభుత్వ వైఖరి, నిధుల విడుదలలో తక్షణం లేకపోవడం, మరియు బాధితులకు అడ్డంకులు కలిగించడం వంటి అంశాలు వివరించబడ్డాయి. కమిషన్, ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు చట్టప్రకారం ఉపశమనం, పునరావాసం మరియు అదనపు పునరావాసం అందించడానికి ఆదేశించింది.

జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ శ్రీ సునీల్ కుమార్ బాబు గారు హైదరాబాదులో బాధితుల కోసం సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చారు.

## అమీన్ పూర్ సదర్ కార్యక్రమంలో యాదవుల సంఘటిత చర్యలు, యువతకు మార్గదర్శక సూచనలు



సత్యమేవ జయతే - అమీన్ పూర్అమీన్ పూర్ : పటాన్ చేరు నియోజకవర్గంలోని అమీన్ పూర్‌లో సదర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్ రాగం నాగేందర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, కుమార్ యాదవ్, ఐలాపూర్ మాణిక్ యాదవ్, సుధాకర్ యాదవ్, రమేష్ యాదవ్, బండారు పాండు రంగారావు యాదవ్, తోకల రాజు యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న యాదవులు సంఘటితంగా ఉండి విద్యా, రాజకీయ రంగాలలో అభ్యున్నతి సాధించాల్సిన అవసరం, యువత చొరవతో ముందుకు అడుగులు వేయడం, సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించడం, జాతి అభివృద్ధికి తోడ్పడటం వంటి విషయాలపై సలహాలు మరియు మార్గనిర్దేశాలు ఇచ్చారు. వారు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, శ్రీ కృష్ణ భగవానుడు బోధించిన గీతోపదేశం స్ఫూర్తిగా ఆదర్శంగా ఉండాలని కోరారు. కార్యక్రమాన్ని యాదవ యూత్, మెండే కుటుంబ సభ్యులు ఆంజనేయులు, సుజాత మరియు ఇతర మహిళలతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని విజయం సాధించారు.

సత్యమేవ జయతే



# మీ థైరాయిడ్ పనితీరును మెరుగు పరచడానికి 3 యోగా ఆసనాలు

ఆరోగ్యకరమైన జీవనశైలి థైరాయిడ్ వ్యాధితో బాగా జీవించడానికి మీకు సహాయపడుతుంది. థైరాయిడ్ గ్రంథిని ఉత్తేజపరిచేందుకు మరియు మీ జీవక్రియను పెంచడానికి ఈ యోగా ఆసనాలను మీ దినచర్యలో చేర్చడానికి ప్రయత్నించండి. దాదాపు ప్రతి మూడవ భారతీయుడు ఏదో ఒక రకమైన థైరాయిడ్ రుగ్మతతో బాధపడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. బరువు పెరగడానికి మరియు హార్మోన్ల అసమతుల్యతకు థైరాయిడ్ సమస్యలు ప్రధాన కారణాలలో ఒకటి. ఈ పరిస్థితి పురుషులతో పోలిస్తే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. థైరాయిడ్ రుగ్మతలు నిరపాయమైన గోయిటర్ (విస్తరించిన గ్రంథి) నుండి ప్రాణాంతక క్యాన్సర్‌కు చికిత్స అవసరం లేదు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఇందులో మంచి పోషణ, క్రమమైన వ్యాయామం, థైరాయిడ్ వ్యాధితో బాగా జీవించడంలో మీకు సహాయపడుతుంది. వాస్తవానికి, మీ దినచర్యకు యోగా జోడించడం మీ థైరాయిడ్ పనితీరును మెరుగుపరచడంలో మరియు మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రధానంగా రెండు రకాల థైరాయిడ్ రుగ్మతలు ఉన్నాయి - హైపోథైరాయిడిజం (తగినంత థైరాయిడ్ హార్మోన్లు లేకపోవడం) మరియు హైపర్ థైరాయిడిజం (అధిక థైరాయిడ్ హార్మోన్లు కలిగి ఉండటం). ప్రధాన కారణాలలో ఒకటి మన దైనందిన జీవితంలో ఒత్తిడి. థైరాయిడ్ గ్రంథి మీ శరీరంలోని దాదాపు అన్ని జీవక్రియ ప్రక్రియలను ప్రభావితం చేసే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. అత్యంత సాధారణ థైరాయిడ్ సమస్యలు థైరాయిడ్ హార్మోన్ల అసాధారణ ఉత్పత్తిని కలిగి ఉంటాయి. థైరాయిడ్ రుగ్మతలు నిరపాయమైన గోయిటర్ (విస్తరించిన గ్రంథి) నుండి ప్రాణాంతక క్యాన్సర్‌కు చికిత్స అవసరం లేదు. థైరాయిడ్ రుగ్మతల లక్షణాలు రాత్రి 8 నుండి 10 గంటలు నిద్రపోయాక లేదా రోజూ ఒక ఎన్ఎపి తీసుకోవలసిన అవసరం వచ్చిన తరువాత అలసట బరువు పెరగడం లేదా బరువు తగ్గలేకపోవడం మూడ్ స్వింగ్స్, ఆందోళన లేదా నిరాశ హార్మోన్ల అసమతుల్యత - పిఎంఎస్, క్రమరహిత కాలాలు, వంధ్యత్వం తక్కువ సెక్స్ డ్రైవ్ కండరాల నొప్పి, కీళ్ల నొప్పులు, కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ లేదా స్నాయువు చల్లని చేతులు మరియు కాళ్ళు పొడి లేదా పగుళ్ల చర్మం, పెళుసైన గోర్లు మరియు అధిక జుట్టు రాలడం మలబద్ధకం పేలవమైన ఏకాగ్రత లేదా జ్ఞాపకశక్తి తక్కువ మెడ వాపు, గురక లేదా గొంతు వాయిస్ థైరాయిడ్ రుగ్మతలకు కారణాలు మీ రక్తంలో థైరాయిడ్ హార్మోన్ల స్థాయిలను పరీక్షించడం ద్వారా హైపర్ థైరాయిడిజం మరియు హైపోథైరాయిడిజం నిర్ధారణ అవుతుంది. థైరాయిడ్ ద్వారా స్రవించే హార్మోన్లను కొలుస్తారు, అలాగే థైరాయిడ్-స్టిమ్యులేటింగ్ హార్మోన్ (టిఎస్హెచ్), పిట్యూటరీ గ్రంథి విడుదల చేసే రసాయనం, థైరాయిడ్‌లో హార్మోన్ల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. హ్యాపర్ థ్కెరాయిడిజం అన్ని రకాల హైపర్ థైరాయిడిజం థైరాయిడ్ హార్మోన్ల అధిక ఉత్పత్తి కారణంగా ఉంది, అయినప్పటికీ ఈ పరిస్థితికి అనేక కారణాలు ఉన్నాయి: టాక్సిక్ అడెనోమాస్ సబ్-అక్యూట్ థైరాయిడిటిస్ అధిక అయోడిన్ వినియోగం హ్యాపోథ్కెరాయిడిజం హైపోథైరాయిడిజం యొక్క కారణాలు: హాషిమోటో యొక్క థైరాయిడిటిస్ థైరాయిడ్ గ్రంథిని తొలగించడం అయోడైడ్ అధిక మొత్తంలో బహిర్గతం లిథియం ఎక్కువ కాలం చికిత్స చేయకపోతే, హైపోథైరాయిడిజం మైక్సెడెమా కోమాకు కారణమవుతుంది, ఇది అరుదైన కానీ ప్రాణాంతక స్థితి, దీనికి తక్షణ హార్మోన్ చికిత్స అవసరం. థైరాయిడ్ రుగ్మతలకు యోగా థెరపీ మీ థైరాయిడ్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే కొన్ని యోగాసనాలు క్రింద ఉన్నాయి. ప్రతి భంగిమ / ఆసనాన్ని 10 సెకన్ల పాటు ప్రాక్టీస్ చేయండి మరియు 5 సెట్లను పునరావృతం చేయండి. ఉష్ట్రసనా థైరాయిడ్ రుగ్మతలకు ఉష్ట్రసనా భంగిమ యొక్క నిర్మాణం: యోగా చాప మీద మోకాలి మరియు పండ్లు మీద చేతులు ఉంచండి. అదే సమయంలో, చేతులు నిటారుగా ఉండే వరకు మీ వెనుకభాగాన్ని వంపు మరియు అరచేతులను మీ కాళ్ళపైకి జారండి. మీ మెడను వక్రీకరించవద్దు లేదా వంచుకోవద్దు కానీ తటస్థ స్థితిలో ఉంచండి. ఈ భంగిమలో కొన్ని శ్వాసల కోసం ఉండండి. ఊపిరి పీల్చుకోండి మరియు నెమ్మదిగా ప్రారంభ భంగిమకు తిరిగి రండి. మీ చేతులను ఉపసంహరించుకోండి మరియు మీరు నిటారుగా ఉన్నప్పుడు వాటిని మీ తుంటికి తీసుకురండి. లాభాలు ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరం ముందు భాగంలో విస్తరించి తెరుస్తుంది. ఇది వెనుక మరియు భుజాలను కూడా బలపరుస్తుంది. ఇది తక్కువ వెన్నునొప్పి శరీరాన్ని ఉపశమనం చేస్తుంది. ఇది వెన్నెముక యొక్క వశ్యతను మెరుగుపరుస్తుంది మరియు భంగిమను కూడా మెరుగుపరుస్తుంది. ఇది రుతు అసౌకర్యాన్ని అధిగమించడానికి సహాయపడుతుంది. హలాసనా థైరాయిడ్ వ్యాధికి హలాసనా భంగిమ యొక్క నిర్మాణం: మీ వెనుకభాగంలో పడుకోండి. మీ అరచేతులను మీ శరీరం పక్కన నేలపై ఉంచండి. మీ ఉదర కండరాలను ఉపయోగించి, మీ కాళ్ళను 90 డిగ్రీల పైకి ఎత్తండి. మీ అరచేతులను నేలమీద గట్టిగా నొక్కండి మరియు మీ కాళ్ళు మీ తల వెనుకకు పడటానికి అనుమతించండి. మీ కాలి వెనుక అంతస్తును తాకేలా చేయడానికి మీ మధ్య మరియు దిగువ వెనుకభాగాన్ని నేల నుండి ఎత్తడానికి అనుమతించండి. అరచేతులు నేలపై చదునుగా ఉంటాయి, కాని ఒకరు మోచేయి వద్ద చేతులు వంచి, అరచేతులతో వెనుకకు మద్దతు ఇస్తారు. ఆసనాన్ని కొద్దిసేపు చేయండి. లాభాలు ఇది మలబద్ధకం మరియు కడుపు రుగ్మతలను తొలగిస్తుంది. శరీర కొవ్వును తగ్గించడానికి హలసానా సహాయపడుతుంది. థైరాయిడ్, కిడ్నీ, ప్లీహము మరియు ప్యాంక్రియాస్ వంటి అవయవాలు ప్రేరేపించబడతాయి. ఇది అధిక రక్తపోటును సాధారణీకరిస్తుంది. రుతు రుగ్మతలతో బాధపడుతున్న మహిళలకు ఇది సహాయపడుతుంది. ఇది జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది, అందువల్ల ఈ భంగిమను క్రమం తప్పకుండా అభ్యసిస్తున్న విద్యార్థి తన విద్యా పనితీరులో ఎంతో ప్రయోజనం పొందుతాడు. రివర్స్ రక్త ప్రవాహం చర్మాన్ని పోషకంగా మరియు యవ్వనంగా ఉంచడంలో సహాయపడుతుంది. కండరాల ఫైబర్స్ మరియు గర్భాశయ వెన్నుపూస, థొరాసిక్ వెన్నుపూస మరియు వెనుక భాగంలో కటి వెన్నుపూస బలోపేతం అవుతాయి. ఇది మీ వెనుకభాగాన్ని సరళంగా మరియు బలంగా ఉంచడానికి సహాయపడుతుంది. సలహా : లుంబగో, మెడ నొప్పి, స్పాండిలైటిస్ మరియు అధిక రక్తపోటు ఉన్నవారు ఈ భంగిమను పాటించకూడదు. సర్వంగాసన థైరాయిడ్ సమస్యలను నయం చేయడానికి సర్వంగాసన భంగిమ యొక్క నిర్మాణం: మీ వెనుకభాగంలో పడుకోవడం ద్వారా ప్రారంభించండి. మీ చేతులు మీ శరీరం పక్కన ఉంచండి. మీ కాళ్ళను నేల నుండి శాంతముగా ఎత్తండి మరియు ఆకాశానికి ఎదురుగా ఉన్న అడుగులతో నేలకి లంబంగా ఉంచండి. నెమ్మదిగా మీ కటిని ఎత్తండి మరియు నేల నుండి వెనుకకు. మీ ముంజేతులను నేల నుండి తీసుకురండి మరియు మద్దతు కోసం మీ అరచేతులను మీ వెనుక భాగంలో ఉంచండి. మీ భుజం, మొండెం, కటి, కాళ్ళు మరియు కాళ్ళ మధ్య సరళ రేఖను సాధించడానికి ప్రయత్నించండి. మీ గడ్డం మీ ఛాతీతో తాకడానికి ప్రయత్నించండి మరియు మీ చూపులను మీ పాదాలపై కేంద్రీకరించండి. లాభాలు సర్వంగాసన సిర్సాసన యొక్క అనేక ప్రయోజనాలను అందిస్తుంది మరియు ప్రదర్శించడం సులభం. స్టేజ్ 1 మరియు స్టేజ్ 2 థైరాయిడ్ సమస్యలతో బాధపడేవారికి ఈ ఆసనం మంచిది. ఇది కోర్ బలాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. ఇది సమతుల్య భావాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది రివర్స్ రక్త ప్రవాహానికి సహాయపడుతుంది, తద్వారా ముఖానికి మెరుగైన రక్త సరఫరా మరియు చర్మాన్ని పోషించడం మరియు శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది. ఇది మెడ, భుజం మరియు వెనుకకు బలం మరియు వశ్యతను ఇస్తుంది. సలహా : మణికట్టు, మెడ లేదా భుజం సమస్య ఉన్న అభ్యాసకులు ఈ ఆసనాన్ని చేయకుండా ఉండాలి. మహిళలు రుతుస్రావం లేదా గర్భధారణ సమయంలో ఈ ఆసనం చేయకుండా ఉండాలి. విస్తరించిన థైరాయిడ్, కాలేయం లేదా ప్లీహము, గర్భాశయ స్పాండిలైటిస్, స్లిప్డ్ డిస్క్ మరియు అధిక రక్తపోటు లేదా ఇతర గుండె జబ్బులతో బాధపడుతున్న ప్రాక్టీషనర్లు ఈ ఆసనాన్ని చేయకుండా ఉండాలి. వివిధ సాగతీత, మెలితిప్పిన మరియు కుదించే యోగా ఆసనాలు థైరాయిడ్ గ్రంధిని ఉత్తేజపరుస్తాయి మరియు ఆరోగ్యకరమైన జీవక్రియను అభివృద్ధి చేసే థైరాక్సిన్ను విడుదల చేయమని శరీరానికి చెబుతాయి. యోగా ఆసనాలు మంచి ఆరోగ్యం కోసం తక్కువ వ్యాయామం. అయితే, మీరు ఏదైనా యోగా కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు వైద్యుడిని సంప్రదించాలి.





# ఈ ప్రయోజనాలు తెలిస్తే మీరు రోజుకో గుడ్డు తినకుండా ఉండరు..

మనం ఆహారంగా తీసుకునే ప్రతి పదార్థంలో ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలుంటాయి. అయితే, కొన్ని రకాల ఆహార పదార్థాల్లో ఎక్కువ ఆరోగ్య ప్రయోజానాలున్న పోషకాలుంటే, మరికొన్ని రకాల ఆహార పదార్థాల్లో తక్కువ ఆరోగ్య ప్రయోజనాలున్న పోషకాలుంటాయి. ఇక అధిక ప్రయోజనంగల పోషకాలున్న ఆహార పదార్థాల విషయానికి వస్తే.. కోడిగుడ్డు ముందు వరుసలో ఉంటుంది. మనం రోజుకొక ఉడుకబెట్టిన కోడిగుడ్డు తింటే ఆరోగ్యపరంగా ఎన్నో లాభాలుంటాయి. మరి అవేంటో తెలుసుకుందాం..

**గుడ్డుతో లాభాలివే..**

1. కోడిగుడ్ల ద్వారా శరీరానికి రకరకాల పోషకాలు లభిస్తాయి. శరీరానికి కావాల్సిన సాచురేటెడ్ ఫ్యాట్స్, పాలీ అన్ సాచురేటెడ్ ఫ్యాట్స్, మోనో అన్ సాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. అదేవిధంగా పొటాషియం, విటమిన్, కాల్షియం, ఐరన్, విటమిన్, విటమిన్-6, విటమిన్-12, మెగ్నీషియం గుడ్డులో పుష్కలంగా లభిస్తాయి. అందుకే అంతే స్థాయిలో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.
2. కోడిగుడ్డు మెదడు ఆరోగ్యానికి చాలా మంచిది. గుడ్డు సొనలో ఉండే కోలిన్ అనే పోషక పదార్థం మెదడు కణాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
3. కోడిగుడ్డులోని ఐరన్‌ను శరీరం వేగంగా గ్రహిస్తుంది. ఈ ఐరన్ గర్భిణులు, బాలింతలకు బాగా ఉపయోగపడుతుంది. కాబట్టి గర్భిణులు, బాలింతలు ప్రతిరోజు ఉడుకబెట్టిన కోడిగుడ్డు తీసుకోవాలి.
4. గుడ్డులో ఉండే పోషక విలువలవల్ల ఇది మహిళల్లో రొమ్ము కాన్సర్ రాకుండా నిరోధించడంలో కూడా తోడ్పడుతుంది.
5. జుట్టు, గోర్లు ఆరోగ్యంగా ఉండేందుకూ గుడ్డు ఉపయోగపడుతుంది. గుడ్డులోని విటమిన్-%ూ% కళ్ళను ఆరోగ్యంగా ఉంచుతుంది.
6. గుడ్డులో పొటాషియం, కాల్షియం పుష్కలంగా ఉండటం వల్ల అవి ఎముకలు గట్టిపడటానికి తోడ్పడుతాయి.
7. నరాల బలహీనత ఉన్నవారు కూడా ప్రతిరోజూ క్రమం తప్పకుండా గుడ్డును తీసుకోవడంవల్ల ప్రయోజనం ఉంటుంది. అంతేగాక గుండె రక్తనాళాలకు కూడా కోడిగుడ్డుతో మేలు కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



# టీలో చక్కెరకు బదులుగా బెల్లంను చేర్చుకుంటే కలిగే లాభాలివే..!



చాయ్ ప్రియులు సాధారణంగా రోజుకు 5 కప్పుల కన్నా ఎక్కువగానే చాయ్ తాగుతుంటారు. అయితే చాయ్ తాగినప్పుడల్లా అందులో ఉండే చక్కెర శరీరంలోకి వెళ్లి అధికంగా క్యాలరీలు చేరేలా చేస్తుంది. దీంతో బరువు అధికంగా పెరుగుతారు. అయితే టీలో చక్కెరకు బదులుగా బెల్లంను చేర్చుకుంటే అధిక బరువు ముప్పు నుంచి తప్పించుకోవడంతోపాటు పలు ఆరోగ్యకర ప్రయోజనాలు కూడా కలుగుతాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం. మలబద్దకంతో బాధపడేవారికి బెల్లం ఎంతో మేలు చేస్తుంది. టీలో బెల్లంను చేర్చడం వల్ల జీర్ణ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. జీర్ణ ప్రక్రియ వేగంగా జరుగుతుంది. బెల్లంలో ఉండే ఐరన్‌తో రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు. దీంతోపాటు శరీరంలోని అవయవాలకు రక్త సరఫరా పెరుగుతుంది. టీలో బెల్లంతోపాటు కొద్దిగా అల్లంను కూడా చేర్చుకుంటే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు, దగ్గు, అలర్జీలు తగ్గుతాయి. బెల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరంలో ఏర్పడే ఫ్రీ ర్యాడికల్స్ చేసే నష్టాన్ని తగ్గిస్తాయి.

# ఒంట్లో వేడిని తగ్గించే చిట్కాలు ఏంటో తెలుసా..?

హైదరాబాద్: వేసవి కాలంలో సాధారణంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ ఎండలవల్ల శరీర ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. దీనివల్ల ఒళ్లు అలసిపోయి నీరసం ఆవహిస్తుంది. మరి ఈ పరిస్థితి రావద్దంటే శరీర ఉష్ణోగ్రతలు పెరుగకుండా చూసుకోవాలి. కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా శరీర ఉష్ణోగ్రతలను తగ్గించుకోవచ్చు. మరి ఆ చిట్కాలు ఏంటో ఒకసారి చూద్దామా..?

ఒంటికి వేడిచేసే ఆహార పదార్థాలైన పుల్లటి పండ్లు, బీట్‌రూట్‌లు, క్యారెట్‌లను వేసవిలో ఎక్కువగా తినకూడదు. దానిమ్మ పండులో శరీరంలో వేడిని తగ్గించే లక్షణం ఉంది. రెండుమూడు రోజులకు ఒకసారైనా దానిమ్మ గింజలు తినడం లేదా దానిమ్మ రసం తాగడంవల్ల శరీరం చల్లగా ఉంటుంది. నిమ్మ రసం, కొబ్బరి నీళ్లు తాగడం ద్వారా కూడా శరీరం చల్లబడుతుంది. రోజూ ఉదయం కొబ్బరి నూనె లేదా పొద్దు తిరుగుడు నూనెతో శరీరానికి మర్దన చేసుకుని స్నానం చేయడంవల్ల శరీరం చల్లబడుతుంది. రోజూ రెండు కప్పులు తాటి బెల్లం కలిపిన నీళ్లను తాగడం ద్వారా కూడా శరీరంలో వేడిని తగ్గించుకోవచ్చు. క్రమం తప్పకుండా ఎర్ర మందారం టీ తాగడంవల్ల శరీర ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.



# యాలకులతో ఎన్ని లాభాలో..!



హైదరాబాద్ :యాలకులు మన ఆహారానికి మంచి సువాసన అందించడంతో పాటు.. జీర్ణ శక్తి పెంచేందుకు సహాయపడతాయి. సహజంగా శరీరానికి చలువ చేసే గుణం వీటికి ఉంటుంది. అందుకనే.. మసాల దినులతో పాటు వీటిని రకరకాల వంటల్లో ఉపయోగిస్తారు. సేమియా, పరమాన్నం లాంటి వాటిల్లో కూడా యాలకుల పొడి వేస్తుండటం అనాదిగా వస్తుంది. అయితే యాలకులతో ఎన్నోఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవి... -యాలకుల గింజలలో టర్పనైన్, లిమొనెన్, టెర్పినోల్ లాంటి రసాయనాలు ఉంటాయి. వీటిని సంప్రదాయ వైద్యంలో అనేక రుగ్మతలకు మందుగా వాడతారు. -అజీర్తి, మలబద్ధకం, అల్సర్, ఆస్థమా, జలుబు, సైనస్ మొదలైన వ్యాధుల్లోను, తలనొప్పిలతో పాటు నోటి దుర్వాసన మొదలైన వాటి చికిత్సలో యాలకుడ పొడిని వాడతారు.ఈ మధ్య కాలంలో చాలా మంది హార్మోనల్ ఇంబ్యాలెన్స్, ఆకలి కాకపోవడం, అధికంగా దాహం వేయడం లాంటి సమస్యలతో బాధపడుతున్నారు. వీటన్నింటికి ఇలాచీ టీ తో చెక్ పెట్టొచ్చుట. అదెలాగో చూద్దాం.. చాలా మందిలో హార్మోన్ల అసమతుల్యత ఉంటుంది. జన్యుపరమైన కారణాలు లేక ఒత్తిడి లాంటి ఇతర కారణాల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. అలసట, ఆందోళన, సంతానలేమి, అధిక బరువు లాంటివి హార్మోనల్ ఇంబ్యాలెన్స్ లక్షణాలు. వీటన్నింటినీ దూరం చేసేందుకు ఇలాచీ టీ బాగా ఉపయోగపడుతుంది.

# అబద్ధం




బహుశా ఇప్పుడు అబద్ధం అర్థం మార్చేసుకుంది
ఎవరూ తమ పిల్లలకు హరిశ్చంద్ర పేరు పెట్టడంలేదు
ఒకప్పుడు కనీసం కనబడేదైనా నిజమనిపించేది
మాటలు, చేతలు, దృశ్యాలు
అన్నింటినీ అబద్ధం కమ్మేసింది
వాడో వాగ్దానాన్ని గాల్లో విసురుతాడు
అది గాల్లో ఉండగానే వెనక్కి లాక్కొని వాడే మింగుతాడు
వీడో నిర్మాణాన్నీ కళ్ళముందు రూపుగడతాడు
కలలే కదా!
ధ్వంసమవ్వడానికి సమయమవసరం లేదు
మనుషుల మధ్య
బంధాలవ్వాల్సిన మాటలు
బాధ్యతలవ్వాల్సిన మాటలు
నమ్మకాలవ్వాల్సిన మాటలు
పలచబడి తేలిపోతున్నాయి
మాట బయటకు రాకుండానే
అక్షరాలు కత్తెర్లకు బలవుతున్నాయి
పదాలు అర్థాలను వలిచేసుకొని
విపరీతార్థాల నగత్వంతో ఊరేగుతున్నాయి
మాటకు పూసిన పైపూత
క్షణాల్లో కరిగిపోయినా
నిజం చెప్పులేసుకోవడం
ఓ జీవితకాలం ఆలస్యమవుతోంది
ముక్కలు ముక్కలుగా అతుకులేసుకున్న దృశ్యాలు
నిజాలమీద నిప్పులు పోసి
చలికాసుకుంటున్నాయి
మేకప్పుల కప్పులతో మూసుకుపోయిన శరీరాలు
ఎవరికీ తమ లోపలి దేహాల్ని చూపడంలేదు
నిజం నీడల్లో సేదదీరాల్సిన నువ్వు
అబద్ధపు గాడ్పులే వాసంత సమీరాలనుకోవడమే
అతి పెద్ద విషాదం
ఎవరినైనా నమ్మించడం పెద్ద విషయమేమీ కాదు
కొనసాగించడమే అత్యంత క్లిష్టతరం
ఒక్కసారి నమ్మకం కోల్పోయాక
కట్టుకున్న అబద్ధపు మేడలన్నీ కుప్పకులాల్సిందే !

# గాలి వాన



ఎన్నో కన్నీళ్లు, ఎంతో శ్రమ
ఎరువుగా వేసి పెంచుకున్న కుసుమం
ఒక్క లీకు పురుగుతో
పూయకుండానే నేల రాలింది
పరిమళం మట్టిపొరల్లో బొందపెట్టబడింది
చుట్టూ చెదపురుగులే చేరిపోయి
వ్యవస్థ కాండాన్ని కసిదీరా పీల్చేస్తుంటే
కలలు గిడసబారక ఏం జేస్తాయి?
ప్రతిదీ డబ్బుతోనే కొనగలమనే
అహంకారం వాడిదైతే
ప్రతిదీ అమ్మకానికే పెట్టగలం
అన్న అమాయకత్వం
ఆత్మాభిమానంలేని గొర్రెలదైతే
గెలుపులన్నీ ప్రాణపసలేని
తోలు తిత్తులుగాను
పరీక్షలన్నీ జీవితాల్ని తలకిందులు చేసే
చిత్తు కాగితాల్లానూ మిగిలిపోతాయి
మనుషులెప్పుడో మాయమైపోయి
నోట్ల కట్టల కిందపడి
మరణిస్తున్న నీతి సూత్రాలు
దారప్పోగుల్లా తెగిపోతున్న భవిష్యత్తు కలలు
కొనీ కొనీ వాడు కొండంత
పెరిగిపోతూనే వుంటాడు
అమ్ముకునీ అమ్ముకునీ
నీ ఒంట్లో అవయవాలు కూడా
మిగలని బేరానికి బలై
నువ్వే భూస్థాపితమైపోతావు
ప్రతిదీ అమ్మకపు సరుకైనచోట
జీవితాశల పున్నాగ పూలూ
లీకుల ఈదురుగాలికి
నేలరాలిపోతుంటాయి
ప్రతిదీ కొనగలమనే
ధీమా పరుచుకున్నచోట
మన వ్యక్తిత్వాలతో పాటు
మన ఒంట్లోని అవయవాలు కూడా
అంగడి సరుకులై
మన బతుకులే నిత్యం
ఓడిపోతూ వుంటాయి
అయినా, ఆఖరి ఆశల పూలనూ
నిలువరించగలిగే
ఇంకా కొన్ని పిడికిళ్లు
గాలిలోకి లేచే వున్నాయి
వందగొర్లను తిన్న రాబందు కూడా
క్షణాల్లో రాలిపోయే గాలివానొకటి
రూపుకడుతూనే వుంది

# ప్రపంచ రంగస్థలం









%నాటకం సార్వజనీనం, సర్వకాలీనం. ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి. ఒక దేశం ప్రేరణా, ప్రమేయం లేకుండా ఈ నాటక కళ వివిధ దేశాల్లో విడివిడిగా ఎదిగింది. దాదాపుగా ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, మనదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలయ్యింది. కాలాన్ని బట్టీ, ప్రదేశాన్ని బట్టీ, సంస్కృతిని బట్టీ నాటకం రూపం మారుతుందేగానీ అంతర్లీనంగా దాని మూల సూత్రం మాత్రం అందరికీ ఒక్కటే ఉంటుంది. అందువల్లే నాటకం బహుళాదరణ పొందిన రంగస్థల ప్రక్రియగా విలసిల్లుతుంది. ప్రస్తుతమున్న నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుంటా విశ్వజనీనమైంది. దాని గుర్తుగానే ప్రపంచ రంగస్థల దినోత్సవం పుట్టింది. ఈ వేడుకలలో భాగంగా అన్ని దేశాల్లో జరుగుతున్న నాటకాలు, ప్రదర్శనలు ప్రక్రియల ప్రమాణాలపై పరిశీలనలు జరుపుకుంటారు. సీనియర్ రచయితలు నటులకు, నటీమణులకు సత్కారాలు చేస్తారు.

క్రీ.పూ. ఆరో శతాబ్దానికి ముందే ఈజిప్టులో ఆసియా మైనర్‌లో పేషన్ నాటకాలు వుండేవని తెలుస్తుంది. క్రీ.పూ.900-800లో రాసిన గ్రీకు నాటకాలలో హొమర్ రాసిన ఇలియడ్, ఒడెస్సీ గ్రీకుల మహా గ్రంథాలు, కావ్యాలు ఆధారంగా తీసుకున్నవే అంటారు. గ్రీకు నాటకం పుట్టిందీ, వికసించిందీ ఏథెన్స్‌లోనే. ఇక ఈజిప్టులోని ఆసియా మైనర్‌లో పేషన్ నాటకాలు వుండేవి. వాటిని అబిడోఐస్ పేషన్ ప్లేస్ అని అన్నారు. ఈజిప్టు ప్రజల ఆరాధ్యుడిగా, జనన మరణాలకు అధిపతిగా ఒరిసిస్‌ను భావించేవారు. పేషన్ నాటకాలు ఈ ఒరిసిస్ గౌరవార్థం జరిగే ఉత్సవాలలో ప్రదర్శించేవారు.

## గ్రీకులే ఆద్యులు..

క్రమంగా గ్రీకులు దేవుళ్ళకు, దేవతలకు మానవరూపం కల్పించుకొనేవారు. వారి చుట్టూ ఎన్నోకథలల్లి అనేకపేర్లతో వారు ఉత్సవాలను, క్రతువులను నిర్వహిస్తుండేవారు. ఆయా క్రతువుల్లో మేక చర్మాన్ని ధరించి, చిందులు వేస్తూ స్తుతి గీతాలను గానం చేస్తూ కథలను వినిపించే వారు. ప్రత్యేకత ఏమంటే..

## అవన్నీ విషాదాంత కథలే..

నాటక విమర్శకుడు శ్రీనివాస చక్రవర్తి వీటిని భజన బృందాలు అనీ, వారిని కోరస్ అని పిలిచేవారని అన్నారు. ఈ బృందం గానం చేసే గీతాలను డిథిరాంట్స్ అనేవారు. ఈ బృంద నాయకుడు కొరిఫెకస్. ఇతడు మన నాటకాలలో సూత్రధారుడు వంటివాడు. క్రమేణా ఎస్కిలస్, సోఫోక్లిస్, యూరిపిడిస్ అనే ముగ్గురు గ్రీకు విషాదాంత నాటక రచయితలుగా పేరొందారు. ఎస్కిలస్ ఎనభై నాటకాలు రాసినా ప్రస్తుతం ఏడు మాత్రమే లభ్యమవుతున్నాయట. సోఫోక్లిస్ వందకు పైగా నాటకాలు రాశాడన్నారు. కానీ ఈయనవి కూడా ఏడు మాత్రమే లభ్యమవుతున్నాయి. నాటక పోటీల్లో సోఫోక్లిస్ ఎస్కిలస్‌ను ఓడించాడు. ఈ పోటీల్లో 18 సార్లు గెలుపొందాడు. సోఫోక్లిస్ వారసుడిగా యురిపిడస్‌ను చెప్తారు. అయినా ప్రవృత్తిరీత్యా సోఫోక్లిస్‌కి పూర్తిగా విరుద్ధ స్వభావం కలవాడు. యురిపిడస్ 92 నాటకాలు రచించగా నాటకపోటీల్లో ఐదుసార్లు బహుమతులు గెలుచుకున్నాడు. ఈ రకంగా గ్రీకులో పుట్టిన నాటకం అన్ని దేశాలలోనూ వ్యాపించి, శాఖోపశాఖలుగా విస్తరిల్లి మానవ జీవితాలలో ఒక భాగంగా రూపు దిద్దుకుంది.

## రోమన్‌లో వినోద క్రీడగా..

రోమ్ గ్రీసు దేశాన్ని జయించి, పరిపాలన హస్తగతం చేసుకోవటంతో గ్రీకు సంస్కృతి తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. గ్రీకు నాటకాల రచనా శైలిని అనుకరిస్తూ రోమన్ పురాణాలు, చారిత్రక ఘట్టాలను ఇతివృత్తంగా స్వీకరించి, నాటక రచనలు చేశారు. రోమన్ రిపబ్లిక్ అవతరించిన తర్వాత ప్రజల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వినోద క్రీడలలో నాటక ప్రదర్శన కూడా ఒకటి. అప్పట్లో రోమన్‌ల భాష లాటిన్. ఆయా నాటకాలు లాటిన్ భాషలోనే రాసేవారు. రోమన్ నాటక రచయితల్లో లివియస్ ఆంద్రోనికస్ పితామహుని లాంటివాడు. ఈయన అనేక గ్రీకు నాటకాలను లాటిన్‌లోకి అనువదించాడు. తరువాత మార్కస్ పాక్యులియస్, సేవియస్, ప్లాటస్, చెప్పుకోదగిన వారు. ప్లాటస్ సుమారు 130 నాటకాలు రాసినట్లు తెలుస్తోంది. వీరిలో (రోమన్ నాటక రచయితల్లో) సెనెకాను చివరి వాడిగా చెప్పుకోవచ్చు. ఈయన నీరో చక్రవర్తికి గురువు. నీరో ఆజ్ఞ శిరసావహించి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతటితో రోమన్‌నాటక రంగం అంతరించింది.

## ఫ్రెంచిలో.. విషాద నాటకాలు..

లాటిన్ భాష నుంచి ఫ్రెంచ్ భాష ఆవిర్భవించింది. ఫ్రాన్స్ దేశంలోనూ నాటక కళ బాగా అభివృద్ధి చెందింది. ఫ్రెంచ్ నాటక రచయితల్లో పియరీ కార్నియవ్, జీన్‌రేసిన్, మోలియర్, వాల్టేర్, రూసో, ఎమిలీజోలా, మేటర్‌విరు, శామ్యూల్ బెకెట్, యూజినీ ఇయనెస్కో, జీన్‌పాల్ సాత్రే, ఆల్బర్ట్‌కామూ వంటి ప్రఖ్యాత రచయితలు ఫ్రెంచ్ నాటకరంగాన్ని సుసంపన్నం చేశారు. జీన్‌రేసిన్ ఫ్రెంచి నాటకాలు గ్రీకు, రోమన్ విషాద నాటకాలకు ధీటైనవని నిరూపించి, అనంతర రచయితలకు మార్గదర్శకుడ య్యారు. ఈయన రాసిన విషాదాంత నాటకాల్లో ఆంద్రోమాన్, బెరినైన్, ఫెద్రా ప్రసిద్ధమైన నాటకాలు. ఈయన రాసిన ఫెద్రా అనే నాటకం మన చిత్రాంగి, సారంగధరుల నాటకాన్ని పోలిన టువంటిది. గ్రీకు నాటకం హిప్పోలిటస్ అనే నాటకం ఈ నాటకానికి ఆధారం. మన ఆంధ్రనాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులు రాసిన విషాద సారంగధరం ఈసమయంలో గుర్తుకురాక తప్పదు. సవితి కొడుకును ప్రేమించిన ఫెద్రా అనే యువతి కథ ఇది. మొలియర్ ప్రపంచ ప్రసిద్ధ హాస్య నాటకకర్తగా పేరు గడించాడు. ఎమిలీజోలా 'నేచురలిజం'ను అనుసరించి, నాటకాలు రాశారు. తరువాత కాలక్రమంలో జర్మన్, అమెరికా, బ్రిటన్, చైనా, జపాన్, రష్యా దేశాలతో పాటు పోలెండ్, ఐర్లాండ్, దేశాల్లో నాటక రంగం పురోభివృద్ధి చెందింది.

## జర్మనీలో జాతీయ నాటకశాల..

జర్మనీలో 17వ శతాబ్ది ఉత్తరార్థం వరకు సాంస్కృతిక కార్యకలాపాలకు వేదిక ఏర్పడలేదు. అయినా గ్రీకు, రోమన్ సాంప్రదాయాల పద్ధతిలో నాటకాలు ప్రదర్శించినట్లు తెలుస్తోంది. జర్మనీ దేశపు ప్రసిద్ధ నాటక రచయితల్లో గొట్టోల్డ్ ఎఫ్రయిమ్ లెస్సింగ్ ప్రథముడిగా చెప్పుకోవచ్చు. ఈయన తర్వాత క్రిస్టోఫ్ మార్టిన్ వీలాండ్ చక్కటి భాషలో షేక్స్‌పియర్ రాసిన 22 నాటకాలను జర్మనీలోకి అనువదించాడు. జర్మనీలో 1755లో గోతాలో మొదటి జాతీయ నాటకశాల నిర్మించబడింది. తరువాత అన్ని ముఖ్య పట్టణాల్లో నాటకశాలలు వెలిశాయి. జర్మనీలో గెటే షిల్లర్, ఇఫ్లాండ్ మొదలైనవారు జర్మనీ నాటక రంగానికి ఇతోధిక సేవ చేశారు. గెటే నాటకాల్లో ప్రసిద్ధమైనది 'డాక్టర్ ఫాస్ట్'. సృష్టి రహస్యాన్ని ఛేదించడానికి తన ఆత్మను సాటన్‌కు అప్పగించడమే ఈ నాటకంలోని ప్రధానాంశం. నవ సమాజాన్ని దృష్టిలో వుంచుకొని 1907లో స్థాపించిన మ్యూనిచ్ ఆర్ట్ థియేటర్‌లో రంగస్థల నిర్మాణాల్లో కొన్ని మార్పులు తీసుకొచ్చారు. రీన్‌హార్ట్ జర్మనీలో మరొక ప్రసిద్ధ నటుడు. నాటక ప్రదర్శనలో అన్ని శాఖల మీద పట్టు వుండాలన్నది రీన్‌హార్ట్ విశ్వాసం.

## అమెరికాలో.. ఆర్థర్ మిల్లర్‌తోనే ప్రఖ్యాతి..

అమెరికాకు స్వాతంత్ర్యం లభించిన తరువాతనే నాటక రంగంలో ఆశారేఖలు ప్రసరించాయి. అమెరికా నాటక రంగానికి ప్రఖ్యాతి తెచ్చిన వారిలో ఆర్థర్‌మిల్లర్, సమకాలిక సమస్యలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చిన రచయిత. 'ది డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మెన్' ఈయనకు సుస్థిర స్థానం సంపాదించి పెట్టింది. కొత్త ఒరవడిని సృష్టించినవారిలో ఎల్మర్‌రైస్, నీల్‌సైమన్ ప్రముఖులు. రైస్ రాసిన 'ఆన్‌ట్రయిల్', సైమన్ మధ్యతరగతి మనస్తత్వాన్ని చిత్రీకరించిన 'ఆడ్‌కపుల్, చాప్టర్‌టు' ఆయనకు పేరు తెచ్చాయి.

## బ్రిటన్‌లో.. షేక్స్‌పియర్ నాటకాలు

బ్రిటన్‌లో నాటక రంగానికి సేవ చేసినవారిలో ప్రథముడు షేక్స్‌పియర్. ఆయన సృష్టించిన పాత్రలు నేటికీ జనసామాన్యంలో శాశ్వతంగా నిలిచిపోయాయి. ఆయన సమకాలీకులు బెన్ జాన్సన్, ఫ్లెచర్. వీరు కూడా నాటక రంగానికి ఎనలేని సేవ చేశారు. బెన్‌జాన్సన్ రాసిన 'వాల్‌పోన్, ది ఆల్ కెమిస్ట్' మొదలైన నాటకాల్లో సుప్రసిద్ధులు. ఈయనను ప్రభుత్వం ఆస్థాన కవిగా నియమించి, ఉపకారవేతనం ఇచ్చింది. సోమర్ సెట్ మామ్ కూడా 19వ శతాబ్దం చివరలో నాటక రచనకు పూనుకున్నాడు. 'లేడీ ఫ్రెడరిక్, మిసెస్‌డాట్' వంటి ఆహ్లాదకర నాటకాలు రచించాడు. 1908లో మామ్ రాసిన నాటకాలు ఒకేసారి వెస్టెండ్ నాటక మందిరాల్లో ప్రదర్శించారు. 'ది ఎక్స్‌ప్లోరర్, ది సర్కిల్, ది కాన్‌స్టాంట్ వైఫ్' మొదలైన మామ్ నాటకాలు ఒకేసారి వెస్టెండ్ నాటక మందిరాల్లో ప్రదర్శించారు. ఆంగ్ల నాటక రంగంలో ప్రయోగాత్మక నాటకాలు రాసిన వారిలో హెరాల్డ్‌ప్రింటర్ ప్రముఖులు. ఈయన సుమారు 15 నాటకాలు రచించారు. ప్రింటర్ నాటకాలు అబ్బర్డ్ శైలికి చెందినవి. 'ది హౌమ్ కమింగ్, సైలెన్స్, బిట్రేయిల్' మొదలైనవి ముఖ్యమైనవి. ప్రింటర్‌కు 2005లో నోబెల్ బహుమతి లభించింది.

## చైనీస్ లిటిల్ థియేటర్ ఉద్యమం..

చైనాలో 1280 నుంచి నాటక రంగం అభివృద్ధి చెందింది. ఈనాటికీ చైనాలో 14వ శతాబ్దపు సాంప్రదాయ పద్ధతుల్లోనే నాటకాల్ని ప్రదర్శిస్తున్నారు. అలానే నడుస్తున్నాయి కూడా. 19వ శతాబ్దం రెండో భాగంలో 'పెకింగ్ ఒపెరా' అనే నూతన సంగీత బాణీలో నాటక ప్రదర్శనలు ఆరంభమయ్యాయి. అది ఇప్పటికీ ప్రజాదరణ పొందుతోంది. లిటిల్ థియేటర్ ఉద్యమం 1981 తర్వాత చైనాలో ప్రారంభమైంది. ఇది మన వీధి నాటకాల వంటిది. చైనాలో జింగ్ జియాంగ్, శామ్యూల్ బెకెట్, బెర్టోల్ట్ బ్రెక్ట్ మొదలైనవారు ప్రముఖులు. జియాంగ్ రచనల్లో బెకెట్, బ్రెక్ట్ రచనా పోకడలు కనిపిస్తాయి. అధికార పార్టీ ఈయన రచనలను నిషేధించింది. జియాంగ్ రాసిన 'ది అదర్ ఫోర్' నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది. 2000లో నోబెల్ బహుమతికి ఎంపిక చేసినా ఆయన నిరాకరించారు.

## జపాన్‌లో మూడురకాల ప్రదర్శనలు..

జపాన్‌లో జిగాకు, బుగాకు, సరుగాకు అనే మూడు రకాల కళా ప్రదర్శనలు చాలా ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నాయి. ఇప్పుడు బుగాకు పద్ధతి ప్రదర్శనా రూపమే 'ణో' (ఎన్.ఓ.హెచ్) నాటక ప్రక్రియకు ఆధారం. ఇప్పుడు 'ణో' నాటకాలే ప్రదర్శిస్తున్నారు. 20వ శతాబ్దంలో జపాన్ రంగస్థలంలోకి పాశ్చాత్య నాటకాలు ప్రవేశించాయి. జపాన్‌లోని ఫ్రీ థియేటర్ సొసైటీ షేక్స్‌పియర్, ఇబ్సన్, బెర్నార్డ్ షా మొదలైనవారి నాటకాలను అనువదించి ప్రదర్శిస్తోంది.

## అంతిమంగా స్పృశించేది నాటకమే..

'నాటకాంతం హి సాహిత్యం' అన్నాడు మహాకవి కాళిదాసు. అంటే అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ చివరిగా స్పృశించవలసిన అంకం నాటకమని అర్థం. కవిత్వం, వ్యాసం, కథ.. ఇలా అన్ని సాహిత్య ప్రక్రియలను స్పృశించిన తరువాత మాత్రమే నాటకాన్ని రచించాలన్నాడు. అప్పుడు మాత్రమే నాటక రచనకు నిండుదనం చేకూరుతుందని ఆయన భావన. ప్రపంచ సాహిత్యంలో "మాళవికాగ్నిమిత్రం", "అభిజ్ఞాన శాకుంతలం" వంటి నాటకాల ద్వారా చిరస్థాయిగా నిలిచిపోయిన కాళిదాసు అభిప్రాయం నూటికి నూరుపాళ్ళూ నిజమని ఆధునిక రచయితలు మనస్ఫూర్తిగా అంగీకరిస్తారు. నాటకానికి అంత శక్తి ఉంది. కాబట్టే, "నాటకం రసాత్మకం కావ్యం" అన్నాడు.

నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. యక్షగానానికి రూపాంతరమైన నాటకానికి సూత్రధారుడే ఆయువుపట్టు. ఇందులోని పాత్రలన్నీ తమను తామే పరిచయం చేసుకొంటూ రంగప్రవేశం చేస్తాయి. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను 'చిందు భాగవతము, యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట' అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. కాకతీయుల కాలంలో ప్రదర్శించిన క్రీడాభిరామం కూడా ఒక నాటకమే. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసుకొవచ్చు.

## తెలుగు రాష్ట్రాల్లో..

ప్రముఖ హాస్య రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం 1889లో నాటక రచన ఆరంభం చేశారు. వీరి నాటకాలలో "గయోపాఖ్యానం" సుప్రసిద్ధమైనది. 1891లో "నాగానంద" ఆంధ్రీకరణతో తెలుగు నాటకరంగంలో అడుగుపెట్టిన వేదం వెంకటరాయశాస్త్రి రచించిన "ప్రతాపరుద్రీయం" బహుళ ఖ్యాతి పొందింది. కల్పనా శక్తి రచయితకు సాహిత్య రంగంలో ఎంతటి ఉన్నత స్థానాన్ని అందిస్తుందో ఈ నాటకమే ఉదాహరణ. ఈ నాటకంలో వీరి కల్పిత పాత్రైన యుగంధర మంత్రి చారిత్రక పురుషుడుగా ఆంధ్ర సారస్వతంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. అట్లే పేరిగాడు, విద్యానాథుడు, చెకుము కు శాస్త్రి, ఎల్లి మొదలగు పాత్రలు వీరి రచనా చమత్కారం వలన చిరస్మర ణీయమైన పాత్రలుగా రూపొందారు. సుమారు 138 సంవత్సరాల చరిత్ర కలిగిన సురభి కళాకారులు నేటికీ ఎక్కడ నాటకం ఉందంటే అక్కడికి పెట్టేబేడా సర్దుకుని పొట్ట చేతబట్టుకుని వెళ్లి నాటకం ఆడుతున్నారు. ఎక్కడో ఒక మూలనైనా రంగస్థల కళలను ఆదరించే మారాజులు లేకపోతారా అని వారి ధీమా.

## వ్యవహారిక భాషలో సంచలనం..

1887లో ప్రకటితమైన గురజాడ అప్పారావుగారి "కన్యాశుల్కం" వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892, ఆగస్టులో విజయనగరంలోని జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయవంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది.

"ప్రతాపరుద్రీయం", "కన్యాశుల్కం" రెండు రాత్రుల రూపకాలు కాగా 1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీనివాసరావుగారు. వీరు అధికంగా చారిత్రక నాటకాలు రచించడంచేత "చారిత్రక నాటక పితామహుడు"గా పేరొందారు. అదేవిధంగా పానుగంటి లక్ష్మీ నరసింహారావు రచించిన తొలి నాటకం "నర్మదా పురుకుత్సీయము" 1900లో ప్రకటితమైంది.

ముప్పైకి పైగా స్వతంత్ర నాటకాలు రచించిన వీరికి షేక్స్పియర్ ఆదర్శం. వీరి వచన రచన వ్యావహారికానికి దగ్గరగా ఉండే సరళ గ్రాంథికం. వీరి రచనలలో లోకోక్తులు, పలుకుబడులు అధికం. వీరి నాటకాలలో "రాధాకృష్ణ", "పాదుకాపట్టాభిషేకం", "కంఠాభరణము" ప్రసిద్ధమైనవి. "కంఠాభరణము" తెలుగులో పరిపూర్ణమైన స్వతంత్ర స్వతంత్ర ప్రహసనము. 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగురాష్ట్రాల్లో అన్ని ప్రాంతాలకూ వ్యాపించాయి.

## పెన్షన్ ఇచ్చి గౌరవించాలి..

సినిమాకి ముందు నాటకాలకు విపరీతమైన ఆదరణ ఉండేది. విలియం షేక్స్పియర్ వంటి ఆంగ్ల కవులు విషాదానికి, హాస్యం జోడించి రచనలు చేశారు. ప్రస్తుతం నాటకాలు ఒకవైపు ప్రేక్షకుల ఆదరణ లేక, మరోవైపు ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేక ఉనికిని కోల్పోతున్నాయి. కళాకారులు కూడా ఉపాధి లేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు నాటకాలను ప్రోత్సహించాలి. కళాకారులకు తగిన గౌరవం ఇవ్వాలి. వారికి అధిక మొత్తంలో పెన్షన్ ఇవ్వాలి.

# ఎగిరే జింక–1

**మధిర సుబ్బన్న దీక్షితులు 1930వ దశకంలో రచించిన కాశీమజిలీ కథలు అప్పట్లో ఆబాలగోపాలాన్ని అలరించాయి. తెలుగు సాహిత్యంలో తప్పకుండా చదవాల్సిన గొప్ప గ్రంథాల్లో కాశీమజిలీ కథలు ముఖ్య స్థానాన్ని ఆక్రమించాయి. పన్నెండు భాగాలుగా వెలువడిన ఈ గ్రంథంలోని మూడోభాగం కథలు ప్రస్తుతం మీరు చదువుతున్నారు.**



కుంభకోణం పట్టణాన్ని విజయకేతుడనే రాజు పాలిస్తున్నాడు. ఆయన ఒక్కగానొక్క కొడుకు కందర్పుడు. పేరులోనూ, రూపంలోనూ మన్మథుడే. అతనికి చిన్నతనం నుంచి దేశవిదేశాల్లోని వింతలు చూడాలని కోరిక. కానీ దేశాటనం అంటే మాటలతో పని కాదు.

'తల్లిదండ్రులతో చెబితే వెళ్లనివ్వరు. ఒకవేళ వారు ఒప్పుకొన్నా తక్కువ వ్యవధిలో దేశాలన్నీ చూసిరావడం అసాధ్యం. గట్టిగా ప్రయత్నిస్తే భరతఖండంలోని యాభై ఆరు దేశాలనూ చూడొచ్చు. మిగిలిన వాటిమాటేమిటి?! ఆకాశంలో ప్రయాణిస్తేకానీ చేరుకోలేని ద్వీపాలు, దేశాలెన్నో ఈ భూమండలంలో ఉన్నాయని చెప్పుకొంటారు. వాటిని చూడటం ఎలా?' అనే ఆలోచనలే అనుక్షణమూ కందర్పుడిని బాధించేవి. యుక్తవయసు వచ్చిన తరువాత తన మనసులోని భావాలను ఒక ఉపాధ్యాయునితో పంచుకున్నాడు. కానీ ఆయన సైతం..

"వత్సా! నీ తండ్రి వృద్ధుడు. నువ్వు ఆయనకు సహకరించాలి. రాజ్యభారాన్ని పంచుకుని ప్రజలను న్యాయంగా పాలించాలి. అంతేకానీ వెర్రి ఊహలు చేయకు" అని హితవు పలికాడు.

**కందర్పుడు ఆ మాటలకు అంగీకరించలేదు.**

"ఆచార్యా! విస్తారమైన ఈ భూమిపై మన రాజ్యం ఏపాటిది? మావంటి రాజులు ఎందరు లేరు? మీ ఇంటిలో మాత్రం ప్రజలు లేరా? వారికి మీరు మాత్రం ప్రభువులు కాదా? నా ప్రజలమీద నాకుమాత్రం అంతకంటే అధికారాలేం ఉంటాయి? వీటిపైన నాకు ఆసక్తి లేదు. మనుచరిత్రలో ప్రవరాఖ్యుని చరిత్ర చదివిన కొద్దీ నాకు దేశాటన పట్ల ఆసక్తి పెరిగిపోతున్నది. ఔషధాల వల్ల, యంత్రాలవల్ల మన పూర్వికులు ఇతరులకు సాధ్యంకాని దూరతీరాలకు ప్రయాణించారని కావ్యాలు వర్ణిస్తున్నాయి కదా?! దయచేసి అటువంటి విశేషాలేమైనా మీకు తెలిస్తే చెప్పండి" అని పదేపదే అడిగాడు.

**అందుకు ఆ ఉపాధ్యాయుడు..**

"రాకుమారా! మన నగరంలో మణివర్మ ఉన్నాడు. వారు వంశపారంపర్యంగా యంత్రాలు చేయడంలో, తంత్రాలు పన్ని రూపాలు మార్చడంలో ఆరితేరినవారు. మణివర్మ ముత్తాతకైతే సాక్షాత్తూ విశ్వకర్మ అని పేరుండేది. ఆయన స్వయంగా ఒక కీలుజింకను తయారుచేసుకుని, దానిమీద దేశాలన్నీ తిరిగేవాడట. నా అంచనా నిజమైతే ఆ జింక ఇప్పటికీ మణివర్మ ఇంట్లోనే ఉండి ఉంటుంది" అని చెప్పాడు.

"అయితే పదండి. మణివర్మ ఇంటికి వెళ్దాం" ఆసక్తిగా అడిగాడు కందర్పుడు.

**ఉపాధ్యాయుడు పెదవి విరిచి..**

"మణివర్మ మహామూరుడు. అనుమతిలేనిదే చీమనైనా తన ఇంట్లోకి రానీయడు. తాను ఇల్లు వదిలి బయటికి రాడు. అటువంటివాడి వద్ద నేర్పుగా పని సాధించుకోవాలి" అని చెప్పాడు.

ఆ నిమిషం నుంచి కందర్పుడు అదే పనిలో ఉన్నాడు. ఒకనాడు సామాన్య పౌరునిలా వేషం వేసుకుని బయల్దేరాడు. కంచుకోటలా ఎత్తయిన ప్రహరీ, పటిష్ఠమైన సింహద్వారం కలిగిన మణివర్మ ఇంటికి కొద్దిదూరంలో నిలబడి వచ్చేపోయేవారిని గమనించసాగాడు. కొంతసేపటికి మణివర్మ ఇంట్లోంచి ఒక వృద్ధుడు బయటికి వచ్చాడు. కందర్పుడు అతనితో మెల్లిగా మాట కలిపాడు. మణివర్మ ఇంటి సంగతులు కొన్ని రాబట్టాడు.

"మణివర్మ కోపదారి మనిషి. భార్యను చీటికిమాటికి కొడుతుంటాడు. మనుమరాలైన సుభద్రను మాత్రమే ప్రేమగా చూస్తాడు. ఎప్పుడూ తన గదిలో ఒంటరిగా ఉండి, శక్తిపూజ చేసుకుంటూ ఉంటాడు. సుభద్ర చక్కటి పూలతోట ఒకటి పెంచుకుంటున్నది. నేను తోటమాలిగా పనిచేస్తున్నాను" అని వృద్ధుడు చెప్పుకొచ్చాడు.

ఆ విషయాలన్నీ పదేపదే తర్కించుకున్న తరువాత, "తాతా! నువ్వు నాకో సాయం చేసిపెట్టాలి. ఆరోగ్యం సరిగాలేదని వంకపెట్టి, నీకు సహాయకునిగా నీతోపాటు నన్ను కూడా పనికి తీసుకెళ్లు" అని కందర్పుడు బతిమాలాడు.

"ఈ సంగతి మణివర్మకు తెలిస్తే తోలు ఒలిచేస్తాడు. ఆయన అనుమతి లేకుండా పురుగైనా ఆ ఇంట్లో కాలుపెట్టలేదు" అని భయపెట్టాడు వృద్ధుడు. అతని చేతిలో వరహాలమూట పెట్టాడు కందర్పుడు. వృద్ధుడి కళ్లు మెరిశాయి. మరునాడు ఇద్దరూ కలిసి మణివర్మ ఇంటికి వెళ్లారు. సుభద్ర తలుపు తీసింది. ముసలాయనతోపాటు కందర్పుడు కూడా లోపలికి ప్రవేశించడం ఆమె గమనించలేదు. కానీ, కందర్పుడు తేరిపార చూశాడు. ఆమె ముఖ కవళికలను

**మనసులో ముద్రించుకున్నాడు.**

వృద్ధుడు మొక్కలకు నీళ్లు తోడుతుంటే.. కందర్పుడు ఓ చెట్టుకింద మట్టిలో పుల్లతో గీస్తూ ఆడసాగాడు. కొంతసేపటికి సుభద్ర వచ్చింది.

"ఏమయ్యా! ఆ ముసలాయన అంతలా కష్టపడుతుంటే నువ్వు మాత్రం సోమరిపోతులా కూర్చున్నావేం?! కూలి తీసుకోవడం లేదా?" అని నిలదీసింది.

"ఏం చేయను మరి.. నాకీ మోటుపని అలవాటు లేదు. తోడుగా ఉండమని తాత పిలిస్తే వచ్చాను. నాకు తెలిసిన పని ఇదొక్కటే" అని కందర్పుడు ఆమె చేతికి ఒక చిత్రపటాన్ని చూపించాడు. అందులో ఒక సుందరమైన ఉద్యానంలో ఆలుమగలు విహరిస్తున్నట్లు గీశాడు.

"ఈ అమ్మాయి బొమ్మ నా పోలికలో గీశావేం?!" అడిగింది సుభద్ర. కందర్పుడు నవ్వి ఊరుకున్నాడు.

"అబ్బాయి బొమ్మ నీ పోలికలో ఉన్నట్లుందేం?!" అని కోపం ప్రదర్శించింది. "అవునా! నాకు తెలియదే.." అమాయకత్వాన్ని నటించాడు కందర్పుడు. ఆమె కోపమూ, అతని అమాయకత్వమూ రెండూ నిజమైనవి కావు. ఆ తరువాత వాళ్లిద్దరి మధ్య చాలా సుదీర్ఘమైన సంభాషణ నడిచింది. కానీ ఆ మాటలేవీ అక్షరాల్లో ఒదగవు. అదంతా ఒట్టి కళ్ల భాష మాత్రమే.

**ఆ భాషకు ముగింపుగా సుభద్ర..**

"నాకు చిత్రలేఖనం నేర్చుకోవాలని చాలాకాలం నుంచి ఆశ. నేర్పించగలవా?" అని అడిగింది.

అందుకు కందర్పుడు ఒప్పుకొని.. అప్పటికప్పుడే ఆమెకు బోధన ప్రారంభించాడు. బొమ్మగీస్తున్న సమయంలో అతని వేళ్లకేసి ఆదమరుపుగా చూసే సరికి రత్నపుటుంగరం తళుక్కున మెరిసింది.

"ఎవరు నువ్వు? ఇంత డబ్బున్న వాడివి కూలిపనికి ఎందుకు వచ్చావు?!" అని నిలదీసింది. "చల్లకు వచ్చి ముంతదాచిపెట్టడం ఎందుకు?! నేను యువరాజు కందర్పుడను" అని చెప్పాడు.

**ఆ మాటలతో నిలువెల్లా కంపించిపోయింది సుభద్ర.**

"యువరాజులవారా? మా ఇంటికి వేంచేశారా?! ఇంతసేపూ నేను మిమ్మల్ని మామూలు కూలివాడిలా పరిగణించానా?!" అని అస్థిమితంగా అటూ ఇటూ తిరుగుతూ తన మనసులోని కలవరపాటును ప్రదర్శించింది. ఉన్నట్లుండి అతని పాదాలకు నమస్కరించింది.

**ఆమెను లేవనెత్తి..**

"అమ్మాణీ! మరేమీ పరవాలేదు. నేను నీ సహాయం కోరి వచ్చాను. మీ తాత సాక్షాత్తూ విశ్వకర్మ అవతారమేనని చెప్పుకొంటారు. మీ ఇంటిలో ఎన్నెన్నో వింత వస్తువులు ఉన్నాయని విన్నాను. వాటిని చూడాలని నా కోరిక. చూపగలవా?!" అడిగాడు కందర్పుడు.

**గుండెల మీద చేయి వేసుకుని..**

"మా తాతకు తెలిస్తే నా తల తీస్తాడు" అని చెప్పింది.

"మనసుంటే మార్గముండదా?! ఇంత దయగల దానివి ఈమాత్రం సాయం చేయలేవా" అంటూ కన్ను గిలిపాడు కందర్పుడు.

**దాంతో మరింత తబ్బిబ్బుపడింది సుభద్ర.**

"ఒక పనిచేయండి. రాత్రి పొద్దుపోయేదాకా ఓపిక పట్టండి. ఆ తరువాత మనం తాత గదిలోకి వెళ్లవచ్చు" అని చెప్పి, కందర్పుణ్ని తన గదిలోకి తీసుకుపోయింది.

అన్ని పనులూ పూర్తిచేసి, తాళపుచెవులు దొంగతనంగా తీసుకువచ్చింది. కందర్పుని తీసుకుని, వింత వస్తువులున్న గదిలో ప్రవేశించింది.

"నేను, మా తాత కాకుండా ఈ గదిలోకి వచ్చిన మూడోవ్యక్తి మీరే" అన్నది సుభద్ర.

"నిజమా!" అంటూ ఆమె భుజాలమీద చేయివేసి, అక్కడున్న విశేషాలన్నీ ఒక్కటొక్కటిగా చూడసాగాడు కందర్పుడు. చివరగా అతడు అన్వేషిస్తున్న తోలుజింక కనిపించింది. దీపపు వెలుగులో పరిశీలించి చూడగా దానిపై ఒక శాసనం ఉంది. అందులో..

'ఈ తోలుజింక కుడిచెవిలోఉన్న బిరడా తీసి, నోటితో గాలి పూరించాలి. అప్పుడిది గుర్రంలా లేచి నిలబడుతుంది. మళ్లీ బిరడా బిగించి, దీనిని అధిరోహించాలి. కుడి, ఎడమలకు ప్రయాణించడానికి దీని చెవులే మీటలుగా పనిచేస్తాయి. నెత్తిమీద ఉన్న సీలను కుడికి, ఎడమకు తిప్పడం ద్వారా పైకి, కిందికి కూడా ప్రయాణించవచ్చు..' అని రాసి ఉంది.

జింకను తిరిగి అక్కడే పెట్టేసి, సుభద్రవైపు తిరిగాడు కందర్పుడు. ఆమె చిబుకాన్ని కుడిచేతి చూపుడువేలితో ఎత్తిపట్టుకుని, చూపులో చూపు నిలిపి..

"నీకు నామీద ఎంత అనురాగం లేకపోతే.. ఇంత విలువైన వస్తువులను నాకు చూపిస్తావు?! దీనికి ప్రతిఫలంగా నీకేం ఇవ్వగలను?! నా ప్రియపత్నిగా చేసుకుంటానని బాస చేస్తున్నాను. నన్ను అంగీకరిస్తావు కదూ!" అన్నాడు.

ఆమె సిగ్గుపడి కన్నులు వాల్చింది. అతడామె అధరాన్ని చుంబించాడు. మరో అడుగు ముందుకు పడకముందే ఇద్దరూ విడివడ్డారు.

"సుభద్రా! మా తల్లిదండ్రులను ఒప్పించి కానీ, నిన్ను చేపట్టలేను. ప్రస్తుతానికి మన ప్రేమచిహ్నంగా ఈ తోలుజింకను నాతో తీసుకుపోతున్నాను. మీ తాతకు అనుమానం రాకుండా ఉండేందుకు అచ్చంగా దీనిలాగే ఉండే మరోజింక తయారుచేయించి పంపిస్తాను" అని చెప్పాడు కందర్పుడు.

ఏదో మత్తు జల్లిన దానిలా ఏమీ మాట్లాడలేక పోయింది సుభద్ర. ఆమె చూస్తుండగానే జింకను పూరించి, గాలిలోకి ఎగిరి చీకట్లో కలిసిపోయాడు. ఎవరికీ తెలియకుండా, ఒక శిల్పిచేత ఆ జింకకు నకలు తయారుచేయించి, సుభద్రకు అందేలా చేశాడు. అనంతరం తన ఉపాధ్యాయునికి ఆ జింకను చూపించి..

"ఆర్యా! మీ అనుగ్రహం వల్ల నేను తలపెట్టిన కార్యం సఫలమైంది. హిమాలయాలకు ఆవల ఉన్న దేశాలను చూసి రావాలని అనుకుంటున్నాను. ఒక్కమాసంలోగా తిరిగివస్తాను. నేను వెళ్లిన తరువాత మా తల్లి దండ్రులు బెంగపెట్టుకోకుండా మీరే చూసుకోవాలి" అని కోరాడు.

మరునాడే చీకటిపొద్దున కొన్ని ఆహార పదార్థాలను మూటగట్టుకుని తోలుజింకను పూరించాడు.

దానిని అధిరోహించి.. 'జయ పరమేశ్వరా!' అంటూ మర తిప్పాడు. వెంటనే జింక ఆకాశంలోకి ఎగిరింది. కందర్పుడు ఉత్తరాభిముఖంగా ప్రయాణించసాగాడు. గరుత్మంతుని కంటే వేగంగా జింక ఎగురుతున్నది. చిన్న కుదుపుకానీ, ప్రయాణపు బడలిక గానీ లేవు. మధ్యాహ్న వేళకు హిమాలయాలకు చేరి, అక్కడ కొంతసేపు విశ్రమించాడు. మళ్లీ జింకనెక్కి మరింత ఉత్తరానికి పోయాడు. హిమాలయాలకు ఆవలివైపు అనేక పర్వతాలు, అడవులు దాటాడు.

మరొక్క జాములో సాయంత్రం కానుందనగా, అశేష జనవాహినితో నిండిన మహాపట్టణాన్ని గగనతలం నుంచి చూశాడు. ఊరి బయటనే కిందికి దిగి, తోలుజింక ఎడమచెవి బిరడా తీయగానే.. గాలిపోయి, కుంచించుకుపోయింది. దానిని చుట్టచుట్టి చంకలో పెట్టుకుని పట్టణంలో ప్రవేశించాడు. పది అడుగులు నడిచాడో లేదో రక్షకభటులు అడ్డం వచ్చారు.

"ఎవరు నువ్వు? ఏ దేశం వాడివి? సుంకం చెల్లించకుండా పట్టణంలోకి రావడానికి వీల్లేదు" అన్నారు.

కందర్పునికి వాళ్ల భాష అర్థం కాలేదు. అతడేదో చెప్పబోయాడు. అంతలోనే.. "వీడు తోలు కూడా తీసుకు వస్తున్నాడు. దీనికి వేరుగా సుంకం కట్టాలి. పదవయ్యా! కొత్వాల్ వద్దకు" అంటూ తోలుజింకను లాక్కుని, మెడమీద చెయ్యివేసి ముందుకు తోశారు.



## ఇకమతులోడి దగ్గర పైసలు కొట్టేయబోయి ఈపు సాపు చేసుకున్న దొంగోడు



ఎ ఒక ఊర్లె ఒక ఇకమతులోడు ఉంటుండె. బమ్మిని తిమ్మిజేసుట్ల.. తిమ్మిని బమ్మిజేసుట్ల ఆనసోంటోడు ఆ సుట్టుపక్కల నూరు మైళ్ల దాంక బాణమేశినా కనిపియ్యడు. ఆల్లింట్ల దేవుని పండుగుందని అత్తగారిని, సుట్టాలను అందరిని విలిశి.. పండుక్కు మ్యాకపిల్లను కొనుక్కద్దమని పక్కూరు సంతకు వోయిండు. ఆడ ఏమి దెల్వనోని లెక్క ఎడ్డెడ్డిగ మాట్లాడుకుంట.. మంచి మ్యాకపిల్లను అగ్వసగ్వకు గొన్నడు. ఈని ఎడ్డీర్కం జూసి.. పాపమని తక్వ ధరకే మ్యాకపిల్లను అమ్మిండు సావుకారి. ఈడు అంగట్లకు అచ్చినప్పటి సంది.. మర్లివోయెదాంక, ఈని కావలే గాశిండు ఓ దొంగోడు. అగ్వల మ్యాకపిల్ల దొర్కిందన్న మురిపెంల ఆడీడ దిరిగి ఆల్యం జేసిండు. ఇంటికి మర్లెవారకు పొద్దుగూక వట్టింది. అడివిలకెల్లి వోవాలె! దొంగలుగిట్ల ఉంటరని జెల్దిజెల్దిన నడువ వట్టిండు. నట్టనడిమిట్లకు వోంగనే, ఈని కోసమే సూత్తున్న దొంగోడు శెట్టు సాటుకెల్లి అచ్చి ఎదురంగ నిలుసున్నడు. నడుముకు బెల్టు, డబ్బాల్‌డబ్బాల లుంగీ, శేతుల గుత్పకట్టె.. ఆన్ని సూడంగనే ఇకమతులోనికి ఇషయం అర్తమయ్యింది. ఇకమతుతోని ఎట్లనన్న తప్పిచ్చుకోవాలని.. "ఏందన్న.. ఈ అడివిల ఏం జేత్తున్నవన్న?" అంట ఎడ్డిఎడ్డిగ అడిగిండు. దానికి ఆ దొంగోడు.. "కనిపిత్తలేదారా? నేను గజదొంగ గంగులును. నఖ్రాల్ జెయ్యకుంట నీకాడున్న పైసలు, మ్యాకపిల్ల, మెడలున్న కంటె, పెయ్యిమీదున్న బట్టలు అన్ని దీశి ఆడవెట్టి.. ఎన్కకు మర్లకుంటవో! లేదంటె గుత్పకట్టె జూశినవ్ గదా! ఇయ్యరమయ్యర జోపుత" అనుకుంట.. సుట్ట ముట్టిచ్చుకొని నిలుసున్నడు. దొంగోడు శేరైతే మనోడు సవశేరాయె.. ఆడు జెప్పినట్టే మ్యాకపిల్లను దించి శెట్టుకు గట్టేశిండు. కీసలకెల్లి ఆయిన్ని పైసలు దీశి కింద వోశిండు. పెయ్యిమీదున్న కంటె.. ఎండి కడెం దీశి ఆని కాళ్లకాడ వెట్టిండు. "అన్నా! సలి వెడ్తాంది.. ఇంట్ల అత్తగారోల్లున్నరు. పెయ్యిమీద బట్టల్లేకుంట వోతె పురాత ఇజ్జత్ వోతది. జర బట్టలుండనియ్యరాదు" అంట బతిమిలాడిండు. 'పుక్యానికె బంగారం, ఎండి, మ్యాక అచ్చినయి.. పాత బట్టలుంటేంది? లేకుంటేంది?' అనుకొని.. "గట్లనే తియ్యి" అని.. అన్ని సదురుకొని ముల్లె గట్టుకోవట్టిండు. అంతట్లకే మన ఇకమతులోడు.. "అన్నా! నువ్వు సూత్తె మంచోని లెక్క గొడుతున్నవ్. సంతకచ్చి ఏం దీస్కపోకుంటె ఎడ్డోడనుకుంటరు. నీ గుత్పకట్టె కొత్తగనె ఉంది గద. నాకియ్యరాదే" అంట ఎడ్డెడ్డిగ అడిగిండు. ఎడ్డోనితోని ఏమైతదని.. "ఇగవటు" అని గుత్పను ఇసిరేశిండు. కట్టె అందుకోంగనే.. మర్లేశి దొంగోన్ని ఇయ్యరమయ్యర జోపుడు వెట్టిండు. "అయ్యా.. అవ్వా.. సత్తిన్రో!" అనుకుంట.. అన్ని ఆన్నే వారేశి, చెంగోబిల్ల అనుకుంట ఉరికిండు తెలివితక్వ దొంగోడు. ఈని ముల్లెనే గాక దొంగోని ముల్లెగూడ సదుర్కోని ఇకమతులోడు అత్తగారోళ్ల ముంగట రుబాబుతోని ఇంటికి జేరిండు.

## ప్రతీ పూట.. అదే పాట!

ఎ అన్ని రుతువుల్లోనూ చలికాలమంటే ఇష్టం. వణికించే వాతావరణంలోనూ అలవాటు ప్రకారం ఉదయం ఆరు గంటలకే నిద్రలేచే వాళ్లం. పుష్య మాసపు చలిగాలి ఒంటికి తాకి, చెవులకు సోకి వెళ్తుంటే.. ఒక్కోసారి హాయిగా అనిపించినా, ఎక్కువసార్లు భయపెట్టేది. మార్గశిరంలో అమ్మ ధనుర్మాస వ్రతాన్ని పాటించేది. తెల్లవారుజామున మూడున్నరకే నిద్రలేచి వెళ్తూ, తను కప్పుకొన్న దుప్పటి తీసి నాకూ, ఇంకొకటి అక్కకూ కప్పేది. పరిచితమైన అమ్మ స్పర్శతో, మరింత వెచ్చగా, హాయిగా.. అమ్మకు దగ్గరగా జరిగి, తన పొట్టలో ముడుచుకుని పడుకున్న అనుభూతి కలిగేది. పదేళ్ల వయసులోనూ మాకు స్వెటర్స్ ఉన్న జ్ఞాపకం లేదు. తల పైనుంచి చెవుల మీదుగా నడుము కిందిదాకా వేలాడేట్టు మెడ దగ్గర ముడివేసి హరికంఠం కట్టేవారు. తెల్లవారుజామునే అన్ని పనులు పూర్తిచేసినా కూడా.. అమ్మలో అలసట కనిపించేది కాదు. నేను, అక్క బడికి వెళ్లేటప్పుడు ఆ నెల రోజులూ బియ్యం, పెసరపప్పు, బెల్లం, మిరియాలు, జీలకర్ర వేసి వండిన పొంగలి తినేవాళ్లం. లేవగానే పెరడంతా తిరుగుతూ.. 'హ! హ!' అనుకుంటూ నోళ్లు తెరిచి, చలికి నోట్లోంచి తెల్లని పొగలు వస్తుంటే ఆనందించేవాళ్లం. అంత చలిలోనూ మా బావినీళ్లు గోరువెచ్చగా ఉండటం ఆశ్చర్యం కలిగించేది. మండువేసవిలో మిట్ట మధ్యాహ్నం పూట బావిలో నీళ్లు చేదితే.. కొత్త కుండలో నీళ్లలా ఎంతో చల్లగా ఉండటం కూడా అబ్బురపరిచేది. చలికాలం సాయంత్రాలు ఇప్పటికీ నానమ్మ బాగా గుర్తుకొస్తుంది. కొంచెం చీకటి పడగానే ఆమె దక్షిణపు మనసాలలో ఉన్న కుంపటి రాజేసేది. అన్నట్టు, ఈ కుంపటి గురించి కొంత చెప్పాలి. అది బొగ్గుల కుంపటి కాదు. మట్టితోచేసిన పూలకుండీ లాంటిది. దానిలో పిడకలు ఉండేవి. ఇంట్లో ఎప్పటికీ నిప్పు ఆరకుండా ఉండటానికి అన్నమాట. రాత్రి నన్నూ, అక్కనూ ఆ కుంపటి ముందు కూర్చోబెట్టుకునేది నానమ్మ. తన చేతులను కుంపటికి కొంచెం పైన పెట్టి ఆ వెచ్చని చేతులతో మా చెంపలను కాపేది. నానమ్మ గొంతు శ్రావ్యంగా ఉండేది. పాటలు పాడుతూ రోజూ ఒకే కథ చెప్పేది. అయినా వినేవాళ్లం. ఓ దేశాన్నేలే రాజుకు ఏడుగురు కూతుర్లు. ఓ రోజు రాణిగారి పూజ కోసం ఏడుగురూ పొన్న పూలు కోసుకుని రావడానికి వెళ్తారు. మిగిలినవాళ్లంతా కలిసి అందరిలోకి ఆఖరి పిల్లను కావాలనే చెట్టు మీద వదిలేస్తారు. అంతలో పులి వచ్చి ఆ పిల్లకేసి గాండ్రించి చూస్తూ ఉంటుంది. పిల్ల ఏడుస్తూ.. 'దింపనైనా దింపు.. మింగనైనా మింగు' అంటుంది. ఆ పులికి రెండోదే నచ్చి అదే చేస్తుంది. ఆ మింగడంలో పిల్ల చిటికెన వేలు కిందపడిపోయి, కొన్నాళ్లకు ఓ జంగమయ్యకు దొరుకుతుంది. దాన్ని శొంఠి కొమ్ము అనుకుని ఇంటికి తీసుకెళ్లి భార్యకు ఇస్తే.. ఆమె దాన్ని సర్కటాల కుండలో వేసి మూతపెడుతుంది. ఓ రోజు తలనొప్పికి శొంఠి కొమ్ము అరగదీసి రాయమంటూ భార్యను అడగగా.. ఆమె వెళ్లి చూస్తే, అందులో ఒక అందమైన అమ్మాయి కనిపిస్తుంది. వాళ్లు ఆ పిల్లను పెంచుకుంటారు. జంగమయ్య తన వీపుపై ఆ పిల్లను కట్టుకుని, జోలెలో అడుక్కు తింటూంటే.. ఆ పిల్లే పాటలు పాడుతుంది. రెడీమేడ్ సింగర్ దొరికిందని అతను సంతోషంగా మరింతగా అడుక్కు తింటాడు. ఓ రోజు రాజమందిరం ముందు నుంచి వెళ్తూ ఉండగా.. ఆ పిల్ల గుర్తుపట్టి, సిన్మా క్లయిమాక్స్ సీన్లో హీరోయిన్‌లా పెద్ద గొంతుతో 'రావా! మొరవినవా!' అంటూ దేవుణ్ని నిలదీస్తూ పాడేసరికి, రాణీగారు గుర్తుపట్టి కోట గుమ్మం దాకా పరుగెత్తి, తన కూతుర్ని తాను తెచ్చుకుంటుంది.

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము



శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ 01 2సార్లు
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాన్తయే
యస్య ద్విరద వక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్ 02
విఘ్నం నిఘ్నన్తి సతతం విష్వక్సేనం తమాశ్రయే
వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ 03
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్
వ్యాసాయా విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే 04
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః
అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే 05
సదైకరూప రూపాయ విష్ణవే సర్వజిష్ణవే
యస్య స్మరణమాత్రేణ జన్మసం సార బన్ధనాత్ 06
విముచ్యతే న మ స్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే
ఓం నమో విష్ణవే ప్రభవిష్ణవే
శ్రీవైశంపాయన ఉవాచ
శ్రుత్వా ధర్మా నశేషేణ పావనాని చ సర్వశః 07
యుధిష్ఠిర శ్శాంతనవం పునరే వాభ్యభాషత

**యుధిష్ఠిర ఉవాచ**

కి మేకందైవతం లోకే కింవా ప్యేకం పరాయణమ్ 08
స్తువంతః కం క మర్చంతః ప్రాప్నుయుః మానవా శ్శుభమ్
కో ధర్మ స్సర్వధర్మాణాం భవతః పరమో మతః 09
కిం జపన్ ముచ్యతే జన్తుః జన్మ సంసార బంధనాత్

**శ్రీ భీష్మ ఉవాచ**

జగత్ ప్రభుం దేవదేవం అనన్తం పురుషోత్తమమ్ 10
స్తువన్ నామసహస్రేణ పురుషః సతతోత్థితః
తమేవ చార్చయ న్నిత్యం భక్త్యా పురుష మవ్యయమ్ 11
ధ్యాయన్ స్తువన్ నమస్యంశ్చ యజమాన స్తమేవ చ
అనాది నిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరమ్ 12
లోకాధ్యక్షం స్తువ న్నిత్యం సర్వదుఃఖాతిగో భవేత్
బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తి వర్ధనమ్ 13
లోకనాథం మహద్భూతం సర్వభూత భవోద్భవమ్
ఏష మే సర్వధర్మాణాం ధర్మో ధికతమో మతః 14
యద్భక్త్యా పుణ్డరీకాక్షం స్తవై రర్చే న్నర సదా
పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః 15
పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణమ్
పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళమ్ 16
దైవతం దేవతానాం చ భూతానాం యో వ్యయః పితా
యత స్సర్వాణి భూతాని భవంత్యాది యుగాగమే 17
యస్మింశ్చ ప్రళయం యాంతి పునరేవ యుగక్షయే
తస్య లోక ప్రధానస్య జగన్నాథస్య భూపతే 18
విష్ణో ర్నామసహస్రం మే శృణు పాపభయాపహమ్
యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః 19
ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూత యే
విష్ణో ర్నామసహస్రస్య వేదవ్యాసో మహా నృషిః 20
ఛన్దో నుష్టుప్ తథా దేవో భగవాన్ దేవకీసుతః
అమృతాం శూద్భవో బీజం శక్తి ర్దేవకి నందనః 21
త్రిసామా హృదయం తస్య శాంత్యర్థే వినియుజ్యతే
విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వర మ్ 22
అనేకరూప దైత్యాంతం నమామి పురుషోత్తమమ్
అస్య శ్రీవిష్ణోః దివ్య సహస్రనామ స్తోత్ర మహామంత్రస్య, శ్రీ వేదవ్యాసో భగవాన్ ఋషిః, అనుష్టుప్ ఛన్ధః, శ్రీ మహావిష్ణుః పరమాత్మా శ్రీమన్నారయణో దేవతా, అమృతాంశూద్భవో భానురితి బీజం, దేవకీ నందన స్స్రష్టేటి శక్తిః, ఉద్భవః క్షోభణో దేవ ఇతి పరమో మంత్రః, శంఖభృన్నన్దకీ చక్రీతి కీలకం, శార్ఙ్గధన్వా గదాధర ఇత్యస్త్రం, రథాంగపాణి ర క్షోభ్య ఇతి నేత్రం, త్రిసామా సామగా స్సామేతి కవచం, ఆనందం పరబ్రహ్మేతి యోనిః, ఋతుస్సుదర్శనః కాల ఇతి దిగ్బంధః, శ్రీ విశ్వ రూప ఇతి ధ్యానమ్, శ్రీ మహావిష్ణు ప్రీత్యర్థే
( కైంకర్యరూపే శ్రీ )సహస్రనామ జపే వినియోగః 23

**ధ్యానమ్**

క్షీరోదన్వత్ ప్రదేశే శుచిమణి విలసత్ సైకతే మౌక్తికానాం
మాలా క్లుప్తాసనస్థః స్ఫటికమణి నిభైః మౌక్తికైః మణ్డితా
శుభ్రై రభ్రై రదభ్రై రుపరి విరచితై ర్ముక్తపీయూషవర్షైః :
ఆనందీ నః పునీయాత్, అరినళిన గదా శంఖపాణి ర్ముకుందః 24
భూః పాదౌ యస్యనాభిః వియదసు రనిలః చంద్రసూర్యౌచ నేత్రే
కర్ణావాశా శ్శిరోద్యౌః ముఖమపి దహనో యస్య వాస్తేయ మబ్ధిః
అంతస్థం యస్య విశ్వం సురనర ఖగగో భోగి గంధర్వ దైత్యైః
చిత్రం రంరమ్యతే, తం త్రిభువనవపుషం విష్ణుం మీశం నమామి 25

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాకారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగమ్
లక్ష్మీకాన్తం కమలనయనం యోగిహృ ద్ధ్యానగమ్యం
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైక నాథమ్ 26
మేఘశ్యామం పీతకౌశేయవాసం శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగమ్
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం విష్ణుం వన్దే సర్వలోకైక నాథమ్
నమస్సమస్త భూతానాం ఆది భూతాయ భూభృతే
అనేకారూపరూపాయ విష్ణవే ప్రభ విష్ణవే 27
సశంఖచక్రం సకిరీటకుం డలం సపీతవస్త్రం సరసీరు హేక్షణమ్
సహారవక్షస్థ్సలశోభి కౌస్తుభం నమామి విష్ణుం శిరసా చతుర్భుజమ్ 28

# గురు దేవోభవ

తల్లిదండ్రులు జన్మను మాత్రమే ఇస్తారు. కానీ, మనిషిలోని మూఢత్వాన్ని తొలగించి, మానవ జన్మను సార్థకం చేసుకునే జ్ఞానాన్ని ఇచ్చేది గురువు మాత్రమే. ప్రతిఫలాపేక్ష లేని ప్రేమతో శిష్యుడికి గురువు విద్యను బోధిస్తాడు. తన సర్వస్వం గురువుకే అంకితం చేస్తానంటాడు శిష్యుడు. ఇదీ గురుశిష్యుల సంబంధం. ఏ రకమైన పేగుబంధం లేని పరమాత్మ సంబంధం అది.

తల్లిదండ్రులు జన్మను మాత్రమే ఇస్తారు. కానీ, మనిషిలోని మూఢత్వాన్ని తొలగించి, మానవ జన్మను సార్థకం చేసుకునే జ్ఞానాన్ని ఇచ్చేది గురువు మాత్రమే. ప్రతిఫలాపేక్ష లేని ప్రేమతో శిష్యుడికి గురువు విద్యను బోధిస్తాడు. తన సర్వస్వం గురువుకే అంకితం చేస్తానంటాడు శిష్యుడు. ఇదీ గురుశిష్యుల సంబంధం. ఏ రకమైన పేగుబంధం లేని పరమాత్మ సంబంధం అది.వేదవ్యాస మహర్షి పంచమ వేదంగా లోకానికి అందించిన మహాభారతంలో గురు వైభవాన్ని ప్రకటించే ఇతివృత్తాలు ఎన్నో కనిపిస్తాయి. జగద్గురువైన శ్రీకృష్ణుడే స్వయంగా సాందీపుని దగ్గర శిష్యునిగా విద్యాభ్యాసం చేయడం, కురు కుమారులు ద్రోణాచార్యుడి శిష్యరికంలో సాటిలేని యోధులుగా తయారవ్వడం, కేవలం గురుభక్తితో ఏకలవ్యుడు సాటిలేని మేటి విలుకాడుగా ప్రసిద్ధిపొందడం%ొా% ఇవన్నీ ప్రాచుర్యం పొందిన కథలు. గురువైభవాన్ని ప్రకటించే మరో వృత్తాంతం మహాభారతం అరణ్యపర్వంలో ఉంది.

**యవక్రీతుడి వృత్తాంతం**

భరద్వాజుడు, రైభ్యుడు ఇద్దరూ సహాధ్యాయులు. ఒకే గురువు వద్ద విద్యాభ్యాసం చేసి, సకల విద్యల్లోను పాండిత్యం సంపాదించారు. తపస్సుతో ఇద్దరూ మహర్షిత్వాన్ని సాధించారు. రైభ్యుడి కుమారులు కూడా తండ్రి చూపిన మార్గంలో సద్గురువును ఆశ్రయించి, వేదవేదాంగాలు అభ్యసించి, ఉత్తమ గుణాలతో శోభిల్లుతూ, అందరి ప్రశంసలు అందుకున్నారు. భరద్వాజుని కుమారుడు యవక్రీతుడు. ఉపనయనం జరిగిన క్షణం నుంచి, యవక్రీతుడు కేవలం తపస్సు ద్వారా సకల విద్యల్లో పాండిత్యం సంపాదించాలని భావిస్తుంటాడు. గురు శుశ్రూష ద్వారా విద్యాభ్యాసం చేయాలంటే ఎంతో సమయం పడుతుంది కాబట్టి, తపస్సు ద్వారా తేలికగా జ్ఞానం పొందవచ్చని అతని ఆలోచన. రైభ్యుడి కుమారులకు సమాజంలో దక్కుతున్న ఆదరణ ఇతనిలో మరింత మాత్సర్యాన్ని కలిగిస్తుంది. దీంతో యవక్రీతుడు ఇంద్రుడి గురించి, ఘోర తపస్సు చేశాడు.

'గురూపదేశం లేని విద్య మాత్సర్యాన్ని, అహంకారాన్ని పెంచుతుందని, ఈ ప్రయత్నం విడిచిపెట్టమని' వృద్ధ బ్రాహ్మణుడి రూపంలో ఇంద్రుడు యవక్రీతుడికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తాడు. అయినా, అతను పట్టు విడిచిపెట్టడు. దీంతో, చేసేదిలేక ఇంద్రుడు యవక్రీతుడికి వేదాలను భాసింపజేస్తాడు. అహంకారం తగదంటూ భరద్వాజుడు యవక్రీతుడికి ఎన్నో జాగ్రత్తలు చెబుతాడు. కానీ, వర గర్వంతో విర్రవీగుతున్న యవక్రీతుడు రైభ్యుని ఆశ్రమంలోకి ప్రవేశించి, మహర్షి కోడలిని చెరబట్టే ప్రయత్నం చేస్తాడు. దీంతో కోపించిన రైభ్యుడు యవక్రీతుడిని వధిస్తాడు. కొంతకాలం తర్వాత రైభ్యుని రెండో కుమారుడు దయతలచి, తన తపశ్శక్తితో యవక్రీతుడిని పునర్జీవితుణ్ని చేస్తాడు.

తన విద్యలు ఎందుకు నిష్ప్రయోజనం అయ్యాయని యవక్రీతుడు దేవతల్ని ప్రశ్నిస్తాడు. 'గురుముఖంగా నేర్చుకోకపోవటం వల్లే నీ విద్యలు ఫలించలేద'ని దేవతలు స్పష్టం చేస్తారు. ఇదీ గురువైభవం. ఈ భావాన్నే ప్రకటిస్తూ శ్రీనాథ మహాకవి 'గురువు నేర్పని విద్య గుడ్డివిద్య' అన్నాడు. మహాకవి కాళిదాసు 'శుశ్రూష స్వగురూన్' అంటూ 'గురు శుశ్రూష ద్వారానే విద్యలు నేర్చుకోవాల'ని చెప్పాడు.

**దీపకుడి గురుభక్తి**

కేవలం నిశ్చలమైన గురుభక్తితో శ్రీమన్నారాయణుని సాక్షాత్కారం పొందిన శిష్యలోక చక్రవర్తి దీపకుడు. వేదధర్ముడనే గురువు దగ్గర దీపకుడు విద్యాభ్యాసం చేస్తుంటాడు. వినయంతో, సకల శుభ లక్షణాలతో గురువుకు అత్యంత ప్రీతిపాత్రుడవుతాడు. ఒకరోజు వేదధర్ముడు దీపకుడిని పిలిచి 'దీపకా! పూర్వజన్మలో నేను చేసిన రెండు పాపాలను పోగొట్టుకోవడానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సి ఉంది. ఇందుకు కాశీ క్షేత్రానికి వెళ్లాలి. ఆ పాపాలను ఆవహింపజేసుకున్నప్పుడు నా స్వభావం పూర్తిగా మారిపోతుంది. అత్యంత కఠినుడిగా



మారిపోతాను. కుష్ఠు రోగం వస్తుంది. జుగుప్స కలిగించే రూపంతోపాటు అంధత్వం కూడా వస్తుంది' అంటాడు.

దీపకుడు 'మహానుభావా! ఆ సమయంలో తమకు సేవ చేసుకునే భాగ్యం నాకు అనుగ్రహించండి' అని గురువును వేడుకుంటాడు. ఇద్దరూ కలిసి కాశీ క్షేత్రానికి చేరుకుంటారు. వేదధర్ముడు పాపాలను ఆవహింపజేసుకుంటాడు.

అతిభయంకరమైన రూపం, కఠిన స్వభావం అతనికి సంప్రాప్తిస్తాయి. అన్నిటినీ తట్టుకుంటూ గురుసేవ చేస్తుంటాడు దీపకుడు. ఆ శిష్యుడు చేస్తున్న అనితర సాధ్యమైన గురుసేవకు మహదానందం పొందిన కాశీ విశ్వనాథుడు దీపకుడికి ప్రత్యక్షమై వరం కోరుకోమని అడుగుతాడు. ఆ సమయంలో నిద్రిస్తున్న గురువుకు పాదసేవ చేస్తుంటాడు దీపకుడు. 'తనకేమీ తెలియదని, గురువుగారు నిద్ర నుంచి మేల్కొనగానే, వారిని అడిగి చెబుతాన'ని విశ్వనాథుడికి బదులిస్తాడు.

వేదధర్ముడు నిద్ర నుంచి మేల్కొనగానే జరిగిందంతా వివరిస్తాడు దీపకుడు. 'మీ పాపాలు పోగొట్టమని విశ్వనాథుడిని అడుగుతానని, అందుకు అనుమతించమ'ని అభ్యర్థిస్తాడు. ఇందుకు వేదధర్ముడు ఒప్పుకోడు. ఎవరి పాపాలు వారే అనుభవించాలని, అప్పుడే పూర్తిగా కర్మఫలితం నశిస్తుందంటాడు. మర్నాడు దీపకుడు శివుడి సన్నిధికి వెళ్తాడు. కానీ, ఏ వరం కోరుకోడు. నిశ్చలంగా దైవాన్ని చూస్తూ నిల్చుంటాడు. దీపకుడి ఉన్నతమైన సాధనను మెచ్చుకున్న విశ్వనాథుడు, శ్రీమన్నారాయణుడి దగ్గరికి వెళ్లి, దీపకుని వృత్తాంతం చెబుతాడు. హరిహరులిద్దరూ దీపకుడికి ప్రత్యక్షమవుతారు.

'నారాయణా! మిమ్మల్ని నేనెప్పుడూ దర్శించలేదు. కనీసం స్మరించలేదు కూడా. నాకు ఎందుకు ప్రత్యక్షమయ్యార'ని దీపకుడు విష్ణుమూర్తిని ప్రశ్నిస్తాడు. అందుకు నారాయణుడు 'దీపకా! నీవు అచంచలమైన భక్తితో గురుసేవ చేస్తున్నావు. గురువు త్రిమూర్తి స్వరూపుడు. కాబట్టి, నన్ను అర్చించినట్టే. ఏం వరం కావాలో కోరుకో' అని స్వామి దీపకుడిని అడుగుతాడు. 'స్వామీ! ఎన్నటికీ తరగని అచంచలమైన గురుభక్తి నాకు ప్రసాదించమ'ని దీపకుడు నారాయణుడిని వేడుకుంటాడు. అతని గురుభక్తికి మెచ్చిన నారాయణుడు అనేక వరాలు అనుగ్రహిస్తాడు. నిశ్చలమైన గురుభక్తితో తనతోపాటు తన గురువును కూడా తరింపజేసిన ఘనతను దీపకుడు సాధించాడు. గురువైభవానికి అసలైన నిదర్శనం ఇది.

# నేను రామానుజదాసుడను!



ఒకానొక సందర్భంలో నేను 'రామానుజ దాసుడను' అని తనకు తాను రామానుజా చార్యులకు దాసుడని పేర్కొన్నారు శ్రీరంగనాథస్వామివారు. ఎందుకంటే రామా నుజులవారి భక్తికి ఎంతో పరవశులయ్యేవారు స్వామి. మహోన్నత భక్తులు%ొా% సమ తామూర్తి%ొా% మానవతావాది శ్రీ రామానుజాచార్యులు అంటే శ్రీరంగనాథస్వామికి అంత ఇష్టం%ొా%. అభిమానం. అందుకే రామానుజాచార్యుల నిర్యాణం అనంతరం ఆయన పార్థివ దేహాన్ని కూడా తన ఆలయంలోనే వుంచుకున్నారు రంగనాథస్వామి. రామానుజాచార్య నికి రంగనాథస్వామి దాసుడిని అని పేర్కొన్న కథ ఒకటి శ్రీరంగంలో ప్రచారంలో వుంది. కొన్ని శతాబ్దాల క్రితం కూడా శ్రీరంగంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో స్వా మివారి ప్రసాదానికి భక్తులు బారులు తీరి వుండేవారు. ప్రతీ రోజు ప్రసాదం కొరకు ఎదురు చూస్తూ బారులు తీరిన భక్తులలో ఒక పేద వైష్ణవుడు వుండేవాడు. ఆయన రోజూ వరుసలో అందరికంటే ముందు నిలబడేవాడు. ఆయన తన కోసమేకాక, తన ఆరుగురు కొడుకుల కొరకు కూడా ప్రసాదం తీసుకెళ్ళేవాడు. ఆలయ అధికారులు అంతమందికి ప్రసాదాన్ని ఒకే వ్యక్తికి ఇవ్వడం సరికాదని అనేవారు. ఆయన మాత్రం ప్రసాదం ఇవ్వమని పట్టుపట్టేవాడు. ఇలా రోజూ ఆలయ అధికారులకి అతనికి కొంత వాదులాట జరిగేది.

"ప్రసాదం అంతా నీకే ఇచ్చేస్తే నీ వెనుక వున్న మిగిలిన భక్తులందరికి కొంచెమే ప్రసాదం లభిస్తుంది" అని ఆలయ అధికారులు ఆ వైష్ణవుడిని మందలించేవారు. అయినా కూడా ఆ పేద వైష్ణవుడు "నా ఆరుగురు కొడుకులు ఆహారం లేక బక్క చిక్కిపోయారు, వారు ఆకలితో అలమటిస్తూ వుంటారు. నేను తీసుకువెళ్ళే ప్రసాదానికై ఎదురుచూస్తూ వుంటారు. కనుక మీరు ఆలయ ప్రసాదం ఇవ్వకపోతే వారు నాకు దక్కరు" అని ఆయన ప్రాధేయపడేవాడు. ఒకరోజు రామానుజుల వారు వైష్ణవుడు ఆలయ అధికారులకు మధ్య జరుగుతున్న వాదోపవాదాలను చూసి అక్కడకు వచ్చారు. "ఏమి జరిగింద"ని అడిగారు. ఆలయ అధికారులు ఆ పేద వైష్ణవుణ్ణి చూపించి రోజూ అధిక ప్రసాదం కావాలని ఆయ న గొడవ చేస్తున్నాడని తెలియచేస్తారు. రామానుజులు ఆ వైష్ణవుడి దగ్గరకు వెళ్ళి "నాయనా నీవు ఆలయములో కొన్ని కైంకర్యములు చేసి ఎక్కువ ప్రసాదాన్ని పొందవచ్చు కదా" అని అడుగుతారు. దానికి ఆ వైష్ణవుడు–

"స్వామీ! నా బక్క చిక్కిన కొడుకులని మీరే చూడండి, రోజంతా వారికి సేవలు చేయడ ములోనే నాకు సమయం సరిపోతుంది, వీరిని వదిలేసి నేను ఆలయంలో ఏ కైంకర్యం చేయ లేను. పైగా నేను వేదాలను గాని, దివ్య ప్రబంధములను గాని నేర్చుకోలేదు, అందువల్ల నేను ఆలయ సేవ కాలములలో కూడా ఏ కైంకర్యం చేయలేను, నాకు కొన్ని విష్ణు సహస్ర నామం లోని శ్లోకాలు తప్ప ఏమి రావు, నేనేమి చేయగలను." అని బదులిచ్చాడు ఆ పేద వైష్ణవుడు.

"సరే నీకు తెలిసిన విష్ణు సహస్రనామ శ్లోకాలని చెప్పు" అన్నారు రామానుజులవారు.

ఆ వైష్ణవుడు ఎంతో ఇబ్బందిగా "విశ్వం విష్ణు వషట్కారో భూత భవ్య భవత్ ప్రభు:, భూత కృత్ భూత భృత్.." అని ఆపేసి, "నాకు అంతవరకే వచ్చు స్వామీ!" అని చెప్పాడు.

అతని ఇబ్బంది చూసి రామానుజులవారు "సరే నీకు 'భూత భృత్' అనే భగవన్నామ ము తెలుసుకదా! ఆ నామాన్నే జపించు, ఇక నీకు ఇక్కడికి ఆహారార్థియై రావలసిన అవసరం ఉండదు" అని సెలవిచ్చారు.

ఆనాటి నుండి ఆ వైష్ణవుడు ఇంకెప్పుడూ కోవెల ప్రసాద వితరణ ప్రాంతంలో కనిపిం చలేదు. ప్రసాదపు వరుసలలో గొడవలు ఆగిపోయాయి. అయితే ఇంకో విచిత్రమైన సమస్య మొదలయింది. రోజూ రంగనాథులకు సమర్పిస్తున్న ప్రసాదంలో చాలా భాగం మాయమై పోతుంది. పంచడానికి కొంచెమే వుంటోంది. ఆలయంలో ప్రసాదం దొంగల బారిన పడు తుందేమో అని భద్రత పెంచారు కూడా. అయినా రంగనాథులకు సమర్పించిన దానిలో చాలా ప్రసాదం మాయమైపోతున్నది. ఆ పేద బ్రాహ్మణుడే దొంగిలిస్తున్నాడేమో అని అనుమానం వస్తున్నది అందరికి. చివరకు రామానుజులకి ఈ సమస్య గురించి తెలియచేసా రు. ఆ పేద బ్రాహ్మణుణ్ణి పిలుచుకు రమ్మని రామానుజుల వారు మనుషులని పంపారు. వారు తిరిగి వచ్చి ఆయన ఆలయానికి దగ్గరగా వున్న తన పాత నివాసంలో ఉండటంలేదని తెలిపారు. ఆ తరువాత కూడా ఆ వైష్ణవుడు ఎక్కడ ఉంటున్నాడో ఎవరికీ సమాచారం తెలియలేదు.

కొంత కాలం తర్వాత, రామానుజులు ఏదో కార్యక్రమానికై కొల్లిడం నది (శ్రీరంగం దగ్గర కావేరి పాయ) దాటుతుండగా ఈ వైష్ణవుడు "స్వామీ%ొా% స్వామీ" అని రామానుజులని బిగ్గరగా పిలుస్తూ వారిని సమీపించాడు. రామానుజుల పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆయన కనుల నుండి ధారగా కన్నీరు రాసాగింది.

"స్వామీ! మీ కటాక్షం వలన ఆ పిల్లవాడు రోజూ నాకు ప్రసాదం అందచేస్తున్నాడు. అం దువల్ల నా పిల్లలు సరిపడినంత పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతులయ్యారు. ఇక ఆల య అధికారులతో గొడవలు ఎందుకని కోవెల దగ్గర గృహం నుండి నేను ఇక్కడికి వచ్చేసా ను. నేను మీకు సదా కృతజ్ఞుడను. మీరు చెప్పిన విధంగా రోజూ నేను "భూతభృతే నమ:" జపాన్ని చేస్తున్నాను." అన్నాడు.

అతని మాటలు విన్న రామానుజులు ఆశ్చర్యచకితులయ్యారు. "ఎవరా పిల్లవాడు? వాని పేరేమిటి?" అని అడిగారు.

"ఆ పిల్లవాడు తాను రామానుజాదాసుడనని చెప్పాడు స్వామీ" అన్నాడు వైష్ణవుడు. రామానుజాచార్యులవారికి అంతా అర్థమయింది. 'భూత భృత్' నామానికి అర్థం 'సమస్త జీవుల'ని పోషించువాడు అని అర్థంకదా! రామానుజుల వారి ఆజ్ఞానుసారం 'భూత భృత్'ను పఠించిన వైష్ణవుడి ఆకలి బాధలను తీర్చారు ఆ రంగనాథస్వామి.

ఇంతకీ ఆ బాలుడు ఇంకెవ్వరు సాక్షాత్ శ్రీరంగనాథుడే అని తెలుసుకున్నారు శ్రీరామా నుజాచార్యులు. బాలుడి రూపంలో రంగనాథుడి దర్శనం రోజూ పొందుతున్న ఆ వైష్ణవు డి అదృష్టానికి పరవశులయ్యారు రామానుజులవారు.

# పాదోదకం పావనం శుభం



సనాతన సంస్కృతిలో తీర్థానికి విశిష్టమైన స్థానం ఉంది. ఆధ్యాత్మిక మార్గంలో, ప్రత్యేకించి భక్తి ప్రపంచంలోను, ముఖ్యంగా భక్తుల హృదయాలలోను తీర్థానికి విశేషమైన ప్రాముఖ్యత ఉంది. అయితే అన్ని ప్రసాదాలు అన్నిటిలోను అతి విశిష్టమైనది తీర్థ ప్రసాదం అని చెబుతా రు. ఇంట్లో పూజ, అభిషేకం, ఆరాధన, వ్రతంలాంటి దైవ సంబంధిత కార్యాలు చేసుకున్న తర్వాత తీర్థాన్ని తీసుకుంటాం. అదేవిధంగా దేవాలయాలలో దైవాన్ని దర్శించుకున్న తర్వాత అర్చక స్వాములు యిచ్చే తీర్థాన్ని తీసుకుంటాం. దేవాలయాలలోను, అదే రకంగా ఇళ్ళలోను అర్చన తర్వాత తీసుకునే పవిత్ర జలాన్ని లేక పాలను తీర్థ ప్రసాదం అని అంటా రు. తలపైన శఠగోపం పెట్టించుకున్న తర్వాత, దేవుణ్ణి అభిషేకించిన పాలో, ఉదకమో, పెరు గో, పంచామృతాలో, కళ్ళకు అద్దుకుని తీర్థ ప్రసాదంగా భక్తి ప్రపత్తులతో తీసుకుంటారు."అకాల మృత్యు హరణం సర్వవ్యాధి నివారణం సమస్త పాప క్షయకరం శ్రీ పరమేశ్వ ర పాదోదకం పావనం శుభం." అనే మంత్రాన్ని అర్చక స్వామి జపిస్తూ, తీర్థాన్ని భక్తులకు ఇస్తాడు. అయితే "శ్రీ పరమేశ్వర పాదోదకం పావనం శుభం" అనే మంత్రంలో, పరమేశ్వర దగ్గర, ఏ దేవునికి మనం పూజ/ అర్చన/ అభిషేకం చేసామో, ఆ దేవుని పేరును చదవాలనే విషయం ఇక్కడ గమనించాలి."అకాల మృత్యు హరణం సర్వ వ్యాధి నివారణం సమస్త పాప క్షయకరం" అనే మం త్రోచ్చారణ వలన అనంతమైన, అమోఘమైన, పవిత్రమైన మంత్రశక్తి తీర్థానికి ఆపాదింప బడి, ఆ మంత్ర బలం తీర్థానికి సంపూర్ణంగా వస్తుంది.తీర్థం అంటే తరింప చేసేది అని శాస్త్రం చెబుతున్న అర్థం. తీర్థాన్ని మూడుసార్లు తీసుకో వడం ప్రశస్తం అని పెద్దలు చెబుతారు. మొదటిసారి తీర్థం తీసుకోవడం వలన శారీరక, మా నసిక శుద్ధి జరుగుతుంది. రెండవసారి తీసుకోవడం వలన న్యాయ, ధర్మ పరివర్తన జరుగు తుంది. మూడోసారి తీసుకునేటప్పుడు పరమేశ్వర పధం అనుకుంటూ తీర్థాన్ని తీసుకోవా లని పెద్దలు చెబుతారు. అదేవిధంగా "కేశవాయ స్వాహా" అనుకుంటూ మొదటిసారి, "నారాయణ స్వాహా" అంటూ రెండోసారి, "మాధవాయ స్వాహా" అనుకుంటూ మూడోసారి తీర్థాన్ని తీసుకోవా లి. ఈవిధంగా తీర్థప్రసాదాన్ని మూడుసార్లు తీసుకోవడం వలన జ్ఞానేంద్రియాలను, కర్మేం ద్రియాలను (అంటే శరీరాన్ని), ముఖ్యమైన మనసునూ సిద్ధం చేయడం, శుద్ధం చేయడము అవుతుందనేది అంతర్లీనంగా దాగున్న అంతరార్థ ఆధ్యాత్మిక రహస్యం అని చెబుతారు. తీర్థం తీసుకున్నాక కుడిచేతిని కొందరు తలకు తుడుచుకుంటారు. అలా చేయకూడదని శా స్త్రం చెబుతోంది. ఎందుకంటే తలపైన బ్రహ్మదేవుడు ఉంటాడు కాబట్టి మన ఎంగిలిని బ్రహ్మకు అర్పణ చేసినట్లు అవుతుందని.వివిధ రకాల తీర్థాలు: జలతీర్థ ప్రసాదం, కషాయతీర్థ ప్రసాదం, పంచామృత తీర్థ ప్రసా దం, పానకతీర్థ ప్రసాదం అని తీర్థ ప్రసాదాలు నాలుగు రకాలు. ఇవే కాకుండా తులసి తీర్థం, పచ్చకర్పూర తీర్థం, బిల్వ తీర్థం యిలా రకరకాల తీర్థాలు కూడా ఉన్నాయి.

**తీర్థం ఇలా తీసుకోవాలి**

ఎడమ అరచేతిలో కుడి అరచేతిని పెట్టి, కుడిచేతి చూపుడు వేలు మధ్యలోకి బొటన వేలుని మడిచి ( అంటే%.గోముఖ ముద్రలో ) తీర్థాన్ని భక్తుడు తీసుకోవాలి.మరికొంత విపులంగా చెప్పాలంటే, తీర్థాన్ని మగవారైతే తన భుజంపై ఉండే ఉత్తరీ యం లేదా కండువాను, ఆడవారైతే తమ చీర లేదా చున్నీ పైకొంగును ఎడమ చేతిలో నాలు గు మడతలు వచ్చే విధంగా వేసుకోవాలి. వేసుకున్నాక ఎడమ చేతిలో ఉన్న మడతపై కుడిచే తిని ఉంచి, చూపుడు వేలు ఏమాత్రం తగలకుండా, బొటన వేలుని నడిమి వేలు క్రింది కణుపు నకు గట్టిగా నొక్కిపెట్టి, తీర్థం క్రిందన పడకుండా, నోటి నుంచి జుర్రుకుంటున్నట్టు శబ్దం రాకుండా చూసుకుంటూ, సంబంధిత దైవ నామాలను స్మరించుకుంటూ భక్తి శ్రద్ధలతో తీర్థాన్ని తీసుకోవాలి.

**తీర్థాన్ని తీసుకోకూడని సందర్భాలు**

నొసట విభూతిగానీ కుంకుమగానీ లేనప్పుడు తీర్థ ప్రసాదాన్ని తీసుకోకూడదు. అంటు, పురుడు, మైల ఉన్నప్పుడు తీర్థం తీసుకోకూడదు. స్త్రీలు నెలసరి సమయంలో తీసుకోకూడదు. అపరిశుభ్రంగా ఉన్నప్పుడు అంటే స్నానాదికాలు ముగించుకోకుండాను, మల మూత్రాదులు అయినాక కాళ్ళు చేతులు కడుక్కోకుండాను తీర్థ సేవనం చేయకూడదు. తీర్థప్రసాదం ఏదైనా, అది ఏ రూపంలో ఉన్నా అతి పవిత్రమైనది. లాభకరమైనది మంగళకరమైనది.

# ది బెస్ట్ హెరిటేజ్ సిటీ.. బుడాపెస్ట్

స్విట్జర్లాండ్ రాజధాని జ్యూరిక్ నుంచి బుడాపెస్ట్ వరకు రైలు మార్గంలో సాగిన మా ప్రయాణం.. దారిపొడవునా మంచుదుప్పటి కప్పుకొన్న యూరప్ పట్టణాలను, పల్లెలనూ దాటుకుంటూ హంగరీ రాజధానికి చేరుకుంది. ఆ వారసత్వ నగరంలో.. అడుగడుగునా అద్భుతాలే! యూరప్ మొత్తంలో అత్యంత సాంస్కృతిక వైవిధ్యం, గొప్ప చరిత్ర కలిగిన నగరం హంగరీ రాజధాని బుడాపెస్ట్. యూరప్ ఖండం నడిమధ్యన ఉన్న బుడాపెస్ట్ నిజానికి 1873లో మూడు నగరాలు (బుడా, ఓబుడా, పెస్ట్) కలిస్తే ఏర్పడింది. బుడా ఓ కొండమీద ఉంటుంది. డాన్యూబ్ నదికి ఆవల ఉన్న పెస్ట్, ఓబుడా కొంతమేర మైదాన ప్రాంతాలు. గడచిన శతాబ్దకాలంలో రెండు ప్రపంచ యుద్ధాలలో తీవ్రంగా నష్టపోయిన హంగరీ అటు నాజీయిజం నుంచి ఇటు కమ్యూనిజం మీదుగా క్యాపిటలిజం వరకూ అన్ని ఇజాలనూ చవిచూసింది. భిన్నధ్రువాల మధ్య నలిగిపోతూ కష్టనష్టాలకు లోనైంది. మేము బుడా కొండ మీదున్న హిల్టన్ హోటల్‌లో దిగాం. దాని చుట్టూ అనేక పురాతన వారసత్వ కట్టడాలు ఉన్నాయి. తొలిరోజు ఉదయాన్నే లోకల్ టూర్ కోసం క్యాబ్ బుక్ చేసుకున్నాం.





లోకల్ గైడ్‌గా కూడా ఉపయోగపడే డ్రైవర్ కావాలని ముందే చెప్పాం. మేం వెళ్లే సరికి.. నలుపురంగు టొయోటా కారుతో ఆంద్రూ సిద్ధంగా ఉన్నాడు. ముందుగా, పక్కనే ఉన్న కొన్ని ప్రదేశాలు చూశాం.

**ప్రాచీన చర్చి**

మా హోటల్‌కు అనుకుని మత్థేయస్ చర్చి ఉన్నది. క్రీ.శ 1015లో హంగరీ రాజు సెయింట్ స్టీఫెన్ దీన్ని నిర్మించాడట. అనేక యుద్ధాలు, దాడులలో ధ్వంసమైపోవడంతో, 19వ శతాబ్దం చివరన పునర్నిర్మించారు. పక్కనే ఉన్న మరో చారిత్రక కట్టడం.. ఫిషర్మెన్స్ బాస్టియన్. 1700లలో నిర్మించిన ఒక కోటలోని భాగమే ఈ నిర్మాణం. బుడాపెస్ట్‌కు వెళ్లే ప్రతి టూరిస్ట్ ఈ కట్టడాన్ని తప్పక దర్శించాలి. డాన్యూబ్ నదికి సమాంతరంగా 140 మీటర్ల ప్రాకారం ఉంది. దానికి ఉన్న కిటికీల గుండా నగరం మొత్తం దర్శనమిస్తుంది. అక్కడే చాలాసేపు గడిపి, తదుపరి మజిలీకి బయలుదేరాం.



**వేడినీటి బుగ్గలు**

హంగరీకి సముద్ర తీరం లేకపోవచ్చు. కానీ ఈ దేశానికి విలువైన నీటి సంపద ఉన్నది. దేశమంతా విస్తరించి ఉన్న 1300 వేడి నీటి బుగ్గల్లో (హాట్ స్ప్రింగ్స్) 120 వరకూ ఒక్క బుడాపెస్ట్‌లోనే ఉన్నాయి. ఈ హాట్ స్ప్రింగ్స్‌లో ఔషధ గుణాలున్న ఖనిజాలు కరిగి ఉంటాయి. అందుకే, వందల ఏళ్ల క్రితమే ఇక్కడ అనేక స్నానశాలలు వెలిశాయి. బుడాపెస్ట్‌కు వచ్చే టూరిస్టులు ఆ వెచ్చని నీటిలో సేదతీరుతారు. మా క్యాబ్ డ్రైవర్ మమ్మల్ని 1918లో నిర్మించిన గిల్లెర్ట్ థర్మల్ బాత్‌కు తీసుకువెళ్లాడు. మేం స్నానం చేయలేదు కానీ.. ఆ పరిసరాలు చూసి, ఫొటోలు తీసుకుని వచ్చేశాం.

డాన్యూబ్ నది మీద 1840లలో కట్టిన మొదటి వంతెన చెయిన్ బ్రిడ్జ్. బుడా, పెస్ట్ నగరాలను తొలిసారిగా కలిపిన వారధి ఇదే. ఈ నగరంలో ఎత్తయిన భవంతులేవీ కనపడవు. నగరంలో అత్యంత ఎత్తయిన కట్టడాలు రెండే రెండు. ఒకటి సెయింట్ స్టీఫెన్స్ బాసిలికా, మరొకటి హంగరీ పార్లమెంటు భవనం. రెండూ కూడా 96 మీటర్ల ఎత్తే ఉంటాయి. హంగరీ దేశం క్రీ.శ. 896లో ఉనికిలోకి వచ్చింది. కాబట్టే ఆ రెండు భవంతులూ 96 మీటర్లు ఉంటాయని అంటారు. మేం బుడాపెస్ట్ వెళ్లింది జనవరి నెలలో. కానీ ఈ నగరాన్ని చూడటానికి మంచి సమయం.. మే నెల నుంచి అక్టోబర్ వరకు. మిగతా నెలల్లో వాతావరణం మరీ చల్లగా ఉంటుంది. బుడాపెస్ట్ ప్రజా రవాణా వ్యవస్థ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 1866లో మొదలైన ట్రామ్ సర్వీసు నేటికీ విజయవంతంగా నడుస్తున్నది. 1896లో బుడాపెస్ట్‌లో మొదలైన మెట్రో రైలు యూరప్ ఖండంలోనే అత్యంత పురాతనమైనది. ఈ మెట్రోను యునెస్కో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు. సిటీ బస్సులకైతే కొదవే లేదు. చార్జీలూ చవకే. బుడాపెస్ట్‌లో మరో ఆకర్షణ రూయిన్ బార్లు. రెండో ప్రపంచ యుద్ధం, తర్వాతి పరిణామాల్లో బుడాపెస్ట్‌లో కొన్ని భవంతులు శిథిలం అయ్యాయి. ఆ పాడుబడ్డ భవనాలనే ప్రత్యేక థీమ్ బార్లుగా మార్చారు. ఇవి ప్రతి రాత్రీ సందర్శకులతో కిక్కిరిసిపోతాయి.

**పాదరక్షలు.. రక్తపు మరకలు**

మర్నాడు ఉదయం క్యాబ్‌లో కూర్చునేసరికి సన్నగా ముసురు మొదలైంది. మూడు అంచెల దుస్తులు ధరించినా చలి వణికిస్తూనే ఉంది. మా డ్రైవర్ చెయిన్ బ్రిడ్జి దాటి డాన్యూబ్ నది అంచున ఉన్న రోడ్డు పక్కన ఆపాడు. రెండు గొడుగులు ఇచ్చి ఇక నడవమన్నాడు. మాకేమో చలికి వేళ్లు వంకర్లు పోతున్నాయి. కొద్ది దూరం నడిచాక.. జనం గుమికూడి ఉన్నచోట ఆగమన్నాడు. అక్కడ నేల మీద చెల్లాచెదురుగా కొన్ని బూట్లు పడున్నాయి. దగ్గరికి పోయిచూస్తే కానీ నిజం బూట్లు కావని తెలియలేదు. అవి ఇనుముతో చేసిన బూట్ల బొమ్మలు. రెండో ప్రపంచ యుద్ధంలో డాన్యూబ్ నది ఒడ్డున ఊచకోతకు గురైన యూదుల స్మారకార్థం.. హంగరీకి చెందిన కాన్ తోగే అనే సినిమా దర్శకుడు గ్యులా పార్ అనే శిల్పి కలిసి సృష్టించిన 'ద షూస్ ఆన్ ద డాన్యూబ్ బ్యాంక్' అది. వందలాది యూదులను ఆ నది ఒడ్డున నిలబెట్టి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపే ముందు.. ఆ పాదరక్షల్ని ఎవరికైనా అమ్ముకోవచ్చు అనే ఉద్దేశంతో అక్కడ వాటిని విడిపించిందట హంతక ముఠా. ఆ చీకటి రాత్రి నాజీల తూటాలకు నేలకొరిగిన యూదులను తలచుకుంటూ, ఆ బూట్లలో పుష్పాలుంచి భారమైన హృదయంతో



**అక్కడి నుంచి కదిలాం.**

అక్కడికి కూతవేటు దూరంలోనే.. హంగేరియన్ పార్లమెంటు భవనం ఠీవిగా దర్శనమిచ్చింది. 1902లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ భవంతి యూరప్ ఖండంలోనే అతి పెద్ద పార్లమెంటు భవనం కూడా. భవంతి ఆవరణలో 88 మంది హంగేరియన్ పాలకులు, రాజులు, మిలిటరీ కమాండర్ల విగ్రహాలు పెట్టారు. అందులో కొన్నిటి పేర్లు చదువుతూ ముందుకు సాగాం. అక్కడినుంచి నగరంలోని ప్రధాన షాపింగ్ ప్రాంతం వాసీ స్ట్రీట్‌కు తీసుకెళ్లాడు మా క్యాబ్ డ్రైవర్. అక్కడే కొంత షాపింగ్ చేసి, మధ్యాహ్న భోజనం కూడా చేశాం.

**హీరోస్ స్కేర్**

రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ పక్షాన నిలిచిన హంగేరియన్ పాలకులు సుమారు ఆరు లక్షల యూదులను ఊచకోత కోశారని చెప్పుకొచ్చాడు మా డ్రైవర్. యుద్ధం ముగిశాక రష్యా అధీనంలోకి వెళ్లింది హంగరీ. అప్పుడు, ఇంకోరకం హత్యాకాండ మొదలైంది. స్టాలిన్ నాయకత్వంలోని రష్యా కనుసన్నల్లో నడిచే ప్రభుత్వాలు మరోరెండు లక్షల మంది హంగేరియన్ల ఉసురు తీశాయి. సుమారు నాలుగు దశాబ్దాల కమ్యూనిస్ట్ పాలన తరువాత.. 1980లో జరిగిన తిరుగుబాటు కారణంగా క్యాపిటలిస్ట్ ప్రభుత్వం వచ్చిందని వివరించాడు. ఆరోజు కూడా ఆకాశం మేఘావృతమైంది. అప్పుడప్పుడూ చినుకులు రాలుతున్నాయి. మాటల్లోనే బుడాపెస్ట్ నడిబొడ్డున ఉన్న హీరోస్ స్క్వేర్ చేరుకున్నాం. 1896లో హంగరీ సహస్రాబ్ది సందర్భంగా ఇక్కడే ఓ స్మారక చిహ్నం నిర్మించారు. 1932లో దీనికి హీరోస్ స్క్వేర్‌గా నామకరణం చేశారు. నలుదిక్కులా అందమైన భవంతులతో, స్క్వేర్ మధ్యలో ఒక భారీ స్తూపంతో ఆకట్టుకునేలా ఉందీ ప్రదేశం. బుడాపెస్ట్‌లో చివరి రోజు సాయంత్రం మిత్రులమంతా డాన్యూబ్ నది ఒడ్డున కూర్చున్నాం.

ప్రపంచంలోనే అత్యధికంగా.. పది దేశాల గుండా ప్రవహించే మహానదిలో నిర్మలంగా పారుతున్న ఆ నీటికేసి చూస్తే.. ఇజాల మత్తులో పడి మూర? పుమానవులు ఈ నదిలో ఎంత నెత్తురు పారించారో కదా అనిపించింది. మనసు చివుక్కుమంది.

# హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో తిరిగొచ్చే ఈ టూరిస్ట్ స్పాట్స్ తెలుసా !







సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. ఉరుకులు..పరుగుల జీవన ప్రయాణంలో ఇల్లూ.. ఆఫీసుల మధ్య పనుల ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు.. కాసేపు ప్రకృతి ఒడిలో ఓలలాడుతున్నారు. మరీ కొత్త ప్రదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా.. కాస్త పరిచయం ఉన్న చోట్లకే టూర్లు వేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**లక్నవరం సరస్సు..** నగర పర్యాటకులను ఆకర్షించే ముఖ్యమైన వాటిల్లో లక్నవరం ఒకటి. హైదరాబాద్ నుంచి 220 కిలో మీటర్లు. ఈ ప్రదేశం చుట్టుపక్కల ఉండే ఏటూరునాగారం అభయారణ్య సందర్శకులను కనువిందు చేస్తున్నది. లేక్ క్రాసింగ్, రోప్ కోర్సులు, కయాకింగ్ వంటివి అందుబాటులో ఉంటాయి. దీనికి సమీపంలో బొగత జలపాతం కూడా కనువిందు చేసే పర్యాటక ప్రాంతం.

**శామీర్‌పేట్ లేక్..** హైదరాబాద్ శివారు ప్రాంతమైన శామీర్‌పేట్ సికింద్రాబాద్‌కు 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ ఎన్నో విలాసవంతమైన రెస్టారెంట్లు, హోటళు ఉన్నాయి. ఇక్కడ ఉన్న జింకల పార్క్‌లో జింకలతో పాటు నెమళ్లు, అనేక రకాల పక్షులు కనిపిస్తాయి.

**డిండి..** నల్గొండ జిల్లాలో ఉంది. హైదరాబాద్ నుంచి 108 కిలోమీటర్ల దూరం. సుమారు 2:30 గంటల జర్నీ. ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా ఉన్న డిండిలో సుందరమైన దృశ్యాలు అనేకం. ట్రెక్కింగ్, బ్యాక్ వాటర్ ట్రిప్స్‌తో ఎంజాయ్ చేయొచ్చు. శ్రీశైలానికి వెళ్లేదారిలో డిండిని చూసేందుకు పర్యాటకులు ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. నీటి అందాలతో సెల్ఫీలు దిగి సందడి చేస్తారు.

**కొండపోచమ్మ..** నూతనోత్తేజాన్ని నింపే అత్యుత్తమ క్యాంపింగ్ ప్రదేశంగా దీనిని చెప్పవచ్చు. హైదరాబాద్‌కు 50 కిలో మీటర్ల దూరంలో ఉంది. సిద్దిపేట జిల్లాలో ఉన్న ఈ రిజర్వాయర్ అందాలు ప్రత్యేకం. వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అందుకే ఇక్కడ క్యాంపింగ్ చేసేందుకు అధిక శాతం పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

**అనంతగిరి..** ట్రెక్కింగ్ కోరుకునే వారికి అనంతగిరి స్వర్గధామం. వికారాబాద్‌కు కేవలం పది కిలోమీటర్లు.. హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. అనంతగిరి కొండల చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతం.. నిర్మలమైన వాతావరణం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రాచీనమైన అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయాన్ని కూడా దర్శించుకోవచ్చు.

**కీసరపోదాం..** ఆధ్యాత్మిక ప్రాంతంగా పరిఢవిల్లుతున్న కీసర.. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి. పక్షుల కిలకిలరావాలు.. 'హరితహారం'తో స్వాగతం పలికే చెట్లు.. సుందరీకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న చెరువులు.. నలువైపులా వీక్షించేలా కొండపై కొలువుదీరిన వ్యూ పాయింట్స్.. అచ్చు ప్రకృతి సంపదతో నిర్మించినట్టుగా అనుభూతి కలిగించే ఆర్నమెంటల్ ఫెన్సింగ్.. ఆరోగ్యాన్ని పంచే ఔషధ మొక్కల కూడళ్లు.. నలువైపులా పరుచుకున్న పచ్చదనంతో కీసర.. పర్యాటకుల డెస్టినేషన్ లిస్టులో మొదటివరుసలోకి చేరింది. సుమారు 1562 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రాంతంలో విభిన్న రకాల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

**రాచకొండ కోట..** నగరం నుంచి 65 కిలో మీటర్ల దూరం. ఇది 14వ శతాబ్దానికి చెందిన కోట. ట్రెక్కింగ్‌కు అనుకూలం. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఉంది. కోట పై నుంచి చూస్తే ఆకుపచ్చని ప్రాంతాల అందాలు కనువిందు చేస్తాయి. హైదరాబాద్ నుంచి 207 కిలోమీటర్ల దూరం. సుమారు 4 గంటల జర్నీ. ఉత్తర తెలంగాణ జిల్లాకు వరప్రదాయిని. గోదావరి నది మీద కట్టిన ఈ ప్రాజెక్టును చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపిస్తారు. బడా పహాడ్ దర్గా, ఖిల్లా జైలు, సిర్నాపల్లి గడీ, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, దేవల్ మసీద్, కందకుర్తి త్రివేణి సంగమం, రామడుగు జలాశయం, అలీసాగర్ తదితర పర్యాటక ప్రాంతాలన్నింటినీ వీక్షించొచ్చు. ప్రముఖ పుణ్యక్షేత్రం ఇది. హైదరాబాద్ నుంచి 5 గంటల ప్రయాణం. సుందరమైన దృశ్యాలకు నెలవు. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం ఆనకట్టను వీక్షించొచ్చు. అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఇది ఒక్కటి. నది ఒడ్డున ఉన్న 12 జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించొచ్చు. భ్రమరాంబదేవి , సాక్షి గణపతి దేవాలయాలు న్నాయి. ప్రకృతి అందాలను వీక్షించొచ్చు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులే కాదు.. నగరానికి చేరువలో అనేక జలపాతాలున్నాయి. అందులో బొగత, నిర్మల్ జిల్లాలో కుంటాల, పొచ్చెర వంటివి ఉన్నాయి.

**నల్లమల అడవులు..** నగరం నుంచి 219 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో క్యాంపింగ్ చేయడం ఎంతో కిక్కిస్తుంది. ప్రకృతివనంలో ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. చుట్టూ ప్రకృతి అందాలతో నిండిన ఈ ప్రాంతంలో పర్యాటకుల సాహసాలను, ఉత్కంఠభరితమైన కార్యకలాపాలను ఆస్వాదించొచ్చు. సాహస భరిత అనుభూతిని పొందేందుకు సరైన డెస్టినేషన్ ఇది. పర్వతారోహణ, శివాలయం, కంబం సరస్సు అందుబాటులో ఉండే ప్రాంతాలు.

**సిటీ చుట్టూ థీమ్‌లు..** ఓఆర్ఆర్ నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో పదికి పైగా ఉన్న థీమ్ పార్కులు పర్యాటకులకు ఎంతగానో చేరువయ్యాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా రావిర్యాలలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.13 వద్ద అందుబాటులో ఉంటే వండర్ లా, శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలోని ఎస్కేప్ అడ్వెంచర్ వాటర్ థీమ్ పార్కు, శంకర్‌పల్లిలోని వైల్డ్ వాటర్ అమ్యూజ్‌మెంట్, వికారాబాద్ సమీపంలో ఉండే డ్రీమ్ వ్యాలీ వాటర్ పార్కులు, వికారాబాద్, భువనగిరి గుట్టల సమీపంలో ఉండే ట్రెక్కింగ్ స్పాట్లకు ప్రైవేటు టూర్ ఆపరేటర్లతోపాటు తెలంగాణ టూరిజం శాఖ కూడా టూర్లను ఆపరేట్ చేస్తున్నది. వీటికి సిటీ నుంచి గంటన్నర వ్యవధిలోనే చేరుకునే వీలు ఉండగా.. ఒకప్పుడు సిటీ దాటి వెళ్లేవారు కూడా ఈ ప్రాంతాలను ఒక్కసారైన సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**బ్బురపరిచే పార్కులు..** హైదరాబాద్ శివారులోనే ఉన్న కండ్లకోయ ఆక్సిజన్ పార్కును అడవిలాంటి ఉద్యాన వనం అనవచ్చు. అటవీశాఖ 75 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ఈ పార్కులో 50 వేల పైచిలుకు చెట్లున్నాయి. పెద్దల కోసం యోగా హాల్, వాక్‌వేలు ఉన్నాయి. పిల్లలకు ఆట స్థలాలున్నాయి. ట్రీహౌస్, పక్షులు సీతాకోకచిలుకల పార్కులు ఉన్నాయి. కుటుంబమంతా కలిసి పిక్నిక్ వెళ్లడానికి చక్కని చోటు ఇది. అలాగే కొత్తగూడలో 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బొటానికల్ గార్డెన్స్ ఆహ్లాదాన్ని పంచుతున్నది.





# చెరకు సాగుకు "శ్రీ" పద్ధతి లాభదాయకం..!

చెరకు సాగులో ఎక్కువ పెట్టబడి విత్తనానికే. దీన్ని తగ్గించటానికి పలు యత్నాలు జరిగాయి, జరుగుతున్నాయి. రైతు కమతాల్లో రూపుదిద్దుకొన్న 'శ్రీ' విధానంతో (సుగర్ కేన్ రెన్యూడ్ ఇంటెన్సిఫికేషన్) విత్తనం ఖర్చు సగానికి పైగా తగ్గింది. ఈ శ్రీ పద్ధతిలో ఖర్చు తగ్గుతుంది. నీరు ఆదా అవుతుంది. అంతర పంటలకు అవకాశం ఏర్పడుతుంది. చీడ-పీడల తాకిడి తగ్గుతుంది. పంచదార నాణ్యత పెరుగుతుంది. చెరకు దిగుబడి పెరుగుతుంది. చెరకును యంత్రాలతో నరికించడానికి అనువుగా ఉంటుంది. శ్రీ పద్ధతిలో చెరకు సాగు చేయటం వల్ల పలు లాభాలున్నాయి. సాధారణ పద్ధతిలో చెరకు నాటాలంటే హెక్టారుకు దాదాపు 10 టన్నుల విత్తనం కావాలి. టన్ను విత్తనం ధర 3,000ల రూపాయలు. హెక్టారుకు సరిపడే విత్తనం ఖరీదు 30,000ల రూపాయలు. కొన్ని ప్రాంతాల్లో సెంట్లు లెక్కన విత్తనం అమ్మటం కూడా ఉంది. ఒక హెక్టారుకు 30 సెంట్ల విత్తనం కావాలి. సెంటు విత్తనం ధర 1,000 రూపాయలు. ఈ విధంగా చూసిన హెక్టారుకు 30,000ల రూపాయలవుతుంది. శ్రీ పద్ధతిలో 1,000 విత్తనం గడలు హెక్టారుకు సరిపోతాయి. వీటి ఖరీదు సుమారుగా 1,5000 రూపాయలు. ఈ విత్తనం గడల ఆకురెలచి, హేండ్ కట్టర్ సహాయంతో చెరకు కన్ను భాగం (మొలచే భాగం) అర్ధచంద్రాకారంగా వేరు చేయాలి. ఇలా వేరు చేసిన కన్నులను విత్తనంగా ఉపయోగించి, మిగిలిన చెరకు ఫ్యాక్టరీకి పంపవచ్చు.

కన్నులు వేరు చేసినా, గడలు గడలుగానే ఉంటాయి. కాబట్టి ఫ్యాక్టరీకి పంపుట సులువు. కన్నులు తీసిన చెరకును ఫ్యాక్టరీకి పంపగలిగితే హెక్టారుకు అవసరమైన విత్తనం ఖరీదు 500 రూపాయలే. ఈ సందర్భంలో రైతుల్లో ఒక అనుమానం తలెత్తుతుంది. విత్తనానికి ఉపయోగించే చెరకు లేతగా 6-7 నెలల వయస్సు కలిగి ఉంటుంది. అలాంటి చెరకులో పంచదార పాళ్ళు తక్కువగా ఉంటాయి. కాబట్టి అలాంటి లేత చెరకును ఫ్యాక్టరీలు క్రషింగ్‌కు తీసుకోవనే భయం ఉంది. నిజమే! సహజంగా విత్తనానికి ఉపయోగించేది లేత చెరకే. దానిలో పంచదార శాతం తక్కువగా ఉండడం కూడా యదార్థమే. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి, చెరకు గడలో పంచదార శాతం తక్కువగా ఉండేది మొలక వచ్చే భాగంలోనే.

పంచదార తక్కువగా ఉండే భాగాన్ని అర్ధచంద్రాకారంగా వేరు చేసి, మొక్కలు పెంచటానికి ఉపయోగించుకుంటున్నాము. అంటే చక్కరేతర పదార్థం కొంత వరకు తొలగించబడుతుంది. మిగిలిన భాగంలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి పంచదార దిగుబడి శాతంలో మార్పు కనిపించదు. ఇక్కడ మరో విషయం గుర్తుంచుకోవాలి. శ్రీ చెరకు నారు పెంచటానికి లేత విత్తనమే



వాడాలనే నియమం లేదు. ముదురు తోటలలోని చెరకును కూడా కన్నులు కన్నులు తీయడానికి ఉపయోగించవచ్చు. గడ మొదటి భాగంలో కొంత భాగం వ్రేళ్ళు వేసి, గిడసబారిపోయి ఉంటాయి. అలాంటి వాటిని వదిలేసి, లేత భాగంలోనికన్నులు మాత్రమే స్వీకరించాలి. ముదురు గడ చివరి నుంచి మొదలకు 15 కన్నులు తీయవచ్చు. ఈ మొదలు భాగంలో పంచదార హెచ్చుగా ఉంటుంది. అలా పంపలేక వదిలేసినా, సాధారణ పద్ధతిలో 30,000 రూపాయలు విలువైన విత్తనం అవసరమైతే, శ్రీ పద్ధతిలో నాటడానికి వెయ్యి రూపాయల ఖరీద్కైన విత్తనం సరిపోతుంది.

హెక్టారు పొలంలో నాటటానికి సుమారు 12,000 మొక్కలు అవసరం. 10,000 మొక్కలతో సాగు చేసిన రైతులు కూడా మంచి దిగుబడే సాధించారు. మనం ఎంచుకున్న 1,000 విత్తనం గడల నుంచి సజావుగా మొలకెత్తగల కన్నులు 16 వేలు లభిస్తాయి. వాటిల్లో 80 శాతం మొలకెత్తినా హెక్టారులో నాటుకోటానికి సరిపోతాయి. విత్తనం గడ నుంచి కన్నులు వేరు చేయడం, కన్నులను శుద్ధి చేయడం, శుద్ధి చేసిన కన్నులను ప్లాస్టిక్ ట్రేలలో పెంచడానికి 15 మంది ఆడ కూలీలు అవసరమవుతారు. విత్తనం కన్నులను శుద్ధి చేయడం చాలా సులభం. ప్లాస్టిక్ టబ్‌లలో సగం నీరు పోసి, ఒకో టబ్‌లో 10 గ్రాముల బావిస్టిన్ మరియు 50 గ్రాముల ఫోరేట్ గుళికలు కలిపిన ద్రావణంలో విత్తనం కన్నులు పోసి 15 నుంచి 20 నిమిషాలు ఉంచితే సరిపోతుంది. లేదా 200 లీటర్ల డ్రమ్ముల్లో 20 గ్రాముల బావిస్టిన్, 40 గ్రాముల ఫోరేట్ గుళికలు కలిపిన ద్రావణంతో విత్తనం శుద్ధి చేయాలి. చేతి సంచుల నిండా విత్తనం కన్నులు పోసి, డ్రమ్ములలోని మందు ద్రావణంతో 20 నిమిషాలుంచి, ఆ తర్వాత ట్రేలలో పేర్చుకోవాలి.

శ్రీ చెరకు మొక్కలను పెంచటానికి "కాయిర్ పిట్" బాగా పనికొస్తుంది. వాటిని నివారించుకొని, కొద్దిగా నత్రజని ద్రావణం జల్లి "కాయిర్ పిట్"ను ట్రేలలో వుండే గుంతలను సగం వరకు నింపి దానిపై శుద్ధి చేసిన విత్తనం కన్నును మొలక భాగం పైకి ఉండే విధంగా పేర్చి, ఆ పైన ఎరువుతో ట్రేలు పూర్తిగా నింపాలి. అలా నింపిన ట్రేలను ఒకదానిపై ఒకటి దొంతర్లగా పేర్చాలి. 20 ట్రేల వరకు ఎత్తుగా దొంతర్లుగా పేర్చి చుట్టూ పాలిథీన్ షీట్‌తో కప్పాలి. ట్రేల దొంతర్లలోకి గాలి జొరబడకుండా జాగ్రత్త పడాలి. రెండు, మూడు రాత్రులలా వుండే సరికి ట్రేల నుంచి మొలకలు వస్తాయి. విత్తనం స్వభావం, విత్తనం వయస్సు, గాలి జొరబడకుండా తీసుకొన్న చర్యలను బట్టి, మొలక వచ్చే వ్యవధి ఆధారపడి వుంటుంది. ట్రేలు నుంచి కనులు పొడుచుకు రావటం గమనించిన రోజు సాయంత్రం, ముందే తయారు చేసి వుంచుకొన్న బెడ్‌ల మీద వరుసగా పేర్చాలి.

ట్రేలు పేర్చిన రోజు గాని, మరుసటి రోజు ఉదయం గాని నీళ్ళు జల్లకూడదు. మరుసటి రోజు సాయంత్రం తప్పని సరిగా నీళ్ళు చల్లాలి. రోజ్ క్యాన్‌లతో కూడా నీరు చల్లవచ్చు. అలా ప్రతి రోజు సాయంత్రం నీరు చల్లాలి. మొక్కలు మారాకు తొడిగే దశలో కొద్దిగా ఎండోసల్ఫాన్ మందును నీటలోకి కలపడం అవసరం. పది లీటర్ల నీటికి 2 మి.లీ. మందు సరిపోతుంది. 10,12 రోజులకు మొలకలు రావటం పూర్తవుతుంది. కొన్ని చోట్ల కన్నులుండి, మొలకలు రాకపోవటం గమనిస్తాము. 15 రోజులు తర్వాత గ్రేడిరగ్ చేయాలి.

చిన్నగా వున్న మొక్కలను వేరే ట్రేలలోకి సర్దాలి. మొక్కలు రాని గళ్ళలో కూడా వేరే ట్రేలలో మొక్కలను తెచ్చి సర్దితే అపుడు పెద్ద మొక్కలన్నీ ఒక చోటకు, చిన్న మొక్కలన్నీ ఒక చోటకు చేరతాయి. 18, 20 రోజులు వయస్సులో మొక్కలపై చల్లే నీటిలో కొద్దిగా యూరియా కలపటం అవసరం. 28 రోజుల వయస్సు దాటిన మొక్కలను పొలంలో నాటుకోవచ్చు. అప్పటికే మొక్క వేరు గూడు కట్టుకొంటుంది. కాయిర్ పిట్ కూడా రాలిపోకుండా వుండ చుట్టుకుపోతుంది. మొక్క పట్టుకుంటే వేర్లుకు హాని జరగకుండా ఉండలా బయటకు వచ్చేస్తుంది. ట్రేల నుంచి తీయక ముందే పిలకలు వేయటం గమనించవచ్చు. 30 రోజులకు మొక్కలు తయారవుతాయి.

# రైతుకు అధిక దిగుబడికి సూచనలు..!



దేశంలో దాదాపు 80 శాతానికి పైగా చిన్న సన్నకారు రైతులే ఉన్నారు. వీరికి పంటల బీమా, మార్కెటింగ్ సదుపాయాలు, మద్దతు ధరలు, రాయి తీల వంటి విషయాల్లో సరైన సహకారం అందడం లేదు. అనేక సంవత్సరా లుగా భూమి, నీరు వంటి సహజ వనరులను నిర్లక్ష్యం చేశాం. దీనివల్ల వాటిపై ఒత్తిడి పెరిగి, పంట దిగుబడులు పూర్తిగా పడిపోతున్నాయి. మనం అనుసరిస్తున్న నూతన విధానాలు సహజ వనరులను తక్కువ వినియోగిం చుకుంటూ.. వాతావరణానికి ఎలాంటి హాని చేయకుండా ఉండాలి. నూతన పరిజ్ఞానం, పద్ధతులు, రకాల అభివృద్ధిపైన దృష్టి సారించాలి. వ్యవసాయంలో రైతులు సుస్థిరాభివృద్ధి సాధించాలంటే అస్థిరమైన రుతుపవనాలు, మార్కెట్ సమస్యలను ఎదుర్కొనేలా సంస్థాగతమైన విధానాలను రూపొందించాలి.

విశ్వవిద్యాలయాల్లో, విస్తరణ కార్యక్రమాల్లో, సహకార సంఘాల్లో చిన్న, సన్న కారు రైతులను నిర్లక్ష్యం చేయకుండా కృషిచేస్తేనే వ్యవసాయంలో సుస్థిరాభి వృద్ధి సాధ్యమవుతుంది. తాత్కాలికంగా వచ్చే సంక్షోభాలను తట్టుకొని కరవు పరిస్థితుల్లో కూడా రైతులు ఆదాయాన్ని గడించేలా విధానాలు ఉండాలి. దేశ వ్యవసాయరంగంలో కావాల్సినంత మానవ, సాంకేతిక వనరులున్నాయి. అయితే ప్రణాళికా వేత్తలు దీన్ని వ్యాపార అవకాశాలుగా మార్చడంలో నిర్లక్ష్యం చేశారు. రెండో పంచవర్ష ప్రణాళిక నుంచి సేద్యానికి కేటాయింపులు తగ్గి చారు. పట్టణ నిరుపేదలకు చౌకగా ఆహారధాన్యాలను పంపిణీచేసే వనరు గానే వ్యవసాయరంగాన్ని చూశారు. దీనితోనే ప్రజాపంపిణీ వ్యవస్థ వచ్చింది. ఆహారధాన్యాల సేకరణ, ధరల విధానంతో రైతులు తాము పండించిన ధాన్యం రవాణాలో ఆంక్షలు విధించారు. మారుతున్న పరిస్థితులకు అనుగు ణంగా ప్రభుత్వాల తీరు మారకపోవడంతో వ్యవసాయరంగంలో ఎన్నో సమ స్యలు తలెత్తుతున్నాయి.

**అధిక ఉత్పత్తి ఖర్చులు:** సుస్థిర సాంకేతిక పరిజ్ఞానం ఆచరణలో సరైన పరిశోధన, అభివృద్ధి లేకపోవడం. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి పరచ కపోవడం. వ్యవసాయ విస్తరణ వ్యవస్థ పూర్తిగా విఫలమవ్వడం. ఎరువులపైన రాయితీ అసంబద్ధంగా ఉండటం. కాంప్లెక్సు ఎరువులు, పురుగుమందుల ధరల విధానంపై నియంత్రణ లేక పోవడం. విచక్షణారహితంగా పురుగుమందులు, ఎరువులు వాడటం వల్ల పెట్టుబడి ఖర్చులు భారీగా పెరగడం. పంట ఉత్పాదకతలు తక్కువగా ఉండటం..

**రైతుకొచ్చే వాటా స్వల్పం:** వినియోగదారుడు చెల్లించే దానిలో రైతులకు వచ్చేది చాలా తక్కువగాఉంటుంది. సింహభాగం దళారులకే వెళుతోంది.

**దీనికి కారణాలు:** రైతు ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం. రైతు మార్కెట్లు లేకపోవడం. మార్కెట్ యార్డుల్లో నిల్వ సదుపాయాలు లేకపోవడం. సరైన సారథ్యం, అవగాహన లేమితో సహకార సంఘాలు విఫలమ య్యాయి.

**సూచనలు:** ఉత్పత్తి ఖర్చు తగ్గించి, ఉత్పాదకతను పెంచాలి. పెట్టుబడులు తగ్గించాలి. వ్యవసాయం సుస్థిరంగా, ఆచరణీయంగా, అనుకూలంగా ఉండాలి. ఈ దశలో పరిశోధనలు ఎక్కువగా జరగాలి. రైతుల్లో సమగ్ర సస్యరక్షణ (ఐ.పి.ఎం.) సమగ్ర పోషక యాజమాన్యంలో (ఐ.ఎన్.ఎం.) అవగాహన కల్పించేందుకు పెద్దపీట వేయాలి. పోలియో నిర్మూలనలో చేస్తున్నట్లుగా ప్రభుత్వం తీవ్రస్థాయిలో దీనిపై ప్రచారం చేయాలి. రైతులకు అవరమయ్యే విషయాలపైన ప్రభుత్వం విస్తృత ప్రచారం చేపట్టి వారు ఆచరించేలా ఒప్పించాలి. పరిశోధన సంస్థల్లో శాస్త్రవేత్తలు తమ ఇష్టానుసారంగా కాకుండా స్థానిక సమస్యల ప్రాతిపదికన పరిశోధనలు నిర్వహించాలి. ప్రభుత్వం యూరియా పైన రాయితీ తగ్గించాలి. లేదంటే దాని వాడకం.

విపరీతంగా పెరిగి వాతావరణ, పర్యావరణ సమస్యలు తలెత్తుతాయి. లి హానికర పురుగుమందులపైన ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. అధిక పన్నులు విధించి వీటి ఉత్పత్తి తగ్గేవిధంగా కట్టడి చేయాలి. అత్యవసర పరిస్థితుల్లోనే రైతులు వీటిని వాడేలా చూడాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో చదువులు కేవలం పట్టాల కోసమే కాకుండా స్వల్పకాలిక స్వయం ఉపాధి పరిశ్రమలు నిర్వహించుకునేందుకు వీలుగా విద్యాప్రణాళిక ఉండాలి.

వ్యవసాయంలో సుస్థిర సాంకేతిక పరిజ్ఞానం తెలిసేవిధంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రస్తుత పరిస్థి తుల్లో ఇది చాలా ముఖ్యం. ఉదాహరణకు వరిసాగు తీసుకుంటే రైతులు ఎకరాకు 25-30 కిలోల విత్తనంతో పెంచిన నారు వాడుతున్నారు.

# పట్టుపురుగులలో సోకే సున్నపుకట్టు రోగం ఎలా వస్తుంది..!



వర్షాకాలం, చలికాలాల్లో పట్టుపురుగుల పెంపకంలో సున్నపుకట్టు రోగం ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తుంది. ఈ సంవత్సరం కొన్ని ప్రాంతాలలో మంచి వర్షాలు కురిసి, గాలిలో తేమ పెరిగినందున ఈ రోగం పట్టు పురుగులకు ఎక్కువగా సోకేందుకు ఆస్కారముంది. అందువల్ల వర్షాకాలం, చలికాలంలో పురుగులు ఈ రోగ బారిన పడకుండ అవగాహన కల్గి, తగిన ముందు జాగ్రత్త.

**చర్యలు పాటించాలి :** సున్నంకట్టు రోగం ఎలా సోకుతుంది? పట్టు పురుగులకు సున్నంకట్టు రోగం బావిరియా బాసియానా అనే శిలీంద్రం వల్ల సోకుతుంది. ఇది అంటువ్యాధి. రోగగ్రస్త పురుగులు ఆరోగ్యవంతమైన పురుగుల దేహానికి తగిలినా అంటుకున్నా ఈ రోగం సోకుతుంది. ఈ రోగం పట్టుపురుగులకే కాక మల్బరీ, ఇతర తోటల్లోని కీటకాలకూ సోకుతుంది. రోగ లక్షణాలు: ఈ రోగం సోకిన పట్టుపురుగులు మొదట మెత్తబడి చనిపోతాయి. చనిపోయిన పురుగులు దేహం నెమ్మదిగా గట్టిపడి, దేహం నుంచి శిలీంద్రజాలం బయటికి చొచ్చుకొని వచ్చి దేహమంతా తెల్లనిసుద్దముక్కవలె మారుతుంది. పురుగులు మొదట గోధుమరంగుతో గృహ పట్టు కూడిన పింక్ రంగులోకి మారుతాయి. ఈ రంగు ఒకరకమైన బ్యాక్టీరియా (సెర్రిషియా మార్సిసెన్స్) వల్ల వస్తుంది. తరువాత క్రమంగా కొన్ని వల్ల శిలీంద్రజాలం దేహమంతా కప్పి వెలువ ఆ. ఈ తెల్లని సుద్దముక్కవలె మారుతుంది.

రోగవ్యాప్తి: రోగ వ్యాప్తికి మూలాధారం రోగగ్రస్త పురుగులు, ఇతర కీటకాలైన ఆకు చుట్టు పురుగు ఎర్రగొంగళి పురుగులు మొదలైనవి. ఈ రోగ గ్రస్త పురుగులపై ఉన్న అసంఖ్యాక జాగ్రత్త శిలీంద్ర కొనిడియాలు తేలికగా , గాలి ద్వారా వ్యాప్తి చెందుతాయి. కొన్నిసార్లు పల్లెలోని రైతుల గృహాల్లోకి కూడా ఇవి వ్యాపిస్తుంటాయి. పురుగుల 5వ దశలో (ఆఖరి బ్యాక్తి దశలో) ఈ రోగం సోకితే, చనిపో సెన్స్) ఒక పురుగు దేహం నుంచి కొన్ని కోట్ల శిలీంద్ర కొనిడియాలు వెలువడుతాయి. ప్రతి ఒక కొనిడియారోగాన్ని కలిగించే సామ ర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇతర కీటకాలనుంచి ఈ రోగం సోకకుండా పట్టుపురుగులను కాపాడాలి. దీనికోసం మల్బరీ, ఇతర తోటలోని కీటకాలను నివారించాలి. పట్టుపురుగుల పడకల నుంచి రోగగ్రస్థ పురుగులు చనిపోయి గట్టి ఏర్ప పడకముందే వాటిని తీసివేసి,వాటిపై శిలీంద్ర నాశక పొడులను చల్లి తరువాత కాల్చివేయాలి. రోగ గ్రస్థ పురుగులను బయట పడవేయాలి. మిశ్రమం తయారీ: 2 శాతం కాప్టాన్ సున్నపు పొడి , 2 పాళ్ళ కాప్టాన్ పొడిని 98 పాళ్ళ సున్నపు పొడినందు (20 గ్రా. కాప్టాను 980 గ్రా. సున్నపుపొ డిలో కలిపితే ఒక కిలో మిశ్రమం తయారవుతుంది) బాగా కలపాలి. 2 శాతం డైథేన్ ఎం-45 కెవొలిన్ మిశ్రమం: 2 పాళ్ళ డైథేన్ ఎం-45 పొడిని 98 పాళ్ళ కెవొలిన్ (20గ్రా. డైథేన్ ఎం-45ను 980 గ్రా. కెవొలిన్ పొడితో కలిపితే ఒక కిలో మిశ్రమం తయారవుతుంది) పొడి తో కలపాలి.